ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డా॥ తుమ్మూరి కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 7**
**అక్టోబర్ 2004**
**తారణ : భాద్రపదం - అశ్వీయుజం**
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**


## స్మరణ, సమర్పణ

గురుదేవుల స్మరణలో శిష్యుల సమర్పణ శక్తి ఇమిడి ఉంది. స్మరణ ఎంత సాంద్రంగా ఉంటే, ఎంత చిక్కగా ఉంటే - సమర్పణ అంత తీవ్రంగా ఉంటుంది. గురుదేవుల జన్మదినపు పవిత్రత నేడు స్మరణ, సమర్పణలు రెండింటిలో కొత్త జీవాన్నీ, జవాన్నీ నింపింది. స్మరణ, సమర్పణల, భక్తి స్పందనల పరంపరల స్పర్శ అంతఃకరణను పులకింపజేస్తోంది.

ఆ స్పర్శ స్మృతి ఫలకంపై వేసిన చెరగని ముద్రలు ఎన్నెన్నో. గురుదేవుల చరణాలకు నుదురు తాకించినప్పటి స్పందనల స్మృతులు. ప్రేరణ ఇచ్చే శక్తివంతమైన ఆయన వాణి. శిష్యగణానికి నిరంతరం నవజీవనాన్ని ప్రసాదించే వాణి. ఆ వాణి వినగానే శిష్యుల చేతనలో కొత్త దారులు తెరుచుకునేవి. సమర్పించాలనే నిష్ఠ దృఢతరం అయ్యేది. ఎన్నెన్ని జ్ఞాపకాలు, ఎన్నెన్ని భవ్య స్మృతులు శిష్యుల ఆంతరిక చేతనలో భక్తిభావన సముద్రంగా పొంగిపొరలుతున్నాయో! గురుదేవులు ఎక్కడ ఉన్నారని ఎవరైనా అడిగితే వచ్చేది అనుభూతితో తడిసిన ఈ సమాధానమే - భక్తిభరితములైన తన శిష్యుల హృదయాలలో ఆయన ఉన్నారని.

మన ప్రభువు దేహాతీతులై తమ శిష్యుల భావ చేతనలో వ్యాపించిపోయారు. శిష్యుల పులకింతలో, రోదనలో, వేదనలో, భక్తిలో, అనురక్తిలో, వ్యాకులతలో, విహ్వలతలో, పూజలో, ప్రేమలో, విరహంలో- ఆయనే, కేవలం ఆయనే వ్యక్తం అవుతారు. వారి జ్ఞాపకాలలో ప్రతి ఒక్కటీ గుండెను పిండుతుంది. నిజమే. ఆ జ్ఞాపకమే సమర్పణ భావాన్ని దృఢతరం చేస్తుంది. ఇదీ నిజమే. స్మరణ, సమర్పణ రెండుగా కనిపిస్తాయి. అయితే అవి రెండు కావు. స్మరణ ఉన్నచోట సమర్పణ ఉన్నది.

గురుదేవుల జయంతి పవిత్రతలో స్మరణలోని తీవ్రత పెరిగింది. దానితో పాటు సమర్పణలోని దృఢత్వమూ పెరిగింది. గురుదేవుల జ్ఞాపకాలు నేడు శిష్యుల మనసులలో పులకింతలనూ, పూజా భావననూ మాత్రమే సృష్టించడం లేదు. వాటిలో సమర్పణ చేయాలనే మహానిష్ఠకూడ ఇమిడి ఉంది. సంకల్పపు ఈ హుంకారం కూడ ఉంది - ఓ గురుదేవా! నీవు మలచిన, నీవు తీర్చిదిద్దిన ఈ జీవితంపై పూర్తి అధికారం నీదే. నీది మాత్రమే. ఓ అంతర్యామీ! మేము సదా నీ కోసం, నీ పరాచేతనలో విలీనం కావడం కోసం క్షణం క్షణం తపిస్తూ ఉంటాం. కణ కణమూ జ్వలిస్తూ ఉంటాం. నీ స్మరణ, నీ సమర్పణ - ఇదే మా జీవన లక్ష్యం. ఈనాడూ, ఇకముందూ.

H H H

**స్వార్థ సంకుచితత్వాలు ఆధ్యాత్మిక దారిద్ర్యానికి లక్షణాలు.**

# విషయ సూచిక

ముఖ చిత్రం : పరమపూజ్య గురుదేవులు,
పరమవందనీయ మాతాజీ


1. **సంపాదకీయం :**
   స్మరణ, సమర్పణ 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం - 1 :**
   అయిదు సూక్ష్మ శరీరాల అద్భుత పాత్ర 4
5. **ముఖచిత్ర కథనం - 2 :**
   ఔదార్యానికీ, సహనానికీ మూర్తిరూపం ఆమె 9
6. **ముఖచిత్ర కథనం-3 :**
   ఆశగా మారిన నేహ నిరాశ 12
7. **దుఃఖ మీమాంస :**
   దుఃఖాలకు మూల కారణాలు 15
8. **నావారితో నామాట :**
   విరాట్‌యాత్ర సాగిస్తూన్న మహోద్యమం - 1 18
9. **శతసూత్ర కార్యక్రమం :**
   యుగనిర్మాణానికి ఆధ్యాత్మిక ప్రాతిపదిక 21
10. **సాధన విజ్ఞానం :**
    ఉపాసనలో ఏకాగ్రతను సాధించడం ఎలా? 23
11. **సమాజ నిర్మాణం :**
    జన జాగరణ కేంద్రాలుగా దేవాలయాలు 25
12. **కృష్ణావతారం - 23 :**
    పాండవులకు మార్గ దర్శనం 28
13. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 10**
    భాగవత భూమికి యాత్ర - 3 30
14. **యుగ గీత :**
    ఇంద్రునిది దేవగుణం, విరోచనునిది అసురగుణం 34
15. **మాతాజీ దివ్య జీవనం : 12**
    ప్రేమను, మమతనూ పొందిన ప్రవాసీ పరిజనులు 36
16. **వ్యక్తి నిర్మాణం :**
    నైతికతకు నాలుగు ముఖాలు 40
17. **బోధ కథ :**
    సంభవామి యుగే యుగే 42
19. **వార్తలు :** 45


# శ్రీ దత్తప్రసాద్ అస్తమయం



నిష్ఠావంతుడైన గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీ.జి.వి.ఎస్.దత్త ప్రసాద్ ఆగస్టు 21న స్వర్గస్థులు అయినారు.

శ్రీదత్త ప్రసాద్ 1958 అక్టోబరు 11న జన్మించారు. హైదరాబాదు జీడిమెట్లలోని ఎస్.ఎస్.డి పాలిమర్స్‌లో డిప్యూటీ మేనేజరుగా పనిచేశారు. రబ్బరు వస్తువుల వ్యాపారంలో భాగస్వామిగా 3 సంవత్సరాలు పనిచేశారు. హైదరాబాదు ఎస్.ఆర్.నగర్‌లో మోహన్ అండ్ కో లో చార్టర్డ్ అక్కౌంటెంట్‌తో 7 సంవత్సరాలు పనిచేశారు.

1999 డిసెంబరు నుండి 2004 ఆగస్టు 20 వరకు హైదరాబాదులోని యుగశక్తి గాయత్రి కేంద్రంలో పనిచేశారు.

ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించవలసిందిగా ఆ గాయత్రీ మాతను ప్రార్థిస్తున్నాం.

# పాఠకులకు ముఖ్య సూచన

యుగశక్తి గాయత్రీ కేంద్రం కార్యాలయం మార్చబడింది. కనుక పాఠకులందరూ ఎలాంటి అవసరాలకైనా క్రింది చిరునామాతో సంప్రదించగలరు -

**YUGA SHAKTI GAYATRI KENDRA**
16-2-67/73,
RAMMURTHY NAGAR,
CBCID Officers Colony,
Hydernagar,
(Po) Kukat Pally,
Hyderabad - 500 072.
Ph: 040 - 23893241, 23899619.

**చింతలో కూరుకుపోవడంకన్న కష్టానికి పరిష్కారం కనుగొనడం ఉత్తమం.**

# వేద మంత్రం

మానో అగ్నేమతయే మా వీహితాయై రీరధః ।

మాగోతాయై సహసస్పుత్ర మా నిద్వేప ద్వేషాం స్యయా కృధి ॥

-(ఋగ్వేదం 3/16/5)

**భావార్థం** : మన మానవ జీవన సాఫల్యం కోసం మనం బుద్ధిమంతులము, వీరులము ధనవంతులము కావలెను. మనం నిందించేవారుగా, ధూర్తులుగా, చాడీలు చెప్పేవారుగా, అపకారులుగా కాకూడదు. బుద్ధిహీనులం కాకూడదు. జీవితమంతా సుఖంగా ఉండి పరమాత్మ ఉపాసన చేసుకోవాలి.

**సందేశం** : ప్రపంచంలో ప్రతి వ్యక్తీ సుఖంగా ఉండాలని అనుకుంటాడు. ఇందుకు రకరకాల ప్రణాళికలు రూపొందించి తన బుద్ధి ద్వారా, సామర్థ్యం ద్వారా సాధనాలను వికసింపచేసుకుంటాడు. ఒక నిర్వివాద సత్యమేమంటే దుఃఖం కూడా జీవితంలోని అవిచ్ఛిన్నమైన అంగము. మనుష్యుడు ఎంత ప్రయత్నించినా తన దుఃఖాన్నుండి నివృత్తి పొందలేడు. ప్రపంచంలో దుఃఖ కారణాలెన్ని ఉన్నాయంటే మనిషి ఎంత ఆలోచించి విచారించి పనిచేసినా ఏదో ఒక వైపు నుండి దుఃఖం దాడి చేస్తూనే ఉంటుంది. పెద్ద పెద్ద జ్ఞానులు, ధనవంతులు కూడా దీని నుండి తప్పించుకోలేరు. వాస్తవానికి ప్రపంచంలో సుఖ సాధనాలు ఎన్నో ఉన్న వ్యక్తులు కూడా దుఃఖం చేత చుట్టుముట్టబడి ఉన్నారు. మనుష్యుడు దుఃఖం నుండి తప్పించుకోలేనప్పుడు, దుఃఖాన్ని స్వాగతించుటకు అతడు మానసికంగా సిద్ధంగా ఉండాలి. అప్పుడు దుఃఖం అతణ్ణి ఎక్కువగా బాధించదు.

ప్రపంచంలో అన్ని రకాల దుఃఖాలను నవ్వుతూ నవ్వుతూ గడిపి వేయుటకు మనం ధీరులం, వీరులం, గంభీరులం కావాలి. దానిలోనే మన ప్రతిభ, యోగ్యతల సార్థకత ఉన్నది. సుఖవంతమైన రోజులు శాశ్వతం కానప్పుడు, దుఃఖకరమైన రోజులు కూడా త్వరలో అంతమవుతాయనే విషయం ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. జీవితంపట్ల నిరాశావాదంతో కూడిన దృష్టికోణం కూడా మనుష్యుణ్ణి ఎక్కువ దుఃఖితుణ్ణి చేస్తుంది. నిరాశా వాదం నుంచి రక్షించుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నించాలి.

దుఃఖాలు చాలావరకు మనుష్యుడు తన అజ్ఞానం, మానసిక వికారాలు, మోసము, కపటము, స్వార్థములతో స్వయంగా ఉత్పన్నం చేసుకున్నవే. మనిషి తన చేతలతో స్వయంగా తనను తాను సర్వనాశనం చేసుకున్నాడు. ఇదే దయనీయ స్థితికి కారణం. మనుష్యుడు తన దుర్గుణాలు, దుర్వ్యసనాల ద్వారా చికాకులు తల ఎత్తే వాతావరణం ఏర్పాటు చేసుకుంటున్నాడు. దీనితో అతని వివేకం, ధైర్యం నశించి తన కష్టాలు పోగొట్టుకొనే మార్గాన్ని స్వయంగా కనుక్కోలేక పోతాడు. ఇతరులు సలహా లిస్తే, వాటిని కూడా భరించలేకపోతాడు. ఈ విధమైన మానసిక వికృతి అతని దుఃఖాన్ని మరింత పెంచే పని చేస్తుంది. దుఃఖాల నుండి విముక్తికి మనుష్యుడు తనకు తానే సహాయం చేసుకోవాలి. మనుష్యుడు ఎల్లవేళలా పువ్వుల్లా నవ్వుతూ ఉండటం అభ్యసిస్తే అతని బుద్ధి శీఘ్రంగా స్థిరత్వాన్ని పొందుతుంది. దీనితో క్రమంగా సుఖము వృద్ధి అవుతుంది.

**సుఖ్ దుఖ్ థా సంసార్‌మే, సబ్‌గాహు హో హోయ్ ।**

**జ్ఞానీ కాటే జ్ఞాన్ సే, మూరఖ్ కాటే రోయ్ ॥**

అర్థము: ప్రపంచంలో అన్నిరకాలైన సుఖ దుఃఖాలు ఉంటాయి. జ్ఞాని తన జ్ఞానంతో అధిగమిస్తే మూర్ఖుడు రోదించుట ద్వారా.

మన జ్ఞాన సార్థకతకు ఇదే కొలబద్ద.

H H H

**ఒక ఉన్నతాదర్శంకోసం కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తి మహాపురుషుడు.**

## ముఖచిత్ర కథనం-1

# అయిదు సూక్ష్మ శరీరాల అద్భుత పాత్ర

"నీవు ఒకటినుండి ఐదుగురుగా మారాలి. పంచ పాండవులవలె ఐదు రకాలుగా పనిచేయవలసి ఉన్నది. కాబట్టి ఈ ఒక్క శరీరాన్నే ఐదుగా చేయాలి. ఒక గూటిలో ఐదు పక్షులు నివసించగలవు. నిన్ను నీవు ఐదు శరీరాలుగా విభాగించుకో. దీనిని "సూక్ష్మీకరణ" అని అంటారు. ఈ ఐదు శరీరాలు కంటికి కనిపించని సూక్ష్మరూపంలో ఉంటాయి. ఎందుకంటే, ఈ విస్తృత రంగాన్ని నిర్వహించగలగడం ఒక్క సూక్ష్మసత్తా వలన మాత్రమే సాధ్య పడుతుంది. ఈ పంచ శరీరాలు పరిపక్వమై వీటికి స్వతంత్రంగా పనిచేయగలిగే శక్తి వచ్చేవరకూ నీ శరీరంతో వీటి పోషణ చేస్తూ ఉండు. ఇందుకు ఒక సంవత్సర కాలం పట్టవచ్చు, లేదా ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. అవి సమర్థవంతంకాగానే కార్య నిర్వహణ కోసం వాటిని విడుదలచెయ్యి. కాలం తీరినప్పుడు నీకున్న స్థూల శరీరం ఈ లోకంనుండి శెలవు తీసుకుంటుంది. అప్పుడు కూడా ఈ సూక్ష్మశరీరాలు తమ పనులు చక్కబెడుతూనే ఉంటాయి." (1985 ఏప్రిల్, అఖండజ్యోతి)

ఈ మార్గదర్శనం నాల్గవసారి హిమాలయ యాత్రకు వెళ్లినప్పుడు పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీకి తమ గురుసత్తానుండి ప్రాప్తించింది. ఏమి చేయాలి? ఎలా చేయాలి? అన్న విషయం హిమాలయవాసి అయిన గురుసత్తా వారికి తన పరావాణి ద్వారా వివరించింది. ఐదు శరీరాలతో చేయవలసిన ఐదు పనులు ఇలా ఉన్నాయి- (1) వాయుమండల పరిశోధన (2) వాతావరణ సంస్కరణ (3) నవయుగ నవనిర్మాణం (4) మహావినాశనమును నిరోధించుట (5) దేవమానవులను తయారు చేయుట, వారిని అభివృద్ధి పరచుట.

1984లో మొదలైన ఈ సావిత్రీ సాధన పూజ్యవరుల రూపమును సంక్షేపంగా దర్శింపచేస్తుంది. అందులో వారు విరాట్ రూపమును మించిన విరాట్‌తమ రూపం అయిపోతుండేవారు.

పూజ్య గురుదేవులు సూక్ష్మీకరణ గురించిన ఈ రహస్య విజ్ఞానమును మరింత స్పష్టంగా అప్పటి అఖండ జ్యోతిలో ఇలా వ్రాశారు- "ఈ ప్రక్రియలో ప్రాణ ఊర్జ(శక్తి)ను ఎంత ప్రచండం చేయవలసి ఉంటుందంటే, దానితో తన అంతరంగంలోని సన్నిహితమైన ఐదు కోశములను కరిగించి ఒకే స్వతంత్ర రూపంలో వీటి శక్తి నిర్మితం కాగలిగేంతగా వేడి సెగలు పుట్టించాలి."

ఈ సాధన తర్వాత మిషన్ విరాట్ పంచకోశ శరీరంలో ఇచ్చిన గొప్ప మలుపు ఏమిటంటే-గురుదేవులతో పాటు అది కూడా విరాట్ రూపం పొందుతూవచ్చింది. ఆ శక్తి ఎంత మందికి తమ ధ్యాన- సాధనల్లో, స్వప్నాలలో, రోజువారీ కార్యకలాపాలలో మార్గదర్శనం అనే అనుభూతుల రూపంలో లభించసాగిందో చెప్పలేము. వీటి వివరాలు సేకరించి వ్రాస్తే పెద్ద గ్రంథం అవుతుంది. విశ్వకుండలినీ జాగరణ, తర్వాత పంచ వీరభద్రుల ఉత్పాదన రూపంలో మూడు సంవత్సరాల సావిత్రీ సాధన (1984 నుండి 1987 వరకు జరిగింది) పరిణతమయింది. వారి ఈ సావిత్రీ సాధన ఆత్మిక చేతనకు సవితా చేతనకు మధ్య తారతమ్యం స్థాపించడానికి మూలాధారమైనది. 1984 శ్రీరామనవమి నుండి ఆరంభమై 1987 నాటికి దేశమంతా అల్లుకుపోయిన 108 కుండాల యజ్ఞాలతోపాటు జాతీయ ఏకతా సమ్మేళనం, విరాట్ దీపయజ్ఞ ప్రణాళిక అమలుజరగాలన్న ఉద్దేశ్యంతో 'ఇరవై ఒకటో శతాబ్ది ఉజ్వల భవిష్యత్తు' అన్న నినాదం దిక్కులు పిక్కటిల్లేలా సాగింది. దీపయజ్ఞాల ద్వారా భావ విప్లవ మహోద్యమాన్ని అభివృద్ధి పరిచేందుకు సంస్కరణలు చేస్తూ పోవడం, వీటిద్వారా 1989లో ప్రారంభమయిన 12 సంవత్సరాల యుగసంధి మహాపురశ్చరణ మొదటి, రెండవ పూర్ణాహుతులు విజయవంతం కావడం - ఇవి పూజ్యవరుల మహిమాన్వితమైన చివరి ప్రకటనలు.

స్థూలబుద్ధికి సూక్ష్మీకరణ గురించీ, పంచ సూక్ష్మశరీరధారులైన వీరభద్రులగురించీ అర్థంకాదు. కొందరు గురుదేవుల దరిదాపుల్లో పనిచేస్తున్న పంచ వరిష్ఠ కార్యకర్తలను వారి వీరభద్రావతారాలుగా పరిగణిస్తే, మరి కొందరు తమ బుద్ధికి తోచినట్లు రకరకాలుగా వ్యాఖ్యానించుకుంటారు. నిజానికి

**నీ విలువ తెలుసుకో. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో.**

ఇవి మనుష్య రూపంలోని శక్తి పుంజాలు. వీటిని స్థూల రూపంలో పైన ఉదహరించిన ఐదు కార్యాలు చక్కబెట్టుటకు ఉపయోగించవలసిఉంది. మొదటిది- ప్రజల వ్యతిరేక బుద్ధిని సరిచేయుట, ఆలోచనలను చక్కదిద్దుట. రెండవది- నవనిర్మాణం కోసం అత్యధిక సాధనాలను ఎంత ఖరీదువైనా సరే సమకూర్చుకొనగల సామర్థ్యం కలిగియుండుట. మూడవది- దుర్మార్గులకు భయ వాతావరణాన్ని కలిగించి వారి మనోబలాన్ని క్షీణింపజేయుట. నాలుగవది- ప్రస్తుత, భావి పరిజనులకు మరింత సామర్థ్యము, రక్షణ కలిగించుటకోసం అభివృద్ధి చెందుట. ఐదవది- పైన పేర్కొన్న నాలుగింటి కొరకు, అసాధారణ కార్యాల కోసం కావలసిన శక్తి సమకూర్చుకొనడానికై ఈ వీరభద్రులు విశుద్ధ తపశ్చర్యలో నిరతులై ఉండాలి.

మిషన్‌కు ఆద్యంతాలు లేనప్పటికీ 1980 నుండి ఇప్పటి వరకు జరిగిన అద్భుత కార్యక్రమాలు నిజానికి గడిచిన సహస్రాబ్దిలో విశ్వం మొత్తం మీద ఎక్కడా, ఎప్పుడూ జరగలేదు. ఇవి మిషన్‌కే కాక, ప్రపంచం మొత్తానికి స్వర్ణయుగమని పిలవబడే కాలం. ఇందులో అందరూ సామ్యవాదపు అంతం చూశారు. పెట్టుబడిదారీ విధానపు భయానక దృశ్యం భిన్న భిన్న రూపాల్లో ఉప్పొంగిన మానవ తృష్ణ రూపంలో చూశారు. త్వరలో దాని సమాప్తి రూపంలో చూస్తారు. ధర్మతంత్రపు ప్రగతిశీల విజ్ఞాన సమ్మత స్వరూపం ప్రజలు ఆలోచనలలో పరివర్తన తెచ్చి వారిని సన్మార్గంలో నడిపించింది. చెడు దారిలో నడిచేవారు భయకంపితులైనారు. ఈ సామర్థ్యం మొత్తం పంచ వీరభద్రులు అనగా పరమపూజ్య గురుదేవుల సూక్ష్మ శరీరములదేనని అనడంలో అతిశయోక్తి ఏమాత్రమూ లేదు.

సూక్ష్మీకరణ సాధనలో పరమపూజ్య గురుదేవులు ఐదు శరీరాలుగా సూక్ష్మజగత్తులో సక్రియులవుతున్నప్పుడు రెండురకాలైన ప్రభావాలు చూస్తాము. ఒకటి సమష్టిగతమైనది. రెండవది పరిజనుల అనుభూతుల రూపంలో. ఇక్కడ వాటి గురించి కొంత విస్తృతంగా వివేచన చేస్తాను. ఈ వివేచన 1984 నుండి 1997 వరకూ గల పదమూడు సంవత్సరాల సమీక్షాత్మక అధ్యయన రూపంలో, వివరణ రూపంలో సమర్పించబడుతున్నది.

(1) సమష్టిగత ప్రభావం: 1984 నుండి 1997 వరకూ గల కాలం అశాంతితో నిండి ఉన్నదన్న విషయం అందరూ ఎరిగినదే. సోవియట్ రష్యా ముక్కలు కావడం, తూర్పు యూరప్‌లో స్వాతంత్ర్యాభిలాష, బెర్లిన్‌గోడ కూల్చివేత, సామ్యవాదం సమాప్తి కావడం జరిగాయి. ప్రపంచ చిత్రపటం మారిపోయింది. రెండు అగ్రరాజ్యాల వ్యవస్థ కూలిపోయింది. ఆయుధాల విక్రయంతో తమ ఆర్థిక వ్యవస్థను బలపరచుకొనే దేశాలపాలిట ఇది ఒక అఘాతం వంటిది. అమెరికా ఒంటరిగా పెట్టుబడిదారీ విధానంతో ఎంతకాలం మనగలుగుతుంది! 28 కోట్ల జనాభా గల ఈ దేశంలో ఇప్పుడు నాలుగో వంతుకన్నా ఎక్కువ మంది పేద లున్నారు. "ది ఫ్యూచర్ ఆఫ్ కేపిటలిజమ్" అనే ఒక పుస్తకం ఇటీవల ముద్రించబడింది. "జీరో సమ్ సొసైటీ" (1980) రచయిత లెస్టర్ థురో ఈ పుస్తకాన్ని రచించారు. 1996లో ప్రచురితమై ఈ పుస్తకంలో "అర్థ వ్యవస్థ ఏర్పాటు" గురించి ఎమ్.ఐ.టి హార్వర్డ్ (బోస్టన్) ప్రొఫెసర్ థురో రాబోయే రోజుల్లో పెట్టుబడిదారీ విధానం ఎలా అంతమవుతుందో విపులంగా వ్రాశారు. ఆయన గ్లోబల్ ఎకానమీ పక్షపాతి. రాబోయే కాలంలో ప్రపంచ స్థాయిలో పెట్టుబడి అందరికీ సమాన స్థాయిలో అందుతుంది అని వ్రాశారు. ప్రతి ఒక్కరూ పరిమిత సాధనాలతో జీవిస్తారనీ, అందరూ కలసి సంతోషంగా బ్రతకగలిగే పాఠం ప్రకృతి నుండి నేర్చుకుంటారని వ్రాశారు. ఇదంతా 1999 నాటికి జరుగుతుందని, లేదా 2 వేల తర్వాత వికసిత రూపంలో కనపడుతుందని వ్రాశారు.

మతతత్వం, జాతి మతాల పేరుతో జరుగుతున్న మారణకాండ అతి త్వరలోనే ముగిసిపోయి ఒకే మానవజాతి రూపొందుతుంది. ఈ భవిష్యవాణి త్వరలో సాకారమై కనిపిస్తే ఎవరూ ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఇప్పుడు ప్రకృతిలో సూక్ష్మస్థాయిలోనేకాక ప్రత్యక్షంగా కూడా మార్పు జరుగుతున్నది. రాబోయే కాలం విలక్షణ పరివర్తనలతో నిండి ఉంటుంది. 1986 నుండి 1991వరకూ జరిగిన మార్పులకంటే ఎక్కువ మార్పు ఆ తర్వాత ఐదు సంవత్సరాల్లో జరిగింది. గ్లోబల్ నెట్‌వర్క్- విశ్వవ్యాప్త సంచార ప్రణాళిక వికసితంకావడం, సాంస్కృతిక స్థాయిలో ప్రపంచమంతా ఒకే చైతన్య సత్తా నీడలోకి రావడమనేవి రాబోయే పరివర్తనలకు సూచకాలు. రాబోయే ఐదేళ్లకాలం, అందులో కూడా మొదటి రెండున్నర ఏళ్లకాలం అశాంతితో అలజడితో నిండి ఉంటుంది. ద్రష్టలు, భవిష్యవక్తలు ఈ విషయం చెపుతున్నారు. ఈ సమయంలో ఐదుగురు వీరభద్రులు రక్షణ వలయంగా అందరి బాధ్యతలను స్వీకరించడం ఆనందదాయకం కాగలదు. కనుక అందరూ తమ

**నీలోని మానవత్వాన్ని మేలుకొలుపు. విజయం నీదే.**

సాధనలలో, పురుషార్థంలో మరింత జాగరూకులై ఉండాలి.

(2) వ్యష్టిగత ప్రభావం - గడచిన పది పన్నెండు సంవత్సరాల్లో అనేక ప్రతిఘటనలు, అవాంతరాలు ఎదురైనప్పటికీ పరమపూజ్య గురుదేవుల సావిత్రీ సాధనకు అసలైన మార్గదర్శనం లభిస్తూనే ఉన్నది. ఫలశృతి రూపంలో వారు అపేక్షించని సహకారం కూడా లభించుట అందరూ ఎరిగినదే. ఆత్మబల సంవర్ధనం వంటి ఒక రక్షణ కవచం వారి చుట్టూ నిర్మించబడింది. చాలామంది పరిజనులు పూజ్యవరుల సూక్ష్మీకరణ సమయంలోనే వారి సూక్ష్మశరీరంతో ప్రేరణపొంది వారి దర్శనం కానప్పటికీ ఏ మాత్రం అలజడి చెందక నిబ్బరంగా ఇక్కడ ఉండేవారు. వారిలో జబల్‌పూర్ నుండి డాక్టర్ అమర్‌కుమార్ దత్తు, కటక్‌నుండి శ్రీఅశోక్ కుమార్ దాస్, దౌసానుండి శ్రీప్రేమ్ నారాయణ గుప్తా, ముంబాయి నుండి శ్రీనరేంద్రదేవ్, కాన్పూరు నుండి శ్రీజితేంద్ర తివారీ, కుల్లూనుండి శ్రీసుఖనందన్ సింహ్, అమీర్ పూర్‌నుండి శ్రీసూరజ్ శుక్లా మొదలైనవారు, ఇంకా ఎంతో మంది పరిజనులు సావిత్రీ సాధన సమయంలో, ఆ తర్వాత, వచ్చినవారు అందరూ ఒకే మాట చెప్పడం చూస్తాము. "యుగధర్మపు పిలుపును పెడచెవిని పెట్టవద్దు'' అని అంతరాత్మ పదే పదే హెచ్చరిస్తూ ఉంటుందని తమతమ భావాన్ని చెప్పారు. మీకున్న సమయాన్ని భగవత్సేవలో వినియోగించదలుచుకుంటే ఇప్పుడే అందుకు సంసిద్ధులు కండి అన్న ప్రేరణ కలిగేదని అన్నారు.

గురుదేవుల సావిత్రీ సాధన సమయంలో చాలామంది పరిజనులు శాంతికుంజ్ నుండి వెళ్ళిపోయారు. వ్యక్తిగత కారణాలతోనో లేక యుగ చేతనా ప్రవాహంలో ఈదడం రాకనో వెళ్లిపోయారు. అయితే ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ఎంతమంది జనం బయటకు వెళ్లిపోయారో అంతకు మూడు రెట్లుగా కార్యకర్తలు అత్యుత్సాహవంతులు ఆరోగ్యవంతులు మిషన్‌కు తమ్ముతాము అర్పించుకున్నవారు వచ్చి చేరారు. ఏ ఒక్క పనీ ఆగలేదు. వీరుకాక నియమిత రూపంలో సమయదానం ఇచ్చేవారి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. అక్కడ సంస్కార మహోత్సవాలు, శ్రద్ధాంజలి ఉత్సవాలు, ప్రథమ పూర్ణాహుతితో ఉప్పొంగిన ఉత్సాహంతో నిండిన జనవాహినిని చూడవచ్చు.

వ్యక్తిగతమైన అనుభూతులు సావిత్రీ సాధన సమయంలో కలిగిన వాటిని 1984-85 అఖండ జ్యోతిలో రకరకాల శీర్షికలలో ప్రచురింపబడ్డాయి. ప్రజ్ఞావతారం అనే ఆ దివ్యసత్తా నిరంతరమూ పరిజనుల దరిదాపుల్లో ఉండడం, అందరి యోగక్షేమాల భారం వహించడానికి తత్పరత చూపడం- ఆ దివ్యానుభూతులను కొన్నిటిని ఇక్కడ ఇస్తున్నాము.

శ్రీశ్యామలాల్ ధరణి మాడల్ టవున్ పానిపట్టులో ఉంటారు. 1983లో పంజాబులో ఉగ్రవాదం తీవ్రంగా సాగుతున్నప్పుడు భార్యతోపాటు అమృత్‌సర్‌లో నివసించేవారు. జూన్ 10 నుండి 20 వరకూ నడిచే శిబిరంలో చేరడానికి ఇద్దరూ శాంతి కుంజ్ వచ్చారు. అప్పుడు పూజ్య గురుదేవులు వారిద్దరికీ నియమిత రూపంలో అంశదానం ఇచ్చేలా, ఝోలా పుస్తకాల అమ్మకం సాగించేలా సంకల్పం చేయించి కంకణం కట్టారు. 'మా పనులు మీరు చేస్తూ ఉండండి, మీ మంచి చెడ్డలు మేము చూసుకుంటాము'- అన్నారు గురుదేవులు. నిజానికి ఆరోజుల్లో పంజాబులో వీధిలోకి వెళ్లడమంటే ప్రాణాలమీద ఆశవదులుకోవడమే. ఎటు చూసినా కాల్పులు, తుపాకుల మోత. అమాయక జనం తూటాలకు బలి అవుతుండేవారు. అటువంటి సమయంలో కూడా ఆ భార్యాభర్తలు భుజానికి పుస్తకాల సంచులు తగిలించుకొని ఇల్లిల్లూ తిరిగి అమ్ముతుండేవారు. ఒక రోజు శ్యామలాల్ భార్య కమల అమ్మకాలకు ఒంటరిగా వెళ్లవలసి వచ్చింది. కాల్పులు ముమ్మరంగా ఉండడంతో ఆ రోజు కర్ఫ్యూ విధించారు. ఆ విషయం ఆమెకు తెలియదు. కొద్ది దూరం వెళ్లగానే సైనికులు ఆమెను అటకాయించారు. సంచిలో ఏమి ఉన్నదో చూపించ మన్నారు. ఆమె ఏ మాత్రం కంగారు పడక ఒకసారి గురుదేవులను స్మరించుకొని అక్కడున్న కుర్చీని తన కొంగుతో తుడిచింది. సంచిలోని సాహిత్యాన్ని దొంతరలుగా పెట్టింది. చుట్టుముట్టిన సైనికులు తలా ఒక పుస్తకం తీసుకుని తిరగవేశారు. "అమ్మా! ఈ పుస్తకాలు మేము చదువుకొని తిరిగి ఇస్తాము. రేపు కర్ఫ్యూ తొలగిస్తారు. అప్పుడు వచ్చి తీసుకువెళ్లండి. మొన్నీమధ్య మాతోటి సైనికుడు మీదగ్గర ఒక పుస్తకం కొన్నాడట. అది చదివిన తర్వాత అతడికి నిరాశ తొలగిపోయింది. క్రొత్త జీవితం దొరికినంత ఉత్సాహంగా ఉన్నాడు''- అంటూ ఆమెకు పదే పదే నమస్కారాలు చేస్తూ ఎంతో గౌరవంగా తమ వ్యానులో ఆమెను ఇంటివద్ద దించే ఏర్పాటు చేశారు.

నిజానికి ఈ సంఘటన సామాన్యమైనదిగానే తలచాలి.

**సద్‌జ్ఞానం, సత్‌కర్మ అన్నవి స్వర్గాన్ని చేరడానికి దేవుడు మనకు ఇచ్చిన రెక్కలు.**

ఎందుకంటే మరొకసారి వాళ్లను ఉగ్రవాదుల దళం చుట్టుముట్టింది. వాళ్ల భుజాలకున్న సంచులను గుంజుకొని పుస్తకాలను బయటకు లాగారు. గురుదేవుల నామస్మరణ చేసుకుంటూ నిలబడి పోయారు భార్యాభర్తలు. అప్పుడు ఆ దళ నాయకుడికి ఎటువంటి ప్రేరణ కలిగిందో తెలియదుగాని ఒక మనిషిని తోడిచ్చి వాళ్లను సురక్షితంగా ఇంటివద్ద దించే ఏర్పాటు చేశాడు. గురుదేవుల సాహిత్యమే తమకు రక్షణ కవచంగా ఉన్నట్లు భావించేవారు ఇద్దరూ. ఈ లోపున పరమ వందనీయ మాతాజీ దగ్గర్నుండి ఉత్తరం రానేవచ్చింది- "బిడ్డలారా! మీరు సులభంగా ఎంత పనిచేయగలరో అంతే చేయండి. మీ ప్రాణాలను చిక్కుల్లో పడవేసుకొని మా ధ్యాసను మీవైపు లాక్కోనవద్దు. మాకు ఇంత కన్నా పెద్ద పెద్ద కార్యాలు చక్కపెట్టవలసిన పని ఉన్నది." 84-85 నాటి ఈ అద్భుత సంఘటన ఇప్పటికీ వాళ్ల మర్చిపోరు. పదే పదే తలుచుకుంటూ గురుసత్తా శక్తిని మననం చేసుకుంటూ ఉంటారు. ఈ దంపతులు కురుక్షేత్రంలో జరిగిన అశ్వమేధ యజ్ఞానికి ఎన్ని ఆటంకాలు ఎదురైనా లెక్కచేయకుండా ఇంటింటికీ తిరిగి ఎంతో సొమ్ము సేకరించారు. ఆ సమయంలో ప్రతి క్షణం వాళ్లకు మాతృసత్తా మార్గదర్శనం లభిస్తుండేది.

నజీమాబాద్‌లోని కుమారి కుముద్ సింహ, బులంద్ షహర్‌లో జరగబోయే అశ్వమేధ యజ్ఞానికి వెళ్లాలన్న ఉత్సాహంతో ఉన్నది. గాయత్రీ ఉపాసకురాలైన ఆమె నానమ్మగారు ఇల్లు శుభ్రం చేస్తుండగా పాము కాటువేసింది. ఆమె స్పృహతప్పి పడిపోయింది. నోటినుండి నురగలు రాసాగాయి. ఐదడుగుల పొడవైన ఆ విషసర్పాన్ని చూసి కొన్ని నిముషాల కన్నా ఆమె బ్రతకదని అన్నారంతా. తల్లిలేని పిల్ల అవడాన కుముద్‌ని ఆమే పెంచి పెద్దచేసింది. ఏం చెయ్యాలో తోచని కుముద్ మాతాజీని స్మరించుకొని గాయత్రీ మంత్రం జపించసాగింది. మాతాజీ దర్శనం అయింది. అంతే. ఎటువంటి చికిత్సాలేకుండానే ఆమె నానమ్మ బ్రతికింది. అంతే కాదు. అత్యంత ఉత్సాహంతో బులంద్ షహర్‌లో జరిగిన అశ్వమేధ యజ్ఞంలో పాల్గొన్నది. మరొక సంఘటన గురించి కూడా కుముద్ రాశారు- ఆమె తండ్రి బులంద్ షహర్ అశ్వమేధ యజ్ఞమునకు వెళుతూ ఆమెతో -'బస్సు నిండిపోయింది. నీవు ఎక్కడానికి జాగా లేదు. కొత్తవారికి అవకాశం ఇవ్వడం మంచిదికదా! కనుక నువ్వు ఇంటి దగ్గరే ఉండు'- అన్నాడు. యజ్ఞంలో పాల్గొనాలని ఎన్నాళ్లనుండో కలలు కంటున్న కుముద్ నిరాశపడింది. తండ్రికి ఎదురు చెప్పలేక మౌనంగా ఉండిపోయింది. తన కోరిక తీరనందుకు మాతాజీ చిత్రపటం ముందు కన్నీరు కార్చింది. యజ్ఞానికి సరిగా ఒకరోజుముందు ఒక పెద్దమనిషి వారి ఇంటికి వచ్చాడు. 'మీ తండ్రిగారు మాతోపాటే ఉంటారు. మీరు పూర్ణాహుతిలో పాల్గొనాలని ఆయన కోరిక. మిమ్మల్ని తీసుకురమ్మని పంపారు. బండి సిద్ధంగా ఉంది'- అని చెప్పి ఆమెను వెంటబెట్టుకుని వెళ్లాడు. కుముద్ అశ్వమేధ యజ్ఞంలోనేకాక దీపయజ్ఞంలో కూడా పాలుపంచుకున్నది. పూర్ణాహుతిలో పాల్గొన్నది. తన చిరకాల వాంఛ తీరినందుకు అమితంగా ఆనందించింది. ఆ మూడురోజులూ పూజ్యగురుదేవులు, మాతాజీల గురుసత్తా తనకు తోడుగా ఉన్నట్లు అనుభూతి పొందేది. వేదిక మీద కూడా వారిద్దరి దర్శనం అనేకసార్లు అవుతూ ఉండేది. ఇంటికి వచ్చాక తండ్రికి జరిగినవన్నీ చెప్పినప్పుడు ఆయన విస్తుపోయాడు. కూతురిని తీసుకురమ్మనిగాని ఆమెకు యజ్ఞం చూపాలనిగాని ఆయన ఎవరికీ చెప్పలేదు. ఈ వారం రోజులూ యజ్ఞం ఏర్పాట్లలో తలమునకలుగా ఉండేవాడు.

ఒనిడా టెలివిజన్ కంపెనీలో సీనియరు ఇంజనీరు శ్రీమతి రశ్మి సిన్హా స్వయంగా 19-6-91న శాంతికుంజ్ వచ్చి తనకు సంబంధించిన సంఘటన ఒకటి చెప్పారు. దానివలన భక్తవత్సలుడైన గురువు తన శిష్యుల మీద ఎంత శ్రద్ధ చూపిస్తారో మనకు అవగతమవుతుంది. రెండు సంవత్సరాలుగా తరచూ తలనొప్పిగా ఉంటుంటే పరీక్ష చేయించగా ఎమ్.ఆర్.ఐ పరీక్షలో బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు తేలింది. చికిత్సకోసం అమెరికా వెళ్లాలని చెప్పారు. పరీక్ష చేసిన డాక్టర్ కుమార్ కొన్ని మాత్రల్నిచ్చి- 'ఇవి వాడుతూ ఉండండి, నేను అమెరికా వెళుతున్నాను. తిరిగి వచ్చాక మరల చెకప్ చేస్తాను'- అని అన్నారు. శ్రీమతి రశ్మి మొదటిసారిగా అప్పుడు శాంతికుంజ్ వచ్చారు. 'ధైర్యంగా ఉండు. అన్నీచక్కబడతాయి'- అని మాతాజీ ఆమెను ఓదార్చి యజ్ఞ భస్మం ఇచ్చి ఆశీర్వదించారు. మూడు వారాల తర్వాత అమెరికానుండి వచ్చిన డా॥కుమార్ ఆమెను మరల చెక్ చేశారు. బంధువుల కోరిక మీద ఎమ్.ఆర్.ఐ టెస్ట్ చేశారు. నిజానికి ఈ పరీక్ష మూడు వారాలకే చేయవలసిన పని లేదు. మార్పు రావడానికి ఆపరేషన్ తర్వాత ఎన్నో రోజులు పడుతుంది. అటువంటిది మూడు వారాలు మాత్రలు వాడినంత

**అవసరాలను తగ్గించుకుని, పరిస్థితులతో సమన్వయం సాధిస్తే-ఆనందమే ఆనందం.**

మాత్రాన తేడా ఏమి ఉంటుంది? కానీ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే- ఈ మూడు వారాల అతితక్కువ వ్యవధిలో 50 శాతం కంటే అధికంగా మంచి మార్పు కనబడింది. నయం కావడం అసాధ్యమనుకున్న ఆ వ్యాధి పూర్తిగా ఆపరేషను లేకుండానే తగ్గిపోయింది. డయాగ్నోసిస్ మొదలై శాంతికుంజ్ వచ్చి మాతాజీకి వివరం చెప్పిన ఈ రెండేళ్ల కాలంలో కేవలం మాత్రలు, యజ్ఞభస్మం, మాతాజీ ఆశీస్సులతో సర్జరీ లేకుండా భయంకరమైన బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నయమయిపోయింది. ఇప్పుడు ఆమె గాయత్రీ పరివార్ సభ్యురాలుగా క్రియాశీల కార్యకర్తగా అయినారు.

కుందరు (సీకర్-రాజస్థాన్) నివాసి నాగర్‌మల్ గుప్తాకి 1983లో స్వరపేటిక కేన్సర్ వచ్చింది. మూడేళ్లుగా వైద్యం జరుగుతూనే ఉన్నది. వేలరూపాయలు ఖర్చవుతూనే ఉన్నాయి. కానీ వ్యాధిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. పరమవందనీయ మాతాజీ దర్శనం చేసుకొని ఆమెనుండి ఓదార్పు, ఆశీర్వాదం పొందారు. అప్పటి నుండి మందులన్నీ కట్టిపెట్టి కేవలం గాయత్రీ మంత్రం మాత్రం జపించుకోసాగారు. కొద్ది కాలం లోనే కేన్సరు మటుమాయమయింది. స్వరపేటిక చక్కబడి మరల మాట్లాడగలుగుతున్నారు. ఇలాంటివి ఎవరైనా చెపితే, వెంటనే నమ్మబుద్ధి కాదు. అభూత కల్పనలా తోస్తుంది. కాని ప్రత్యక్షంగా ఇటువంటి సంఘటనలు చూసినప్పుడు మాత్రం అద్భుత శక్తి ఒకటి పనిచేస్తూ తనను గాఢంగా నమ్మిన వారిని కాపాడుతూ ఉంటుందని విశ్వసించకతప్పదు. ఈ గుప్తాజీకే పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షకి కూర్చొనడానికి గురుసత్తానుండి ఆశీర్వాదం లభించింది. ఆయన కన్నా ఉద్దండులైన అభ్యర్థులున్నప్పటికీ గురుదేవుల ఆశీర్వాద బలం వలన విజయం మాత్రం గుప్తాజీకే లభించింది. ఆయన 1985 నుండి గురుదేవుల సేవా కార్యాలలో మనసారా పాల్గొనసాగారు. అందుకు ప్రతిగా రోగవిముక్తి, భౌతిక సఫలత, ఆత్మసంతృప్తి లభించాయి. గాయత్రీమాత ఆశీస్సు, సిద్ధపురుషుని ఆశీర్వాదము, ఓదార్పు వృథా అవుతాయా!

బ్రహ్మవర్చస్ శోధసంస్థాన్‌లో కార్యకర్తలైన డా॥అమల్‌కుమార్ దత్తాగారి పెద్దకుమారుడు అరవింద్, అతడి భార్య మమత న్యూజెర్సీలో ఉంటారు. చాలా చిన్న వయసునుండే అతడు గురుదేవులు, మాతాజీల ప్రేమ, వాత్సల్యం అనుభవించాడు. వారి ఆశీర్వాద బలంతోనే అతనికి విదేశాలకు వెళ్లే అవకాశం లభించింది. ఒకసారి శాంతికుంజ్ నుండి ఈ వ్యాసకర్త నాయకత్వంలో అమెరికా వెళ్లిన బృందాన్ని రిసీవ్ చేసుకోవడానికి వస్తున్న ఆ దంపతుల కారుకు ఏం జరిగిందో తెలియదు. ఏ భాగం చెడిపోయిందోగాని ఆరులైన్ల విశాలమైన రోడ్డు మీద పల్టీలు కొడుతూ విసిరేసినట్లు ఒకమూలకు పోయి ఆగింది బండి. తుక్కు తుక్కు అయిన కారులోంచి అరవింద, మమతలను బయటకుతీశారు. వాళ్లకు ఒంటిమీద ఎక్కడా ఒక్కదెబ్బ తగలలేదు. కనీసం గీరుకుపోవడం కూడా జరగలేదు. క్షణాల్లో అక్కడకు వచ్చిన అంబులెన్స్ టీమ్‌కి చేయవలసిన దేమిటో అర్థంకాలేదు. నామమాత్రపు వైద్యం చేసి వారిని ఇంటివద్ద దించి వెళ్లిపోయారు. జరిగిన సంఘటన నిజమని నమ్మలేకపోతున్నారు ప్రత్యక్షంగా చూసినవాళ్లుకూడా. మరునాడు ఇన్సూరెన్స్ కంపెనీవారు వచ్చి చేయవలసిన పరీక్షలు చేశారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా కేవలం కారు చెడిపోవడమే కారణమని అంగీకరించి ఇవ్వవలసిన డబ్బుమొత్తం ఇచ్చివెళ్లారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ సంఘటన గురించి ఇంకా అమెరికాలోని వాళ్ల బంధువర్గానికే తెలియదు; కానీ మాతాజీ మర్నాటి ఉదయమే ఫోను చేశారు. దెబ్బలు తగిలాయా? ఎలా ఉన్నారు? అంటూ పరామర్శించారు.

పరమ పూజ్య గురుదేవుల ఐదు సూక్ష్మశరీరాల గురించిన వివరణతోపాటు వ్యక్తిగతమైన, సమష్టిగతమైన విషయాలు కూడా కొన్ని తెలుసుకోగలిగాము. గురుదేవులు, మాతాజీల మహిమాన్వితమైన సంఘటనలు, భక్తుల అనుభవాలు అనంతంగా ఉన్నాయి. వాటిలో రెండు మూడు సంఘటనలు మాత్రమే ముచ్చటించడం జరిగింది. విశ్వం రూపురేఖలు అతివేగంగా మారిపోతున్నాయి. నేరాలు, ఘోరాలకు అంతులేకుండా పోతున్నది. కానీ మహాకాలుడి చేతనా ప్రవాహంతో కలిసి పయనించేవారు సురక్షితంగా ఉంటారన్నది మాత్రం యథార్థం, అనుభవ సత్యమూను. అటువంటి గురుసత్తా రక్షణ లభించిన మనం ఎంతో అదృష్టవంతులం. గురుదేవులు, మాతాజీ ఎంత దూరంలో ఉన్నా వారి సూక్ష్మ సంరక్షణ మనకు అన్ని వేళలా అందుతూనే ఉంటుంది. వారెప్పుడూ మన గురించీ, విశ్వకళ్యాణం గురించి ఆలోచిస్తూనే ఉంటారు.

అనువాదం - శ్రీమతి విజయకుమారి

**మనశ్శాంతికి మార్గం కర్తవ్య పాలన.**

# ముఖచిత్ర కథనం-2: మాతాజీ స్మృతి

# ఔదార్యానికీ, సహనానికీ మూర్తిరూపం ఆమె

పరస్పర అవగాహన ఉంటే, కుటుంబంలో ప్రతిరోజూ పండుగే అవుతుంది. మాతాజీ జీవితమంతా ఈ అవగాహనను అలవరచుకోవడంలో, నేర్పడంలో గడిచింది.

## పరిస్థితులలో పెనుమార్పు

పూజ్య గురుదేవులతో దాంపత్య సూత్రంలో బంధించబడగానే ఆమె ఒక పెద్ద కుటుంబంలోకి వచ్చింది. ఇంటిలో గురుదేవుల ముగ్గురు సోదరులు, వారి భార్యలు, పిల్లలు ఉండేవారు. ఈ పెద్ద కుటుంబపు సంచాలన సూత్రం గురుదేవుల తల్లిగారి చేతుల్లో ఉండేది. అందరూ ఆమెను తాఈజీ అని పిలిచేవారు. ఆమె బాగా పొడగరి. తెలుపు రంగు. ఖంగుమనే కంఠం. భారీ శరీరం. అన్నీ కలిసి ఆమె వ్యక్తిత్వం దర్జాగా, ఠీవిగా కనిపించేది. చూడగానే అందరినీ ఆకట్టుకునేది. ఆమె మనసు వెన్న. అయితే ఆమె స్వభావరీత్యా పాలకురాలు. జమీందారీ వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నలలో నడిచేవి. పిల్లలమీదా, కోడళ్లమీదా, కుటుంబ సభ్యులమీదా ఆమె ప్రాబల్యానికి తిరుగు ఉండేది కాదు.

ఆ ఇంటిలో మొదటి రోజు మాతాజీ జీవితంలో పెను మార్పు సంభవించిన రోజు. తన పుట్టిల్లు పరిస్థితులు వేరు. అత్తవారింటి పరిస్థితులు వేరు. ఆమెకు తల్లి నీడ చిన్నతనంలోనే కరవయింది. అందువల్ల తండ్రి జస్వంతరాయ్ ఎంతో గారాబంగా ఆమెను పెంచారు. ఆమె ఇంటిలో అందరికన్నా చిన్నపిల్ల. అందువల్ల అన్నలూ, అక్కలూ ఆమెమీద ఆప్యాయత కురిపించేవారు. అత్తవారింటికి వెళ్లిన తర్వాత ఎవరితో ఎలా వ్యవహరించాలి? కుటుంబంలో ఏ సమస్యలు ఎపుడు వస్తాయి? వాటిని ఏవిధంగా పరిష్కరించాలి? ఇలాంటి విషయాలలో ఆమె తర్ఫీదు కాలేకపోయింది. తల్లి లేదు. మరి ఈ విషయాలన్నీ ఎవరు నేర్పుతారు. అత్తవారింట్లో ఆమె అందరికన్నా చిన్నది. కనుక- అన్నీ కర్తవ్యాలే. అధికారాలు అసలు లేవు.

## మమతను పంచిన మాతాజీ

అంతే కాదు. మరిన్ని పరీక్షలు. గురుదేవుల మొదటి వివాహం సంతానం- ఓం ప్రకాశ్, దయ. అప్పుడు వాళ్లు అభం శుభం ఎరుగని చిన్నపిల్లలు. తల్లి అండను చిన్నతనంలోనే కోల్పోవడంతో, వాళ్లు తల్లి ప్రేమ కోసం తపిస్తున్నారు. ఎన్నడూ తరగని ఆత్మీయత కోసం అర్రులు చాచుతున్నారు. గురుదేవులు తమ సామాజిక బాధ్యతలలో మునిగి ఉంటారు. స్వరాజ్య సమరపు కోలాహలం. సాంఘిక సంస్కరణ కోసం ముందుకు ఉరకాలనే ఉత్సాహ ఉద్రేకాలు. సాధనలో రోజూ ఏదో కొత్త ప్రక్రియ కనుగొనాలనే ఆకాంక్ష. ఇలాంటి పరిస్థితులలో, పిల్లలమీద ఎంత ప్రేమ ఉన్నా వారితో సాన్నిహిత్యానికి ఆయనకు తీరిక దొరకలేదు.

పసి మనసులు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోగలవు? వారికి మారాం చేసే అలవాటు ఉంటుంది. ఎవరైనా తమను సముదాయించాలని, గారం చేయాలని వారు కోరుకుంటారు. తాఈజీ తన పద్ధతిలో ఈ కోర్కె తీర్చుతూ ఉండేది. అయినా, ఈ పసివాళ్ల మనసులు తల్లిప్రేమ కోసం తహతహలాడుతున్నాయి. పసి మనసులలోకి ఎన్నెన్నో సందేహాలు వస్తూ ఉంటాయి. మంకుపట్లు ఉంటాయి. మాత చూపే మమతయే వాటికి సమాధానం.

మాతాజీ ఈ సవాలును స్వీకరించవలసి వచ్చింది. ఇందుకుతోడు ఇరుగు పొరుగు అమ్మలక్కల సూటిపోటి మాటలు. ఇవి ఆమె మనసును గాయపరచాయి. ఆమె పల్లకీ దిగి కోడలుగా అడుగుపెట్టిన రోజునుంచీ వర్షించాయి ఈ పుల్లవిరుపు మాటలు. మాతాజీతో పాటు వచ్చిన ఓ పెద్దముత్తయిదువు ఇలా చెప్పి వాళ్ల నోళ్లు మూయించింది- "ఈ ఇంటి కోడలు మాతా భగవతి. ఏదో ఒక రోజున మీరంతా ఈమె కాళ్లు పట్టుకుంటారు."

ఇంటిలో ప్రవేశించిన తర్వాత పెద్దలు మాతాజీకి ఒకరొకరినీ పరిచయం చేశారు. మాతాజీ ప్రథమ దర్శనం గురించి ఓంప్రకాశ్ ఇలా అంటారు-

"మాతాజీ జరీ ఉన్న గులాబీ రంగు చీర కట్టుకుంది. తలమీద టీకా, ముక్కుకు ముక్కుపుడక, మెడలో గొలుసులు, చేతులకు బంగారు గాజులు, కాళ్లకు పాంజేబులు, ఎర్రరంగు చెప్పులు. బాదం రంగు శాలువా కప్పుకుని ఉంది.

"మేమిద్దరం (ఓంప్రకాశ్, దయ) ఒక్కొక్కరుగా వెళ్లాం. దూర

**ప్రేమ బలం అపారం. ప్రేమ శక్తి అద్భుతం.**

దూరంగా తిరిగి వెనుకకు వచ్చాం. నవ్వుతూ అన్నాం- సన్నగా ఉంది. బాగా చిన్నది. కొంచెం నలుపు. దయ అన్నది- ఈమె చేతులు ఎంత చిన్నవిగా ఉన్నాయి. నోరు గుండ్రంగా ఉంది. గౌను తొడుక్కున్న దయ ధైర్యంచేసి ఆమె దగ్గరకు వెళ్లి నిలబడింది. మాతాజీ చేయి పుచ్చుకుని తన దగ్గర కూర్చోబెట్టుకుంది. నా మనసూ ఊగింది. నేనూ ఆమె ప్రక్కన నిలబడ్డాను. ప్రక్కన నిలబడ్డ తాఈజీ బిగ్గరగా అన్నది- ఏమిటి చూచేది! కాళ్లకు మ్రొక్కు. నేను కాళ్ల తాకాను. ఆమె ప్రేమగా చేయి పుచ్చుకుని ప్రక్కన కూర్చోబెట్టుకుంటూ అన్నది- నీ పేరేమిటి? ఏ క్లాసు చదువుతున్నావు? నేనన్నాను- నా పేరు ఓంప్రకాశ్. 5వ తరగతి చదువుతున్నాను."

తల్లిప్రేమకు మొహం వాచిఉన్న ఇద్దరు పిల్లలు తమ రెండో అమ్మతో పరిచయం చేసుకున్న క్షణం అది. తల్లికీ, పిల్లలకూ ఉన్న కుటుంబ సంబంధం స్వంత అమ్మ, సవతి అమ్మ అనే రేఖతో విభజించడానికి వీలులేనిది. సామాజికమైన కట్టుబాట్ల ఉపరితలాన్ని దాటిన వాత్సల్యపు లోతులలో దానికి పోషణ లభిస్తుంది. ఈ ఆర్ద్రతనే మాతాజీ అనుభూతి పొందింది. పిల్లలు అనుభూతి పొందారు.

తొలి రోజునుంచే మాతాజీ తన కుటుంబంలోని వారికి ఆప్యాయతనూ, ఆత్మీయతనూ పంచి ఇచ్చింది. వాటిని అందుకుని అందరూ ఆమె ప్రశంసకులు అయినారు. మాతాజీ మేనకోడలు శీలవతి జీజీ ఆ మమతానురాగాల స్మృతులను నెమరువేసుకుంటూ ఇలా అన్నది-

## అత్తా కోడళ్ల సయోధ్య

అత్తయ్యగారి తత్పరత చూచితీరవలసిందే. ఇల్లు పెద్దది. పిల్లలనుంచి పెద్దలవరకు ఒక్కొక్కరిది ఒక్కొక్క అభిరుచి, ఒక్కొక్క ఆదేశం. అందరి స్వభావాలకూ అనుగుణంగా తనను మలచుకోవడం సులువు కాదు. కాని అత్తయ్యగారు ఇందులో ఘన విజయం సాధించారు. మాతాజీ తన మీదనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ప్రతి ఒక్కరూ భావించేవారు. తాఈజీ మాతాజీపైననే ఆధారపడేవారు. ఏ విషయానికయినా-ముందు చిన్న కోడలిని అడుగు, అనేవారు. అత్తా కోడళ్లమధ్య ఇంతటి సయోధ్య మరోచోట కనబడడం అరుదు.

ఆవల్‌ఖేడాలో మాతాజీ హెచ్చు సమయం ఉండలేకపోయింది. దేశానికి స్వరాజ్యం వస్తోంది. గురుదేవుల దృష్టి దేశ విముక్తినుండి సమాజ విముక్తికి మళ్లింది. దురాచారాలనుండి, మూఢ నమ్మకాలనుండి సమాజాన్ని విముక్తి చేయాలనే ఉద్రేకం ఆయనలో కట్టలు త్రెంచుకుంది. ఆయన తన ఉద్యమానికి కేంద్ర స్థలంగా మథురను ఎంపిక చేశారు. ఓంప్రకాశ్, దయలను వెంటతీసుకుని మాతాజీ గురుదేవులతోపాటు మథుర వచ్చారు.

## జమీందారీనుండి దారిద్ర్యంలోకి

ఆవల్‌ఖేడాలో ఉన్న సౌకర్యాలు మథురలో ఏమాత్రం లేవు. ఆ జమీందారీ సిరి సంపదలు ఇక్కడ లేవు. ఈ పేదరికం స్వయంగా స్వీకరించిందే. అయినా- పేదరికం పేదరికమే. కొరతలు కొరతలే. అయితే- ఋషి మనఃస్థితి వాటివల్ల కలిగే మనస్తాపాన్ని దూరం చేసింది.

వారు మథురలో ఉండగానే స్వరాజ్యం వచ్చింది. ఆ తర్వాత మాతాజీకి మృత్యుంజయ (1949), శైలబాల (1853) జన్మించారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఆరుకు పెరిగింది. గురుదేవులు హెచ్చు సమయం తపో సాధనలో, సామాజిక కార్యక్రమాలలో, అధ్యయనంలో, రచనలో గడిపేవారు. కుటుంబపు పనులకు తీరిక ఉండేది కాదు. కుటుంబ బాధ్యత అంతా మాతాజీ మీదనే పడింది. తండ్రి ఇచ్చే ప్రేమ, తల్లి ఇచ్చే మమత- ఇవి రెండూ పిల్లలకు మాతాజీయే ఇవ్వవలసి వచ్చేది.

## శివ పార్వతుల దాంపత్యంవలె...

గురుదేవులు, మాతాజీల దాంపత్యాన్ని శివ పార్వతుల దాంపత్యంతో పోల్చవచ్చు. శివుడు విరక్తుడు. తపస్సులో లీనమవుతాడు. సమాధిలో ఉంటాడు. మాత పార్వతీదేవి గణేశ, కుమారస్వాములతోపాటు ఇతర గణాలను కూడ చూచుకోవలసివస్తుంది. ఇక్కడకూడ అలాంటి పరిస్థితే. వచ్చిన ఇబ్బందులు తక్కువేమీ కాదు. కొరతలవల్ల వచ్చే కష్టాలు కోకొల్లలు. అయినా, మాతాజీ తన బాధలు చెప్పుకుని గురుదేవుల తపస్సుకు ఎన్నడూ ఆటంకం కలిగించలేదు. అయితే, ఈ కొరతల కొలువులో ఒకోసారి మాతృత్వపు మమత విలవిలలాడేది. అలాంటి ఒక సంఘటన.

## రూపాయి దొరికితే...

చిన్న కూతురు శైలకు త్రోవలో ఒక రూపాయి నాణెం దొరికింది. శైల పసిమనసు టపాకాయలమీదకు, ఆటవస్తువులమీదకు పోయింది. దారిలో పడి ఉన్న రూపాయిని తీసుకోవడం దొంగతనం కాదని ఆ పిల్ల భావించింది. శైల

**ఆచరణ ద్వారా ఇచ్చే ఉపదేశం ఫలిస్తుంది.**

బజారుకు వెళ్లి ఆ రూపాయితో టపాకాయలూ, ఆట వస్తువులూ కొనుక్కొని హుషారుగా ఇంటికి వచ్చింది.

రాగానే- మాతాజీ దృష్టి ఆ టపాకాయలమీదా, ఆటవస్తువులమీదా పడింది. ఎక్కడివని అడిగింది. శైల నిజం చెప్పింది. ఆ మాట విన్న మాతాజీలోని తల్లి హృదయం ఒక్క క్షణం కంపించింది. తానీ ఆటబొమ్మలు కొనిపెట్టగలిగి ఉంటే పిల్ల మనసులో ఈ వ్యామోహం ఎందుకు కలుగుతుంది- అని ఆమె హృదయం ప్రశ్నించింది. అయితే మరుక్షణంలో ఆమె తనను తాను సంబాళించుకున్నది. పిల్లతో ఇలా అన్నది.

చూడమ్మా! ఈ ఆట బొమ్మలను దుకాణదారుకు తిరిగి ఇవ్వు. ఆ రూపాయి దేవాలయంలో వెయ్యి.

6,7 సంవత్సరాల ఆ పిల్ల అడిగింది-

ఎందుకు? నేనేమీ దొంగతనం చేయలేదు. ఆ రూపాయి నాకు రోడ్డుమీద దొరికింది.

తల్లి సమాధానం-

దొరికితే మాత్రం? శ్రమించకుండా వచ్చిన డబ్బు దొంగసొత్తే.

పిల్లకు విషయం అర్థమయింది. ఆమె టపాకాయలనూ, ఆట వస్తువులనూ తిరిగి ఇచ్చివేసింది. ఆ రూపాయి ఆలయంలో సమర్పించింది.

ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో జరిగాయి. అయితే ఈ కష్టాలన్నీ ఆమె మనసును మరింత గట్టిపరచాయి.

అఖండజ్యోతి ప్రచురణ ప్రారంభం కావడంతో- ఆరుమంది ఉన్న చిన్న కుటుంబం విశాలమైన గాయత్రీ పరివార్ రూపాన్ని ధరించసాగింది. ఫలితంగా ప్రజల రాకపోకలు పెరిగాయి. గురుదేవుల సాధనాత్మక కృషికూడ తీవ్రతరం కాసాగింది. మథురలో ఉండగానే, గురుదేవుల హిమాలయ యాత్రలు రెండు జరిగాయి.

గురుదేవుల హిమాలయ యాత్రల సమయంలో మాతాజీ పత్రికల ప్రచురణ, గాయత్రీ తపోభూమి పర్యవేక్షణ మున్నగు పెక్కు బాధ్యతలను ఎంతో అందంగా, మరెంతో సమర్థవంతంగా నిర్వహించారు. ఆమె ఉత్తరాలకు జవాబులు వ్రాసేవారు. కార్యాలయం పనులు చూచేవారు. ఈ బాధ్యతలన్నీ నిర్వహిస్తూకూడ- ఆమె పిల్లలకు ఎక్కడా లోటు రానిచ్చేవారు కారు. తన ఏకాంతవాసంలో తన కార్య విస్తరణ కుంటుపడిందనే భావం గురుదేవుల మనసులోకి ఎన్నడూ రానివ్వలేదు. తమ సంరక్షకులు తమమధ్య లేరనే భావన గాయత్రీ పరివార్ పరిజనులకు ఏమాత్రం కలుగనివ్వలేదు.

మాతాజీకి పెద్ద పెద్ద డిగ్రీలు లేవు. అయితే- తన కుటుంబాన్ని నందనవనంవలె నిత్యవసంతంగా తీర్చిదిద్దగలిగారు. ఆ విజ్ఞత, ఆ వివేకం ఆమెకు పుష్కలంగా ఉండేవి.

శాంతికుంజ్‌లో నివసించే సమయంలో మాతాజీ బయటనుంచి వచ్చిన ఒక కార్యకర్తకు ఇలా వివరించారు-

"బాబూ! కుటుంబం జంజాటం కాదు. బరువు కాదు. బరువు అనుకుని దాన్ని వదలివేయడం వల్ల ఎవరూ సాధకులుగా తయారు కారు. మేమూ సాధన చేశాం. అయితే, మా ఇంటిని తపోవనంగా మలచి సాధనం చేశాం. గృహస్థ జీవనంలో వచ్చే ఇబ్బందులూ, కష్టాలూ సాధనాత్మ క జీవనంలోని కఠోర తపస్సు, తితిక్షలే. వాటిని ప్రసన్నంగా స్వీకరించడంవల్ల వ్యక్తిత్వం వన్నె పొందిన బంగారంలా మెరిసిపోతుంది.

''మా అనుభవం ఇది. మేము కుటుంబాన్ని వదలి పారిపోయేందుకు బదులు, దాన్ని తగ్గించేందుకు బదులు- దాన్ని పెంచాం. మొదట్లో మా కుటుంబంలో ఏడుగురు ఉండేవారు. తాఈ, ఓంప్రకాశ్, దయ, సతీశ్ (మృత్యుంజయ), శైల, నేను, గురూజీ, ఆతర్వాత అఖండజ్యోతి పరివార్ ఏర్పడింది. అందులో సుమారు 10-20 వేలమంది ఉండేవారు. అది ఇపుడు గాయత్రీ పరివార్‌గా విస్తరించింది. దాని పరిజనుల సంఖ్య కోట్లలో ఉంది.

"దీనంతటి వెనుక ఔదార్యం, సహనశీలత ఉన్నాయి. భావన హృదయంలోని ఆంతరిక వస్తువు. మనం మన కుటుంబ సభ్యులతో వ్యవహరించేటప్పుడు ఆప్యాయత, ఔదార్యం, త్యాగంవంటి భావాలను తెచ్చిపెట్టుకుని నటిస్తే- ఏదో ఒక రోజున ఆ నటన బయటపడుతుంది. కుటుంబ సభ్యులకు అసలు విషయం బయటపడుతుంది. మన భావన స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటే- మనల్ని అపార్థం చేసుకున్నవారు సైతం మారుతారు. మనల్ని ఆదరిస్తారు.

"మేము ఇదే చేశాము. మన మిషన్‌లోని ప్రతి పరిజనుడూ మావలెనే తన కుటుంబాన్ని నందనవనంగా తీర్చిదిద్దాలి. ఆ నందనవనంలో ఆనందపు మొగ్గలు ప్రతినిత్యం విచ్చుకోవాలి. ఇదే మా ఆకాంక్ష.''

H H H

**భోగం, రోగం సహచరులు.**

## ముఖచిత్ర కథనం-3: ఋషియుగ్మ స్మృతి - ఒక అనుభూతి

# ఆశగా మారిన నేహ నిరాశ

దెబ్బమీద దెబ్బ తిని వేదనతో నిండిన మనస్సు. రోగాలతో సతమతమై కృశించిపోయిన శరీరం. కుటుంబ సమస్యల విష వలయం. ఈ సంపదతో ఆమె శాంతికుంజ్ వచ్చింది.

ఆరోజు గాయత్రీ జయంతి. ఎండవేడి పెరుగుతోంది. దానితోపాటు ఆశ్రమంలో సాధకుల సమ్మర్దంకూడ పెరుగుతోంది. శ్రద్ధాళువులైన శిష్యులలో, అనురాగం నిండిన భక్తులలో తమ ఆరాధ్య సద్గురువు తపోభూమిని దర్శించాలనే తపనకూడ పెరుగుతోంది.

పరమపూజ్య గురుదేవులు స్థూల శరీరంలో ఇపుడు లేరని అందరికీ తెలుసు. వారు తనువు చాలించి సుమారు ఏడు సంవత్సరాలయింది. వారి లీలా సహచరి పరమవందనీయ మాతాజీ కూడ సుమారు మూడు సంవత్సరాల క్రితం దేహాన్ని వదిలారు. ఇదంతా నిజమే. అయితే దీన్ని మించిన నిజం మరొకటి ఉంది- పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ పంచభూతాలతో కూడిన శరీరాలను వదిలిన తర్వాతకూడ ఈ శాంతికుంజ్‌లోని సూక్ష్మ వాతావరణంలో తపస్సులో నిమగ్నులై ఉన్నారు.

తర్కించే మనస్సుకు ఈ నిజం అసాధ్యమైనదిగా తోచవచ్చు. అయితే భక్త హృదయానికి ఇది ప్రతి నిత్యం అనుభవం అవుతూన్న నిజం.

శాంతికుంజ్‌కు ఆ రోజు వచ్చిన ఆ మహిళకు ఇది ఆనోటా ఈ నోటా విన్న విషయం. జీవితం ఆమెను నిరాశలతో, నిస్పృహలతో నిండిన భయంకర అంధకారంలో ముంచివేసింది. తనవాళ్లు అనుకున్నవాళ్లు ఆమెకు అపనమ్మకాన్నే మిగిల్చారు. బంధువుల మోసాలకూ కుట్రలకు ఆమె పలుమారులు బలి అయింది. ఈ నిరాశ, ఈ ఉద్రిక్తత కలగలిసి ఆమెకు రోగాలను బహుమతులుగా ఇచ్చాయి. ఆ రోగాలు ఒకటీ రెండూ కావు. నడుము ఎముకలో నొప్పి. క్షయ, ఉదరశూల, గర్భాశయానికి సంబంధించిన బాధలు-ఇవన్నీ శారీరికమైన జబ్బులు. ఇక మనస్సు విషయానికి వస్తే-చింత, ఉద్రిక్తత, విషాదం ఆమెకు నిత్య సహచరులు. ఆమె అనుభవించిన ఈ నరకం ఆమెకు తప్ప మరొకరికి ఎలా అర్థ మవుతుంది!

ఆమెకు ఆశాకిరణం ఒకేఒకటి-

శాంతికుంజ్.

ఆమెకు ఎవరో చెప్పారు- పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ ఎంతో కరుణామయులు. వారి గుమ్మంనుండి ఎవ్వరూ నిరాశతో తిరిగివెళ్లరు. వారి సమాధి స్థలంపై తల ఆనిస్తే చాలు దుఃఖాలూ, కష్టాలూ దూరమైపోతాయి.

ఈ భరోసాతో ఆమె శాంతికుంజ్ వచ్చింది. అయితే తాను వచ్చిన రోజు గాయత్రీ జయంతి పర్వమని ఈ వేదనల వలయంలో చిక్కుకున్న ఆమె మరచిపోయింది. పండుగలలో వచ్చే జనం బాగా పెరగడంతో వసతి సౌకర్యం, ఇతర సౌకర్యాలు దొరకడం అంతగా సాధ్యపడదు. కనుక ఆమె ఏదోవిధంగా సర్దుకుని శాంతికుంజ్‌లో ఉండిపోవలసి వచ్చింది. గాయత్రి జయంతి సందర్భంగా జరుగుతూన్న కార్యక్రమాలలో పాల్గొనడానికి ఆమె ప్రయత్నించింది. కానీ, శరీరం అందుకు సహకరించలేదు. ఇక చేసేదేముంది? తన స్థలంలోనే కూర్చొని ప్రవచనాలను వింటోంది. జబ్బువల్ల ప్రణామం, అఖండదీప దర్శనం మున్నగు కార్యక్రమాలలో ఆమె పాలు పంచుకోలేకపోయింది. అయితే అందుకు ఆమె పొందిన మనస్తాపం ఇంతా అంతా కాదు. ఆ రోజు పగలు గడచింది. రాత్రి ముసురుకున్నది. నియమం ప్రకారం రాత్రి 9 గంటలు కావడంతో నిద్ర వేళ వచ్చింది.

**తనలోపల కూర్చున్న పరమాత్మను చూడలేనివాడే డబ్బుకోసం ప్రాకులాడతాడు.**

ఆమె ఎలాగో ధైర్యం తెచ్చుకున్నది. నిద్రపోయే ముందు గురుదేవులు, మాతాజీల సమాధి స్థలం వద్ద తల ఆనించివద్దామని అనుకున్నది. ఆమెలోని శ్రద్ధ గట్టిపడింది. ఘనీభవించింది. ఆ శ్రద్ధతో, తడబడుతూన్న అడుగులతో ఆమె 'సజల శ్రద్ధ-ప్రఖర ప్రజ్ఞ'కు చేరుకున్నది. భావాల ఆటుపోటులు ఆమె మనస్సును మథిస్తున్నాయి. తన కన్నీళ్ల ధారతప్ప ఆమెవద్ద ఏదీ లేదు. జీవితంలోని ఆ 35 సంవత్సరాలూ ఆమెను వేదనల వలయంలో, కన్నీటి కడలిలో ముంచివేశాయి. ఆమె సజల శ్రద్ధనూ, ప్రఖర ప్రజ్ఞనూ తన కన్నీటితో కడిగింది. మళ్లీ మళ్లీ కడిగింది. నిలబడి నిలబడి ఆమె కాళ్లు పీకుతున్నాయి. ఆమె అక్కడే కూర్చుండిపోయింది. చాలాసేపు ఏడుస్తూ ఉండిపోయింది.

అలా ఏడుస్తూ ఏడుస్తూ ఆమె ఒక చిత్రమైన అనుభూతి పొందింది. ఒక దివ్య చేతన తనను తన కౌగిలిలో నింపుకుంటోంది. అయితే ఆమె తన వ్యథలలో ఎంతగా మునిగిపోయిందంటే- ఈ అనుభూతిని ఆమె తనలో నిలిపి ఉంచుకోలేకపోయింది.

అయితే ఒక్కమాట మాత్రం నిజం. ఆ అనుభూతి ఆమెకు ఊరట కలిగించింది. ఫలితంగా- రోజూకన్నా ముందుగా ఆమెకు నిద్ర వచ్చింది. ఆమెకు అనిపించింది - తనకోసం పరాచేతన తలుపులు తెరుచుకున్నాయని. ఆమెకు అనిపించింది- తాను గురుదేవులు, మాతాజీల వద్దకు వచ్చానని. ఆమె చిత్రాలలో చూచిన విధంగా వారు తమ ఆసనాలపై కూర్చొని ఉన్నారు. వారి ముఖాలలో చిరునవ్వు. ప్రేమ నిండిన చిరునవ్వు. హృదయాన్ని వశపరచుకునే చిరునవ్వు. కరుణతో నిండి, వెలుగులు విరజిమ్మే కళ్లు. పరమపూజ్య గురుదేవులను, వందనీయ మాతాజీని ఇంత దగ్గరగా చూస్తూన్న అనుభవం ఆమెకు మొదటిసారి కలిగింది. తన తల మాతాజీ ఒడిలో ఉండడం, ఆమె అపరిమితమైన వాత్సల్యంతో తన తల నిమురుతూ ఉండడం ఆమెకు అనుభవం అయింది. ఆమె మాత్రం అలా ఏడుస్తూనే ఉండిపోయింది.

అపుడే ఆమెకు మాటలు వినిపించాయి. పరమపూజ్య గురుదేవులు మాతాజీతో ఇలా చెపుతున్నారు-

"ఎందుకు ఇంతగా ఏడుస్తున్నావు, మేము లేమా-అని నేహ (ఆ మహిళ పేరు)తో చెప్పు."

గురుదేవుల ఈ మాటలకు ఆమె ఆశ్చర్యపడింది. ఆనందించింది-వారికి తన పేరుకూడ తలుసని. ఈ భావాలు తన మనసులోకి రాగానే గురుదేవులు అందుకున్నారు -

"అమ్మాయీ! నాకు నీ పేరు మాత్రమే కాదు, నీ సమస్యలన్నీ తెలుసు."

ఆమె సంకోచిస్తూ అడిగింది-

"ఎలా తెలుసు? మీరిద్దరూ ఇపుడు ఇంత దూరంలో ఉన్నారు కదా."

ఆమె చెప్పిన ఈ మాటలకు గురుదేవులు నవ్వుతూ ఇలా అన్నారు -

"అమ్మాయీ! తల్లి దండ్రులు ఎప్పుడయినా తమ పిల్లలకు దూరంగా ఉంటారా? మేమిద్దరం ఎపుడూ ఇక్కడే ఈ శాంతికుంజ్‌లోనే ఉంటున్నాం."

"అయితే ఎందుకు కనబడరు?"

-అని అడిగింది నేహ. ఆ ప్రశ్నలో పసిపిల్లల మంకుపట్టు ఉంది.

ఈ ప్రశ్నకు గురుదేవులు, మాతాజీ ఇద్దరూ నవ్వారు. ఇలా అన్నారు -

"మీరు మమ్మల్ని చూడలేకపోవచ్చు. కానీ, మేము మీ అందరినీ ఎపుడూ చూస్తూ ఉంటాం."

ఈ మాటలు ఒక ప్రక్క ఆమెకు ఊరట కలిగిస్తున్నాయి. మరోప్రక్క ఆమె ఆశ్చర్యం పెరిగిపోతోంది.

గురుదేవులు ఆ తర్వాత చెప్పిన ఈ మాటలకు ఆ ఆశ్చర్యం ఇనుమడించింది -

**స్వచ్ఛందంగా స్వీకరించిన దుఃఖం ఐశ్వర్యమే.**

"అమ్మాయీ! మేమిద్దరం శరీరం వదిలినా ఈ స్థలాన్ని వదలలేదు. అంతస్థను మార్చుకున్నాం. అంతే. ఇంతకుముందు భౌతిక జగత్తులో ఉండేవాళ్లం. ఇపుడు సూక్ష్మ జగత్తులోకి వచ్చాం. ఒక గదినుంచి మరో గదికి మారినట్లు. అయితేనేం. మా పిల్లలు తమ భావనలనూ, ఆలోచనలనూ మాపైన ఏకాగ్రం చేస్తే- ఇప్పుడూ సంభాషణ సాధ్యపడుతుంది. వారు తమ మాటలు మాకు చెప్పవచ్చు. మా సంకేతాలనూ, సందేశాలనూ ఎంతో తేలికగా వినవచ్చు."

నేహ మనస్సు తనకు కలిగిన ఈ దివ్య అనుభూతిలో తనను తాను మరచిపోయింది.

ఆ క్షణంలో ఆమెకు మరో దృశ్యం కానవచ్చింది.

తేజస్వులైన మహాపురుషులు కొందరు, కాంతిపుంజములుగా కనిపిస్తున్న స్త్రీ పురుషులు కొందరు గురుదేవులు- మాతాజీల వద్దకు వచ్చారు. వస్తూనే వారందరూ వారిద్దరికీ వంతులవారీగా ప్రణామం చేశారు. ఆ తర్వాత వెళ్లిపోయారు.

ఈ విచిత్ర దృశ్యాన్ని చూచి, నేహ మరో ప్రశ్న అడిగింది-

"వీరంతా ఎవరు?"

"తెలుసుకుని ఏం చేస్తావు?" - అని వందనీయ మాతాజీ నవ్వుతూ జవాబిచ్చింది.

అయితే వెంటనే గురుదేవులు మాతాజీతో అన్నారు-

"ఈ పిల్లకు విషయం చెప్పు."

అపుడు మాతాజీ ఇలా వివరించారు-

"అమ్మాయీ! నీవు ఇపుడు శాంతికుంజ్‌లో ఉన్నావు కదా. ఈ శాంతికుంజ్ ఈ ధరిత్రిపై ఉన్న అత్యంత దుర్లభమైన ఆధ్యాత్మిక భూమి. ఇక్కడి ఆధ్యాత్మిక ఆకర్షణ శక్తి అత్యంత సాంద్రమైనది. తమలోని క్షుద్రతలలో కూరుకుపోయిన వ్యక్తులు దీన్ని అర్థం చేసుకోలేరు. చెరువులో నీటిని నాచు కప్పివేసే విధంగా- వారి క్షుద్రతల ముసుగు ఇక్కడి ఆధ్యాత్మిక సంపదను కప్పివేస్తుంది. భౌతికత నిండిన తమ కపట నాటకాలలో బూటకాలలో మునిగి ఉన్న జనం ఈ మహా సత్యాన్ని అర్థం చేసుకోలేరు.

"సూక్ష్మశరీరాలు ధరించిన ఋషిసత్తాలూ, దివ్య దేహాలు ధరించిన దేవ శక్తులూ నియమం ప్రకారం నిరంతరం ఈ శాంతికుంజ్‌కు వస్తూ ఉంటాయి. శాంతికుంజ్‌లో సంచరిస్తూ ఉంటాయి. నిర్మలమైన ప్రజ్ఞ కలిగిన వ్యక్తులకు ఈ వాస్తవం తెలుస్తుంది. వారు దీన్ని దర్శిస్తారు. ఈ శాంతికుంజ్‌లో, ఈ తీర్థ క్షేత్రంలో సాధన చేసేవారందరిపై, పవిత్ర భావంతో నిజమైన ప్రజాసేవకులుగా జీవించేవారందరిపై ఆ ఋషి సత్తాలూ, దేవశక్తులూ ఆశీస్సులు కురిపిస్తాయి. ఈ శాంతికుంజ్ నుండి గతంలో ఎవ్వరూ నిరాశతో తిరిగివెళ్లలేదు. భవిష్యత్తులో ఎవ్వరూ నిరాశతో తిరిగివెళ్లరు. అందరి కన్నీళ్లూ తుడవడం కోసం మేమిద్దరంకూడ ఈ శాంతికుంజ్‌లో నిరంతరం మహాతపస్సులో నిమగ్నులమై ఉంటాం."

ఈ మాటలు పూర్తికాగానే, నేహకు మెలకువ వచ్చింది.

బ్రాహ్మీ ముహూర్తంలోని ఆ ఘడియ ఆమెకు నవజీవన జాగరణ ఘడియ అయింది. ఈ దివ్య స్వప్నంతో ఆమె సంతాపం హరించుకుపోయింది.

నేహ శాంతికుంజ్‌నుండి తన ఇంటికి వెళ్లింది. అక్కడి పరిస్థితులన్నీ మారిపోయినట్లు ఆమె కనుగొన్నది. ఔషధాలూ, గురుకృప ఆమెకు ఆరోగ్యాన్ని వరంగా ఇచ్చాయి. ప్రభువు కృపవల్ల కుటుంబంలో సౌజన్యం కురిసింది. తపించిన మనస్సు చల్లబడింది.

ఈ మార్పు వెనుక ఆమెకు ఒకే ఒక సత్యం గోచరించింది-

శాంతికుంజ్‌నుండి ఎన్నడూ ఎవ్వరూ నిరాశతో తిరిగివెళ్లరు.

H H H

**పరమాత్మ మెదడుకు అందడు; హృదయానికి అందుతాడు.**

దుఃఖ మీమాంస

# దుఃఖాలకు మూల కారణాలు

ఆకస్మికమైన సుఖ దుఃఖాలు ప్రతి వ్యక్తి జీవితంలో వస్తూ ఉంటాయి. సురులూ మునులూ, దేవతలూ దానవులూ- ఎవ్వరూ వీటినుండి తప్పించుకోలేరు. అవతార పురుషుడైన శ్రీరామచంద్రమూర్తికి సైతం ఈ కర్మగతి తప్పలేదు. సూరదాస్ మాటలలో-

**గురు వశిష్ఠ పండిత బడజ్ఞానీ, రచిపచి లగన్ ధరై ।**
**పితామరణ జీరహరణ సియాకో, వనమేవిపతి పరై ॥**

అనగా-

వశిష్ఠుని వంటి జ్ఞాని గురువుగా ఉన్నప్పటికీ, శ్రీరాముడు కర్మగతిని తప్పించుకోలేపోయాడు. తండ్రి మరణాన్నీ, సీతాపహరణాన్నీ, వనవాసపు కష్టాలను ఆయన భరించవలసి వచ్చింది.

### సుఖ దుఃఖాలు కర్మల ఫలాలు

కష్టాలు అకస్మాత్తుగా ఎక్కడనుంచో ఊడిపడవు. దేవుడు కోపించి దుఃఖాన్ని శిక్షగా విధిస్తాడని భావించడం పొరపాటు. అన్ని విధాల దుఃఖాలూ మనం పిలవడంవల్లనే వస్తాయని 'పంచాధ్యాయి' ఖచ్చితంగా ప్రకటిస్తోంది. రామాయణం కూడ ఇదే చెపుతోంది-

**కాహున కోడ దుఃఖ సుఖ కర దాతా ।**
**నిజ-నిజ కర్మ భోగ సబ్ భ్రాతా ॥**

అనగా-

వ్యక్తికి దుఃఖం కలిగించే శక్తి మరే ప్రాణికీ, మరే వస్తువుకూ లేదు. అందరూ తమ కర్మల ఫలాలనే అనుభవిస్తారు. అనుభవిస్తూ ఏడుస్తూ ఉంటారు. ఆర్తనాదాలు చేస్తూ ఉంటారు.

ఒక కఠోర వ్యవస్థ జీవుడిని వెనుకనుంచి బంధించి ఉంచుతుంది. ఆ వ్యవస్థ కర్మల ఫలాలను తయారుచేస్తూ ఉంటుంది. చేప నీటిలో ఈదుతుంది. దాని తోక నీటిని చీల్చుతూ వెనువెంట ఒక రేఖలాంటిదానిని గీస్తూ పోతుంది. పాము ప్రాకుతూ పోతుంది. ఇసుకమీద దాని గుర్తు ఏర్పరుస్తూ పోతుంది. అలాగే- మనం పనులు చేస్తూ ఉంటాం. వాటి సంస్కారాలు ఏర్పడుతూ ఉంటాయి. చెడ్డపనుల సంస్కారాలు తాను నాటిన ముళ్ల మొక్కలవలె తనకే దుఃఖం కలిగిస్తాయి.

### కర్మగతిని తెలుసుకో

కర్మలు మూడు రకాలు. వాటి స్వభావాలు మూడు రకాలు. వాటి ఫలితాలు మూడు రకాలు.

సుఖం మనిషికి ఉండే సహజ స్థితి. మంచి పని చేయడం అతడి స్వభావం. ఆ మంచి పనికి ఫలితంగా మనిషి సుఖం పొందడంకూడ సహజమే. కష్టం దుఃఖంవల్ల కలుగుతుంది. జనం దుఃఖాన్ని చూచే భయపడతారు. గాబరాపడతారు. దానినుండి బయటపడాలని కోరుకుంటారు. కనుక, దుఃఖాన్ని గురించే ఆలోచన చేద్దాం.

ఆరోగ్యవర్ధక శాస్త్రం వేరు. చికిత్సా శాస్త్రం వేరు. అలాగే సుఖ దుఃఖాలకుకూడ రెండు శాస్త్రాలు విడిగా ఉన్నాయి. ఆరోగ్యం పెరగాలంటే పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే, సుఖాన్ని పెంచుకోవాలంటే ధర్మాన్ని ఆచరించాలి. దుఃఖాన్ని తొలగించుకోవాలన్నా, రోగాన్ని నయం చేసుకోవాలన్నా-దాని కారణాన్నీ, చికిత్సను తెలుసుకోవలసి ఉంటుంది. గహనమైన, క్లిష్టమైన కర్మ గతిని తెలుసుకోవడంవల్ల దుఃఖాలకు కారణాలు అర్థమవుతాయి. ఆ కారణాలను తొలగించడంవల్ల దుఃఖాలు సహజంగానే తొలగిపోతాయి. మరి ఈ దుఃఖాల స్వరూపం ఏమిటి?

### దైవికం, దైహికం, భౌతికం

దుఃఖం మూడు రకాలు- దైవికం (దేవ సంబంధం), దైహికం (శరీర సంబంధం), భౌతికం.

దైవిక దుఃఖాలు మనస్సుకు కలిగేవి. చింత, శంక, క్రోధం, అవమానం, శతృత్వం, ఎడబాటు, భయం, శోకంవంటివి. దైహిక దుఃఖాలు శరీరానికి కలిగేవి. రోగం, గాయం, దెబ్బ, విషం వంటివాటి ప్రభావంవల్ల కలిగే కష్టాలు. భౌతిక దుఃఖాలు అకస్మాత్తుగా, కంటికి కనబడకుండా వచ్చేవి. భూకంపాలు, దుర్భిక్షం, అనావృష్టి, మహమ్మారులు, యుద్ధాలు మొదలైనవి.

ఈ మూడు రకాల దుఃఖాలవల్ల మనుషులు వేదన చెందుతున్నారు. సతమతం అవుతున్నారు. ఈ దుఃఖాలు మూడూ మన మానసిక, శారీరిక, సామాజిక కర్మల ఫలితాలు. మానసిక

**వ్యక్తులనుకాక -గుణాలను పూజించు.**

పాపాల ఫలితంగా దైవిక దుఃఖాలు కలుగుతాయి. శారీరిక పాపాల ఫలితంగా దైహిక దుఃఖాలు కలుగుతాయి. సామాజిక పాపాల ఫలితంగా భౌతిక దుఃఖాలు ఉత్పన్నం అవుతాయి.

## అంతరాత్మ క్షాళనకు దుఃఖం

దైవిక దుఃఖం, అనగా మానసికమైన కష్టం, కలిగించే కారణం మానసిక పాపం. మనంతట మనమే తీవ్ర భావనలవల్ల ప్రేరితులమై చేసే పాపం. అసూయ, కృతఘ్నత, మోసం, దంభం, మొండితనం, క్రూరత్వం, స్వార్థపరత్వం వంటి చెడు ఆలోచనలు కారణంగా చెడు వాతావరణం మెదడులో నిర్మాణం అవుతూ ఉంటుంది. ఈ వాతావరణం అంతఃచేతనను (ఆంతరిక చైతన్యాన్ని) ప్రభావితం చేస్తుంది. పొగవల్ల గోడ నల్లబడినట్లు. నూనెలో తడిసినపుడు బట్ట మరకపడినట్లు. ఆత్మ సహజంగా పవిత్రమైనది. ఈ చెడు ఆలోచనలు, చెడు ప్రభావాలు తనమీద పేరుకుపోయి ఉండడాన్ని ఆత్మ సహించదు. ఈ మురికిని, ఈ మాలిన్యాన్ని ఎలా తొలగించాలా, ఎలా ప్రక్షాళన చేయాలా, తాను ఎలా శుభ్రపడాలా అని ఆత్మ ఆలోచిస్తూ ఉంటుంది.

కడుపులో హాని కలిగించే వస్తువులు పేరుకుపోయినపుడు కడుపు వాటిని డోకులద్వారా, విరేచనాలద్వారా వెలుపలికి నెట్టివేస్తుంది. అలాగే- తీవ్రమైన కోరికతో, తెలిసి చేసిన పాపాలను బహిష్కరించడానికి ఆత్మ ఆతురత చెందుతుంది. ఈ విషయం మనకు ఏమాత్రం తెలియదు. అయితే, ఆత్మ లోలోపల దాని బరువును దింపుకోవడానికి ఎంతో హైరాన పడుతుంది. ఎంతో వ్యాకులత చెందుతుంది. ఈ బరువును దింపుకునే అవకాశాలనూ, సందర్భాలనూ కూడగట్టుకోవడానికి ఆంతరిక మనస్సు రహస్యంగా ప్రయత్నిస్తూ ఉంటుంది. అవమానం, వైఫల్యం, ఎడబాటు, శోకం, దుఃఖం మున్నగునవి లభించే సందర్భాలను మనిషి ఏదో ఒక రోజున, ఏదో విధంగా లాగికొనివస్తాడు. ఆ దుష్ట భావనలతో, పాప సంస్కారాలతో కూడినవీ, తనకు నచ్చనివీ అయిన పరిస్థితులు చక్కబడడానికి ఆవిధంగా ప్రయత్నిస్తాడు.

శరీరంద్వారా చేసే దొంగతనం, బందిపోటు, అపహరణ, హింస మున్నగు పనులలో మనస్సే ప్రాధాన్యం వహిస్తుంది. హత్య చేయడంలో చేతికి ఎలాంటి స్వార్థమూ ఉండదు. మనస్సులో చెలరేగిన ఆవేశం ఆ హత్యద్వారా చల్లారుతుంది. ఇంద్రియాలకు సుఖం ఇవ్వని ఇలాంటి పనులు మానసిక పాపాలు. ఇలాంటి పాపాలకు ఫలం మానసికమైన దుఃఖం. భార్య, కుమారుడు మున్నగు ఆప్తుల మరణం, ధనాన్ని కోల్పోవడం, అపనింద పాలుకావడం, అవమానం, ఓటమి, వైఫల్యం, పేదరికంవంటివి మానసిక దుఃఖాలు. వాటివల్ల మనిషిలో మానసిక వేదన పెల్లుబుకుతుంది. శోకం, సంతాపం ఉదయిస్తాయి. మనిషి దుఃఖంలో ఏడుస్తాడు. విలవిలలాడిపోతాడు. కన్నీరు కార్చుతాడు. తల పట్టుకు కూర్చుంటాడు. ఇందువల్ల వైరాగ్య భావం కలుగుతుంది. భవిష్యత్తులో అధర్మం జరపకూడదనే ప్రవృత్తి, ధర్మం ప్రకారం నడుచుకోవాలనే ప్రవృత్తి పెరుగుతాయి. శ్మశానంలో ఆప్తులు చితిలో మండుతూన్న సమయంలో ఇలాంటి భావం కలుగుతుంది. జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలనే భావన ఉదయిస్తుంది. సిరి సంపదలు పోయినపుడు మనిషి దేవుణ్ణి పిలుస్తాడు. ఓడిపోయిన, వైఫల్యం చెందిన వ్యక్తిలోని మొండితనం పటాపంచలు అవుతుంది. నిషా దిగిన తర్వాత మనిషి తెలివి తెచ్చుకుంటాడు. మనస్సులో పేరుకుపోయిన అసూయ, కృతఘ్నత, స్వార్థపరత్వం, క్రూరత్వం, నిర్దయ, మోసం, దంభం మొండితనంవంటివాటిని క్షాళన చేయడానికి మాత్రమే మానసిక దుఃఖాలు వస్తాయి. ఆత్మపై పేరుకుపోయిన ప్రారబ్ధ కర్మల పాప సంస్కారాలు వెలికి రావడానికే దుఃఖాలు వస్తాయి. గతంలో జరిగిన ఆ పనుల, ప్రారబ్ధ కర్మల నికృష్ట సంస్కారాలను కడిగివేయడానికి వేదనా ప్రవాహం వెలికివస్తుంది.

## అంగవైకల్యానికి కారణం

పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలకూ, ఆనువంశికంగా వచ్చే రోగాలకూ కారణం పూర్వజన్మలో ఆ అవయవాలు దుర్వినియోగం కావడం. వ్యక్తి చనిపోయిన తర్వాత అతడి సూక్ష్మ శరీరం మిగిలిపోతుంది. ఆ సూక్ష్మ శరీరమే తర్వాతి జన్మలో క్రొత్త శరీరాన్ని నిర్మాణం చేస్తుంది. ఈ జన్మలో ఒక అవయవాన్ని దుర్వినియోగం చేస్తూ ఉంటే, ఆ అవయవం సూక్ష్మ శరీరంలో అత్యంత బలహీనం అయిపోతుంది. ఉదాహరణకు- ఒక వ్యక్తి అతిగా సంభోగం చేస్తే, సూక్ష్మ శరీరంలో ఆ అవయవం బలహీనపడుతుంది. ఆ వ్యక్తి తర్వాతి జన్మలో నపుంసకుడు కావచ్చు. ఈ నపుంసకత్వం కఠోరమైన శిక్ష మాత్రమే కాదు. సంస్కరణకు ఒక ఉత్తమ పద్ధతికూడా. శరీరం, మనస్సు కలసి చేసిన పాపాల క్షాళనకై పుట్టుకతో వచ్చే రోగాలు కలుగుతాయి. లేదా శిశువుకు అంగవైకల్యం కలుగుతుంది. అలా అవయవం లోపించడంవల్ల, బలహీనం కావడంవల్ల అది ఎక్కువ పనిచేయవలసిన అవసరం ఉండదు. అందువల్ల సూక్ష్మ శరీరంలోని ఆ అవయవం విశ్రాంతి పొందుతుంది. తర్వాతి జన్మకు తాజాగా తయారవుతుంది. దీనితోపాటు-మానసిక దుఃఖం కలగడంవల్ల

**కర్తవ్య బుద్ధి గుణాలకు వన్నె తెస్తుంది.**

మనస్సుపై ఉన్న పాప భారం కూడ కడిగివేయబడుతుంది.

శారీరక పాపంతో కలగలిసి ఉన్న మానసిక పాపం ప్రభుత్వం విధించే శిక్ష ద్వారా కాని, సామాజిక దండనద్వారాకాని, ప్రాయశ్చిత్తం ద్వారాకాని ఈ జన్మలో కడిగివేయబడని పక్షంలో- అది తర్వాతి జన్మకు బదిలీ అవుతుంది. కానీ, పాపం కేవలం శారీరకమే అయితే, లేదా దానిలో మానసిక పాపం పాలు తక్కువగా ఉంటే- దాని క్షాళన త్వరలోనే శారీరిక ప్రకృతి ద్వారా జరిగిపోతుంది. ఉదాహరణకు-మద్యం సేవిస్తే మతి భ్రమించింది. విషం త్రాగితే మరణం సంభవించింది. ఆహార విహారాలలో పొరపాటు జరిగితే వికారం ఏర్పడింది. ఈ విధంగా శరీరం తన సాధారణ దోషాలను త్వరగా సరిదిద్దుకుంటుంది. ఈ జన్మలో చేసిన రుణాన్ని ఈ జన్మలోనే తీర్చుకుంటుంది. అయితే, మానసిక దర్గుణాలతో కలసిన తీవ్రమైన శారీరిక దుర్గుణాలు తర్వాతి జన్మలో ఫలితం పొందడానికై సూక్ష్మ శరీరంతోపాటు వెళతాయి.

## సామాజిక పాపం

భౌతిక కష్టాలకు కారణం మన సామాజిక పాపం. మానవ జాతి మొత్తం ఒకే సూత్రంతో బంధించబడి ఉంది. విశ్వవ్యాపంగా జీవ తత్వం ఒక్కటే. ఆత్మ సర్వవ్యాపి. అంతటా విస్తరించి ఉన్నది.

దుష్టుడైన వ్యక్తి తన తల్లిదండ్రులకు తలవంపులు తెస్తాడు. తన కుటుంబానికి సిగ్గుచేటు అవుతాడు. ఆ వ్యక్తి చేసే కర్మలతో తమ కర్తవ్యం కూడ ముడిపడి ఉండడంవల్ల ఆ కుటుంబంవారు సిగ్గుపడతారు. తమ కుమారుణ్ణి, తమ కుటుంబంలోని వ్యక్తిని సుశిక్షితుడుగా, సదాచారిగా ఎందుకు చేయలేదు? అతడిని దుష్టుడుగా ఎందుకు మారనిచ్చారు? ఈ ఆధ్యాత్మిక బాధ్యత ఆ కుటుంబ సభ్యులపై కూడ ఉన్నది. చట్టం నేరస్థుణ్ణి శిక్షిస్తుంది. అయితే, కుటుంబీకుల ఆత్మ తాను సిగ్గుపడుతుంది. ఎందుకంటే - ఈ వ్యవహారంలో ఏదో రూపంలో తాను కూడ నేరస్థుడనేనని కుటుంబీకుల గుప్త శక్తి అంగీకరిస్తుంది.

అదే విధంగా- సమాజమంతా ఒకే సూత్రంతో బంధించబడి ఉంది. అది ఒక విశాల కుటుంబం. కనుక, సమాజంలోని ఒకరి నీచత్వానికి మరొకరు బాధ్యులు అవుతారు. పొరుగు ఇల్లు నిప్పంటుకుని కాలిపోతూ ఉంటే తమాషా చూస్తూ నిలబడి ఉంటే, ఆ తర్వాత తన ఇల్లూ కాలిపోవచ్చు. పేటలో ఒక ఇంటిలో అంటువ్యాధి సోకినపుడు ఇతరులు దాన్ని నిరోధించడానికి ముందుకురాకపోతే- ఆ వ్యాధికి వారుకూడ గురికావలసివస్తుంది. దొంగతనం, బలాత్కారం, హత్య, లూటీవంటి నేరాలు జరుగుతూ ఉన్నపుడు ఒక వ్యక్తి చూస్తూ ఊరుకుంటే, సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ వాటిని అడ్డుకోవడానికి ప్రయత్నించకపోతే-సమాజం అతడిని నిందిస్తుంది. దైవ శాసనం ప్రకారం అతడుకూడ శిక్షార్హుడుగా పరిగణించబడతాడు.

ప్రతి మనిషీ తాను సదాచారాన్ని పాటిస్తూ జీవించాలి. ఇతరులు అవినీతికి పాల్పడకుండా గట్టిగా ప్రయత్నించాలి. ఒక దేశం సంకుచిత స్వార్థంలో మునిగిపోయి ఇతర దేశాల దుష్టచర్యలను అడ్డుకోవడానికీ, సదాచారాన్ని పెంపొందించడానికీ ప్రయత్నించకపోతే- దానికి కూడ ఇతరుల పాపాలు అంటుతాయి. స్వార్థపరత్వం అనే ఆ సామూహిక పాపానికి సామూహికమైన శిక్ష పడుతుంది. భూకంపం, అనావృష్టి, దుర్భిక్షం, మహమ్మారి, మహాయుద్ధం- వీటికి కారణం ఇలాంటి సామూహిక దుష్టకర్మ అవుతుంది. స్వార్థపరత్వానికి ప్రాధాన్యం ఇచ్చి పరోపకారాన్ని ఉపేక్షించడమే ఈ దుష్టకర్మ.

అన్యాయాలు చేసే ధనికులకన్న మూగ పశువులవలె జీవితాలు వెళ్లదీసే అమాయక ప్రజలే ప్రకృతి వైపరీత్యాలవల్ల మరింతగా నష్టపోతూ ఉండడం మనకు కనిపిస్తుంది. అతివృష్టి, అనావృష్టులవల్ల పేద రైతులు మరింతగా నష్టపోతూ ఉంటారు. అన్యాయం జరిపేవారికన్న అన్యాయాన్ని సహించేవారు మరింతగా పాపులు కావడం ఇందుకు కారణం. "బుజ్‌దిల్ జాలిమ్ కా బాప్ హోతా హై-" అనే సామెత ఉంది. అనగా- పిరికితనం దమననీతికి తండ్రి. పిరికితనం తనపై దమనకాండ జరపడానికి ఎవరో ఒకరిని ఆహ్వానిస్తుంది. గొర్రెల ఉన్నిని గొర్రెలకాపరి కత్తిరించకుండా వదలివేస్తే మరొకరు దాన్ని కత్తిరిస్తారు. పిరికితనం, బలహీనత, అవిద్య వాటికవి మహాపాతకాలు. ఇలాంటి పాపులపై భౌతిక కోపాలు, ప్రకృతి వైపరీత్యాలు హెచ్చుగా కురియడంలో ఆశ్చర్యం ఏముంది? వీరి పిరికితనాన్ని తొలగించడంకోసం, వీరిలో సహజమైన చైతన్యాన్ని మేలుకొలవడంకోసం, తద్వారా వీరి పాపాలను తొలగించడంకోసం అదృశ్యసత్తా ఇలాంటి సంఘటనలను సృష్టించవచ్చు. ఈ భౌతిక దుర్ఘటనలు సృష్టిలోని దోషాలు కావు. ఇవి కేవలం మన దోషాలు. బంగారానికి పుటంపెట్టి దానికి వన్నె తెచ్చేవిధంగా-మనల్ని క్షాళన చేయడానికై ఈ కష్టాలు పదేపదే వస్తూ ఉంటాయి. ఇవి దయాగుణానికి చిహ్నాలు. ఇవి ప్రపంచానికి గట్టి హెచ్చరికలు ఇస్తాయి. సామాజిక పాపరాహిత్యాన్ని పెంచాలనే ఆదేశాన్ని ఇస్తూ ఉంటాయి.

H H H

**ఔన్నత్యం దేవుడి పేరు చెపితే రాదు; దేవుడి పని చేస్తే వస్తుంది.**

నావారితో నామాట

# విరాట్‌యాత్ర సాగిస్తున్న మహోద్యమం-1

## 2012లోగా కృతయుగానికి పునాదిరాయి

యుగ నిర్మాణ యోజన అనే మహోద్యమంలో మనమంతా భాగస్వాములము. ఇది ఒక చరిత్రాత్మక కార్యం. ఒక భగీరథ ప్రయత్నం. కృతయుగాన్ని భువిపై అవతరింపజేయడం వంటి కార్యం. అయినా ఎందువల్లనో మనం ఒకోసారి అనుమానంలో పడుతూ ఉంటాం. విధ్వంసం, అసురత్వం, అనైతికత జయిస్తున్నాయని నేటి ప్రతికూల పరిస్థితులను గమనించినప్పుడు మనకు అనిపిస్తుంది. 10-15 సంవత్సరాలలో పరివర్తన జరుగుతుందనీ, 14-15 సంవత్సరాల తర్వాత కృతయుగ పరిస్థితులు నెలకొంటాయనీ మనం ఎలా నమ్మగలం- అనుకుంటాం. ప్రజ్ఞా యుగం ఎలా వస్తుంది- అనే ప్రశ్న మన మనస్సులలో ఉదయిస్తుంది.

2004 నుండి 2011-12 వరకు ఒక విశిష్ట సమయం వస్తోంది. కృత యుగ భవన నిర్మాణానికి పునాదిరాయి పడుతుంది ఆ సమయంలో. అందుకు సన్నాహక చర్యగా దేశమంతటిలో కార్యకర్తలలోని సంఘటనాత్మక దృక్పథాన్ని పరీక్షించడం జరుగుతోంది. వివిధ స్థలాలలో కార్యశాలలు నిర్వహించబడుతున్నాయి. 2004-2005 సంవత్సరంలో బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజత జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కొన్ని వాస్తవాలను గుర్తుచేసుకుందాం.

## రామకృష్ణ పరమహంసయే శ్రీరామశర్మ ఆచార్య

మన గురుసత్తాతో విషయం మొదలవుతుంది. ఆయన రక్త మాంసాలతో కూడిన శరీరంతో, సాదాగా జీవించిన ఒక తండ్రి, ఒక సంరక్షకుడు, ఒక బ్రాహ్మణుడు. 1911 నుండి 1990వరకు ఆయన తమ అనేక శరీరాలతో అసామాన్యమైన కార్యాన్ని సాధించారు. ఆయనకు శిష్యులైనందుకు, ఆయన ప్రాణచేతనతో భాగస్వామ్యం పొందినందుకు పరిజనులు గర్వించాలి. ఆయన ఎవరో తెలుసుకుంటే- ఆయన లీలలు ఈ ధరిత్రిపై జరుగుతున్న సమయంలో జీవించి ఉన్నందుకు మనం గర్విస్తాం.

శ్రీ'మ' శ్రీరామకృష్ణ పరమహంస ప్రసంగాలను శ్రీరామకృష్ణ వచనామృతం అనే గ్రంథంలో లిపిబద్ధం చేశారు. ఆ గ్రంథం మూడవ భాగం, 14వ అధ్యాయం (267-268 పుటలు)లోని రెండు పంక్తులు మహత్తరమైనవి. తన జీవితపు చివరి రోజులలో కాశీపోర్ బాగ్‌లో తమ ఆంతరంగిక శిష్యులతో పరమహంస కూర్చొని ఉన్నారు. ఆ సాయంత్రం ఆయన నోటినుండి ఈ మాటలు వెలువడ్డాయి-

**"శిష్యులకు ముక్తి లభించదు. వాయువ్య దిశలో నేను మరోమారు దేహాన్ని ధరించవలసి వస్తుంది.'**

ఈ వాక్యం ఎంతో అర్థవంతమైనది. కోల్‌కతా పట్టణానికి వాయువ్యదిశ సరాసరి ఆగ్రా-మథురల మధ్యనుండి ఆఫ్ఘనిస్తాన్‌వైపు వెళుతుంది. ఆయన ఆంతరంగిక శిష్యులు 16గురికీ ఈ జన్మలో- 1886 నుండి 1940 వరకు అనుకోవచ్చు- ముక్తి లభించదు. వారు తిరిగి జన్మ ఎత్తుతారు. తాను స్వయంగా తిరిగి దేహాన్ని ధరించి వారికి ముక్తిని ప్రసాదిస్తారు. వాయువ్య దిశలో ఆగ్రా పట్టణానికి ఉత్తరంగా ఆవల్‌ఖేడా గ్రామంలో ఆచార్య శ్రీరామశర్మ జన్మించారు. హిమాలయాల యాత్ర జరిపారు. శ్రీరామకృష్ణ పరమహంస చేసిన వివిధ ప్రయోగాలను తిరిగి జరిపారు. పోగొట్టుకున్న తన శిష్యులను-16 మందినే కాదు, సుమారు 24 లక్షలమంది దివ్య ఆత్మలను- వెదకి పట్టుకున్నారు. అందరినీ యుగ నిర్మాణ కార్యంలో నియోగించారు. వైజ్ఞానిక అధ్యాత్మవాదం అనే దర్శనాన్ని ప్రతిపాదించారు. ఆ దర్శనం 21వ శతాబ్దపు ధర్మంగా రూపొందుతోంది. ఆయన మహిళా శక్తిని మేలుకొలిపారు. కర్మకాండలకు ప్రాణం పోశారు. కులరహితమైన, శ్రేష్ఠమైన ఆలోచనలు కలిగిన వ్యక్తుల సమాజాన్ని నిర్మాణం చేశారు. 1886 తర్వాత ఇలాంటి సంస్థ మరొకటి నిర్మాణం కాలేదని చరిత్ర చెపుతోంది.

పరమపూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య స్వయంగా శ్రీరామకృష్ణ భగవానులేననీ, మాతా భగవతీదేవి శారదామాతయేననీ, మనమంతా వారి 16గురు ఆంతరంగిక శిష్యుల అవయవాలమనీ అనడంలో సందేహం ఏముంది? మనలో ప్రతిఒక్కరిలో వివేకానంద ఉన్నారు, కృష్ణప్రియ ఉన్నారు. అభేదానంద ఉన్నారు, నివేదిత ఉన్నారు.

సంయమనాన్నీ, శ్రమనూ మించిన డాక్టర్లు లేరు.

## వివేకానందుని భవిష్యవాణి

స్వామి వివేకానంద స్వయంగా ఇలా ప్రకటించారు-

"మహత్తరమైన ఇచ్ఛాశక్తి కలిగిన, జ్యోతిర్మయ ప్రభతో కూడిన ఒక దేవదూత, ఒక మహాపురుషుడు వచ్చే 50 సంవత్సరాలలో ఉదయిస్తాడు. ఆయన ఒక సంస్థలో శక్తిని నింపుతాడు. 100 సంవత్సరాల తర్వాత ఆ సంస్థ శక్తిశాలిగా తయారవుతుంది."

ఆయన 1901లో ఈ మాట చెప్పారు. భారతదేశానికి స్వరాజ్యం వస్తుందనీ, ఆధ్యాత్మిక నవచైతన్యాన్ని పూరించే ఒక విరాట్ సంస్థ నిర్మాణం అవుతుందనీ ఆనాడు ఎవ్వరూ ఊహించలేదు. ఆ సంస్థ దేశానికి సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని సాధిస్తుందనీ, వ్యక్తి వ్యక్తిలో ఉల్లాసాన్ని నింపుతుందనీ, వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం అనే త్రివేణిలో జాతి మొత్తాన్ని ముంచెత్తుతుందనీ ఆనాడు ఎవ్వరూ ఊహించలేదు.

1947లో దేశానికి స్వరాజ్యం వస్తుందనీ, అయితే భారీయెత్తున రక్తపాతం జరుగుతుందనీకూడ స్వామి వివేకానంద దాదాపు ఆ సమయంలోనే చెప్పారు. సుమారు 100 సంవత్సరాల తర్వాత బృహత్తర భారత్ నిర్మాణం కావడానికి ఆధారం ఏర్పడినప్పుడు ఆ గాయాలు మానతాయని చెప్పారు.

## కులరహిత సమాజ నిర్మాణం

స్వామి వివేకానంద తన సహచరునికి వ్రాసిన లేఖలో మరో విలక్షణ విషయం చెప్పారు-

"ఎలుకలు సైతం సాహసవంతులయ్యే సమయం వస్తుంది. చిన్నవాళ్లని పరిగణించబడినవాళ్లు సంఘటితులై నవనిర్మాణాన్ని వేగవంతం చేస్తారు."

ఎలుకలవంటి చిన్నచిన్న ప్రాణులు ధైర్యం తెచ్చుకుని అవినీతి అనే నౌకకు కన్నంవేసి దాన్ని ముంచివేస్తాయన్నది ఆ మాటల అర్థం. ఎలుకలు అంటే సంకుచిత స్వార్థంలో మునిగిన వ్యక్తులు. వారు తమ మనస్తత్వాన్ని మార్చుకుంటారు. సంఘటితులు అవుతారు. సమన్వితమైన తమ శక్తితో నూతన నిర్మాణాన్ని సాధిస్తారు. అఖిల విశ్వగాయత్రీ పరివార్‌లో క్రింది మధ్యతరగతికి చెందిన, ప్రతి కులానికీ, ప్రతి పంథ్‌కూ చెందిన చిన్నచిన్న వ్యక్తులు చేరి ఉన్నారు. వారు క్రమంగా తమ ఆలోచనా సరళిని మార్చుకున్నారు. సమయదానం, అంశదానముల ఆహుతి ఇచ్చి, సంఘటిత శక్తితో నడిచే ఒక మహోద్యమాన్ని వేగవంతం చేశారు.

1898లో మద్రాసులో "భారత్ భవిష్యత్తు" అనే విషయంపై ప్రసంగిస్తూ స్వామి వివేకానంద ఇలా అన్నారు-

"కృతయుగం ప్రారంభంలో ఒకే కులం బ్రాహ్మణ కులం ఉండేది. భవిష్యత్తులో వచ్చే కృతయుగంలో బ్రాహ్మణేతర కులాలన్నీ తిరిగి బ్రాహ్మణ కులంగా పరిణతి చెందుతాయి."

బ్రాహ్మణ వంశంలో జన్మించినవారి బ్రాహ్మణత్వం కాక, బ్రాహ్మణత్వంతో నిండిన జీవితాన్ని గడిపేవారి యుగం వస్తుందని స్వామీజీ పై మాటలో స్పష్టంగా సూచించారు. ఆ కాలం (19వ శతాబ్దపు ఉత్తరార్ధం, 20వ శతాబ్దం పూర్వార్ధం-పరతంత్ర భారతం)లో ఏదో ఒక కులానికి చెందినంత మాత్రాన ఉపేక్షకు గురయినవారు ఒక మహాపురుషుడు చేసిన గాయత్రీ ప్రక్రియ ద్వారా బ్రాహ్మణులు అవుతారు. తమ ప్రవృత్తులను మార్చుకుంటారు. తమ ఆచరణలో, సంస్కారాలలో ఆమూలాగ్రమైన పరివర్తన తెచ్చుకుంటారు. సమాజమంతనూ బ్రాహ్మణులను చేస్తారు. బ్రహ్మలో సంచరించేవారు, జ్ఞానాన్ని పంచేవారు, జ్ఞానాన్ని అర్పణ చేసేవారు-వీరేకదా బ్రాహ్మణులు. ఈ అర్థంలో స్వామీజీ భవిష్యత్తు గురించి చెప్పారు. నేడు చండాలురుగా ఉపేక్షకు గురయినవారు బ్రాహ్మణులవలె ఉన్నత స్థాయి ఆలోచనను తమ జీవితాలలో అమలుచేస్తారు. సమాజమంతా వారికి అండగా నిలుస్తుంది. కులరహిత సమాజాన్ని, ఒక బ్రాహ్మణ యుగాన్ని తేవడంలో గాయత్రీ పరివార్ విశిష్టమైన పాత్ర వహించింది.

## మహిళా జాగరణలో గాయత్రీ పరివార్

ఆ ప్రసంగంలో స్వామీజీ ఇంకా ఇలా అన్నారు-

"ఋషులు ప్రవచించిన ధర్మాన్ని భారతీయ మహిళలు ప్రచారం చేస్తే- ఒక మహత్తర తరంగం ఉవ్వెత్తున లేస్తుంది. అది పాశ్చాత్య జగత్తు మొత్తాన్ని ముంచివేస్తుంది. నేను దివ్యదృష్టితో దీన్ని చూస్తున్నాను."

భారతీయ మహిళ ఋషుల సందేశాన్ని, వేదాల దివ్య జ్ఞానాన్ని, గాయత్రీ మహాశక్తి తత్వాన్ని, అధ్యాత్మలోని నిగూఢ సిద్ధాంతాలను ప్రసారం చేస్తే- అది ఆశ్చర్యమే అవుతుంది. గాయత్రీ

**శీలం ఒక మహావృక్షం; వ్యక్తి దాని నీడ.**

పరివార్‌లోని మహిళా శక్తి పరమవందనీయ మాతాజీ నాయకత్వంలో మేలుకుంటోందని స్వామీజీ 1898లో తన దివ్యదృష్టితో చూచారు. తమ సంసార బంధాలను త్రెంచుకుని వారు సమాజంలోని అన్ని వర్గాలలోనికీ చొచ్చుకుపోతున్నారని ఆయన చూచారు. పరమపూజ్య గురుదేవులు స్వయంగా ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. పెంచి పోషించారు. మత వ్యవస్థ పూర్తిగా పురుషుల ద్వారా నడపబడుతున్న సమయంలో వారు పరమవందనీయ మాతాజీని ముందుకు నడిపించారు. ఆమెతో తపస్సు చేయించారు. ఫలితంగా-మహిళా జాగరణ ఉద్యమం దేశం మొత్తంలో, ప్రపంచంలో వ్యాపించింది. నేడు దేశంలోని మన కార్యకర్తలలో 60 శాతంమంది మహిళలు. విదేశాలలోని కార్యకర్తలలో మహిళలు 70 శాతంమంది. పసుపుపచ్చని వస్త్రాలలో జయజయ ధ్వానాలు పలుకుతూ, కలశ యాత్రలలో పాల్గొంటూ, నిర్మాణాత్మక కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ, బ్రహ్మవాదినులుగా ధార్మిక వేదికలపై ప్రవచనాలు ఇస్తూ, సంస్కారాలు అందిస్తూ-మహిళా శక్తి ఎంతటి మార్పు తెస్తున్నదో మనం గమనించవచ్చు.

## సాధకుల సంఘటన గాయత్రీ పరివార్

స్వామి వివేకానంద తమ ఉపన్యాసాలలో ఇలా ఉద్బోధించారు-

''భారతదేశం వైభవాన్ని సాధించాలంటే, ఉజ్వల భవిష్యత్తును నిర్మాణం చేయాలంటే- అందుకై సంఘటన అవసరం; శక్తి సంగ్రహం అవసరం, చెల్లాచెదరైన ఇచ్ఛాశక్తిని సమీకరించి సమన్వయపరచడం అవసరం.''

స్వామీజీ సంఘటనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. శ్రేష్ఠ చింతన కలిగినవారి, ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించేవారి సమన్వయానికి, సంఘటనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇచ్ఛాశక్తి చెల్లాచెదరయితే, శక్తి నశిస్తుంది. అలాంటి వ్యక్తులందరి ఇచ్ఛాశక్తి సమన్వితం అయితే, ఒకే దిశలో కేంద్రీకరించబడితే- సంఘటన శక్తివంతం అవుతుంది.

పరమపూజ్య గురుదేవులు మనకు ఇచ్చిన ఉపదేశం ఇదే. **సంగచ్ఛధ్వం సంవదధ్వం**-అనే సూత్రాన్ని వారు మనకు ఇచ్చారు. మనమంతా కలసి మెలసి ముందుకుపోవాలి. మనవలె ఆలోచించే ఇతర సంస్థలలోని వ్యక్తులను కలుపుకుని ముందుకుపోవాలి- ఇదే ఆయన సందేశం, అదే జరిగింది. నేడు సుమారు తొమ్మిది కోట్లమంది వ్యక్తులను కలుకుని పురోగమిస్తున్న ఒక విరాట్ సంస్థ గాయత్రీ పరివార్ నిర్మాణం అయింది.

ఇతరులవద్ద సాధన సంపత్తి ఉండవచ్చు. వారి ప్రచార యంత్రాంగం మన ప్రచార యంత్రాంగంకన్న మిన్న కావచ్చు. వారి ఉపన్యాసాలు వినడానికి లక్షలమంది జనం గుమిగూడవచ్చు. అయితే- ఏకాగ్ర నిష్ఠతో సాధకులుగా తయారై, ఒకే దిశలో పురోగమించే వ్యక్తులతో కూడిన ఏకైక సంస్థ గాయత్రీ పరివార్. ఇది మనం చెప్పుకునే మాట కాదు. సాక్ష్యాధారాలతో ముందుంచుతూన్న వాస్తవం. దీన్ని ఎవరైనా ఎపుడైనా పరీక్షించవచ్చు.

## దైవీ మహోద్యమం గాయత్రీ పరివార్

శ్రీ అరవిందులు "భారతదేశ పునర్జన్మ'' అనేగ్రంథంలో ఇలా వ్రాశారు-

''విశిష్ట యుగాలలో కొన్ని విశిష్ట ఉద్యమాలు ఉదయిస్తాయి. అప్పుడు దైవ శక్తి తనను తాను ప్రకటించుకుంటుంది. మహాశక్తితో మనిషి అంచనాలను తారుమారు చేస్తుంది. గతంలో వేసుకున్న లెక్కలను తలక్రిందులు చేస్తుంది. ఆ ఉద్యమ వేగాన్ని బట్టి, దాని తీవ్రతనుబట్టి అది మానవాతీతమైన శక్తిద్వారా నడపబడుతూన్నదని స్పష్ట మవుతుంది. ఆ ఉద్యమం వెనుక పరమేశ్వరుని హస్తం ఉన్నదని అప్పుడు మనం చెప్పగలుగుతాం. అదే ఆ ఉద్యమానికి నాయకత్వం వహిస్తోంది. ఆ ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించి తీరుతుంది. దాని సాధనాలను అర్థం చేసుకోవడం మనిషికి అసాధ్యం అయినప్పటికీ.'' (1909 జులై 17)

నాటి సమైక్య బెంగాలులోని ఖుల్నాలో బెంగాలీ భాషలో చేసిన ప్రకటనలో శ్రీఅరవిందులు పై మాటలు చెప్పారు. వీటి అర్థం ఒక్కటే. పరమాత్మ "సంభవామి యుగేయుగే'' అనే తన వాగ్దానాన్ని అమలు చేసే విశిష్ట సమయం వస్తుంది. మనిషి మరోవిధంగా ఆలోచిస్తాడు. ఈ వైజ్ఞానిక యుగంలో మనిషి బుద్ధి దాని స్థాయిలో దాన్ని అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తుంది. అయితే ఆ విశిష్ట సమయం పరోక్ష జగత్తునుండి శక్తిని గ్రహించి దిగివస్తుంది. అది తన వాహకులనుకూడ నిలబెడుతుంది. పరమేశ్వరుడు దానికి నాయకత్వం వహిస్తాడు. కనుక దాని లక్ష్యం పూర్తయి తీరుతుంది.

గాయత్రీ పరివార్ చేపట్టిన విశ్వవ్యాప్త ఉద్యమం జగత్తు మొత్తాన్ని నవనిర్మాణం చేసే విశిష్ట యోజన. దైవీ మహోద్యమం. ఆ పరమాత్మయే దీనికి సృష్టికర్త. ఆయనయే దీనికి నియంత. దీని విశిష్ట యాత్ర పూర్తయి తీరుతుంది.

H H H

**భగవానుని పిలుపును విన్నవాడు ధన్యుడు.**

## శతసూత్ర కార్యక్రమం

# యుగనిర్మాణానికి ఆధ్యాత్మిక ప్రాతిపదిక

యుగ నిర్మాణానికి ప్రాతిపదిక రాజకీయం కాదు. సామాజికం కాదు. అది ఆధ్యాత్మికం. యుగ నిర్మాణం ఒక మహత్తరమైన కార్యం. దానిని ఆధ్యాత్మిక స్థాయిలోనే చేపట్టవలసి ఉంటుంది. పెంపొందించవలసి ఉంటుంది. ఆధ్యాత్మిక స్థాయిలో చేసే ప్రయత్నాలలో ఉండే శ్రద్ధ, భావన, తత్పరత, గాంభీర్యం రాజకీయ, సామాజిక స్థాయిలలో చేసే సంస్కరణ ప్రయత్నాలలో ఉండడం సాధ్యపడదు. కనుక మనం ఈ స్థాయినుండే పని ప్రారంభిస్తున్నాం.

కనుక మనమంతా ఉపాసన, తపశ్చర్య, ఆధ్యాత్మిక భావనలతో ఉప్పొంగిపోవాలి. యుగ నిర్మాణ యోజనతో సంపర్కంలోనికి వచ్చే ఇతరులను కూడ ఈ భావనలతో ప్రభావితం చేయాలి. మన సంస్కరణ ఉద్యమం ఆధ్యాత్మిక లక్ష్య సాధనకు ఒక సాధనం మాత్రమే. కనుకనే, సాధనంతోపాటు లక్ష్యాన్నికూడ దృష్టిలో పెట్టుకోవడం తప్పనిసరి. మన ఆరు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇవి-

### గాయత్రీ ఉపాసన

గాయత్రీ మహామంత్రంనుండియే సంస్కృతి ఉద్భవించింది. ఆ మహామంత్రంలో జీవనంలో ఉత్కృష్టతకూ, ఉన్నతికీ అవసరమైన విద్యలన్నీ బీజరూపంలో ఉన్నాయి. భావనలనూ, ప్రవృత్తులనూ సన్మార్గంవైపు మళ్లించడం ఉపాసనకు ప్రధాన లక్ష్యం. ఇందుకు ఆధారం గాయత్రిలో ఉంది. అంతఃకరణను ఆ దిశకు త్రిప్పే శక్తి గాయత్రి ఉపాసనలో ఉంది. కనుక, గాయత్రి సర్వతోముఖమూ, విశ్వవ్యాప్తమూ, మానవీయమూ అయిన ఉపాసన. ఆ గాయత్రి ఉపాసన కోసం మనం ప్రతిరోజూ నియమబద్ధంగా కొంత సమయాన్ని కేటాయించాలి. అది అయిదు నిమిషాలు అయినాసరే. 108మార్లు గాయత్రీ మంత్రాన్ని జపించడానికి సుమారుగా అంతే సమయం పడుతుంది. మన ఇంటిలో, మన కుటుంబంలో, మన బంధువర్గంలో, మన సమాజంలో, మన పరిచయంలోనికి వచ్చిన వ్యక్తులలో గాయత్రీ ఉపాసనపట్ల శ్రద్ధ కలిగించడానికి మనం ప్రయత్నించాలి. ఏ ఉపాసన చేసే వ్యక్తులయినా, దానితోపాటు గాయత్రీ జపం చేయవచ్చు.

### యజ్ఞం అత్యవసరం

గాయత్రి సద్చింతనకూ, సద్భావనకూ ప్రతీక. అలాగే, యజ్ఞం సత్కర్మలకు ప్రతినిధి. మనకు ఇష్టమైన వస్తువులను లోకహితంకోసం నిరంతరం సమర్పిస్తూ ఉండాలనే ప్రేరణయే యజ్ఞీయ ప్రేరణ. మన జీవితమే ఒక యజ్ఞంగా మారాలి. ఈ భావనను సజీవంగా, చైతన్యవంతంగా నిలిపి ఉంచడంకోసం యజ్ఞ ప్రక్రియకు దైనిక జీవనంలో ఉపాసనాత్మకమైన స్థానం ఇవ్వబడుతోంది. మనం ప్రతినిత్యం యజ్ఞం చేయాలి. విధివిధానం ప్రకారం యజ్ఞం చేయడం కుదరకపోతే-అయిదు అన్నం మెతుకులు గాయత్రీ మంత్రం పఠిస్తూ అగ్నిహోత్రంలో హోమం చేయవచ్చు. లేదా, భోజనం చేసేటప్పుడు ఈ విధమైన అగ్నిపూజ చేయవచ్చు. నేతి దీపం, అగరువత్తులు వెలిగించడంకూడ యజ్ఞవిధికి ఒక రూపం. పైన చెప్పిన పద్ధతులలో దేనినైనా అనుసరించి యజ్ఞక్రమాన్ని కొనసాగించాలి. ఈ యజ్ఞ ప్రక్రియను మాత్రం మన పరివార్‌లోని ప్రతి గృహంలో తప్పనిసరిగా నిలిపి ఉంచడం అత్యవసరం.

### సమయదాన యజ్ఞం

ఇతరులను ఆలోచనాపరులుగా చేయడానికీ, యుగ నిర్మాణ భావనలను తనవరకే పరిమితం చేసుకోకుండా ఇతరులకు అందించడానికీ మనం నియమబద్ధంగా సమయదానం చేయాలి. జనసంపర్కంకోసం సమయాన్ని కేటాయించాలి. మిత్రులతో, బంధువులతో, పరిచయస్థులతో, అపరిచితులతో సంపర్కాన్ని నిలిపి ఉంచుకోవడానికై నియమబద్ధంగా ఇళ్లకు వెళ్లాలి. యుగ సాహిత్యాన్ని వారికి అందించాలి. మన మిషన్ గురించి వారితో చర్చించాలి. ఈ విధంగా మన సంపర్క క్షేత్రంలో వెలుగులు వెదజల్లడానికై మన సమయంలో కొంత భాగాన్ని విధిగా కేటాయించాలి.

**అందమైన శరీరం కన్న అందమైన ఆచరణ మిన్న.**

## ఆత్మచింతన, సత్సంకల్పం

ప్రతిరోజూ నిద్రలేచే సమయంలోకాని, నిద్రపోయే సమయంలోకాని యుగనిర్మాణ సత్సంకల్పాలను పఠించాలి. ఆ సత్సంకల్పాలకు అనుగుణంగా మన జీవితాలను మలచుకోవాలి. ఆ రోజు జరిగిన పొరపాట్లు మరునాడు జరగకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. రోజు రోజుకూ జీవితాన్ని మరింతగా నిర్మలం చేసుకుంటూ ఉండాలి.

## అవిచ్ఛిన్న దాన పరంపర

ప్రతిరోజూ కొంత సమయాన్నీ, కొంత ధనాన్నీ పారమార్థిక కార్యాలకు ఇస్తూ ఉండే కార్యక్రమాన్ని ఏర్పరచుకోవాలి. దానం మన జీవితంలోని ఆధ్యాత్మిక పరంపరలో అంతర్భాగం కావాలి. మన సంపాదనలో ఒక భాగం నియమితంగా పారమార్థిక కార్యాల కోసం వినియోగపడాలి. ఇందుకోసమై ధర్మఘటంలో రోజు ధాన్యంకాని పైసలుకాని వేయాలి. ఆ ధనాన్ని సద్భావనా ప్రసార జ్ఞానయజ్ఞం కోసమే ఖర్చు చేయాలి. యుగ నిర్మాణానికి ఆధారం అదే.

అలాగే, ధర్మ ప్రచారం కోసం, జనసంపర్కం కోసం కొంత సమయాన్ని ప్రతిరోజూ ఇవ్వాలి. రోజూ సమయం ఇవ్వడం కుదరకపోతే, వారాంతపు సెలవు రోజున అధిక సమయం ఇవ్వాలి. సద్భావనల ప్రసారానికీ, జాగరణకూ జనసంపర్కమే ముఖ్య సాధనం. ఇందుకు వెనుకాడకూడదు, సంకోచించ కూడదు.

## సత్యాగ్రహుల, స్వచ్ఛందసేవకుల సేన

సాంఘిక దురాచారాలనూ, నైతిక దురాచారాలనూ నిర్మూలించడానికై రాగద్వేషాలు లేనివారు, సంయమనం కలిగినవారు, మధుర వ్యవహరణ నేర్చినవారు, సౌశీల్య సంపదతో నిండినవారు అయిన సత్యాగ్రహుల సేనను నిర్మాణం చేయాలి. ఇతరులకు కష్టం కలిగించకుండా, తమ త్యాగంతో, తమ తపస్సుతో దురాచారాలను నిర్మూలించడంలో కష్టాలను సహించడానికి వారు సిద్ధపడాలి. సత్యాగ్రహం ఎక్కడ ఏవిధంగా జరపాలి అనేది ఎంతో దూరదృష్టితో చేయవలసిన నిర్ణయం. ఆ దూరదృష్టి లోపిస్తే- సంస్కరణకు బదులు ద్వేషం వ్యాప్తి చెందవచ్చు. ఈ విషయాలు అన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సత్యాగ్రహులైన స్వచ్ఛందసేవకుల సేన నిర్మాణానికి, దానిద్వారా దురాచారాల నిర్మూలనకు ఏర్పాట్లు జరగాలి. ఇందుకోసమై అర్హులైన వ్యక్తులు తమ పేర్లను స్వచ్ఛందసేవకుల జాబితాలో చేర్పించుకోవాలి. మన శక్తిని అంచనా వేసుకుని, అందుకు తగిన విధంగా కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. మొట్టమొదట ఆ వ్యక్తులకు తగు శిక్షణ ఇవ్వాలి.

H H H

## సహకారంలో సాఫల్యం

వనంలో నిటారుగా ఉన్న ఒక్క మొక్కతో పాటు ఒక లతకూడా నెమ్మది నెమ్మదిగా ప్రాకి మొక్కతో సమానమైనది. మొక్కను ఆశ్రయించుకొని అది ఫలించుట పుష్పించుట ఆరంభించింది. లత ఫలించుట పుష్పించుట చూచి వృక్షానికి అహంకారం కలిగింది - నేను లేకపోతే ఈ లత ఎప్పుడో నశించిపోయేది అని. అది బెదిరిస్తూ అన్నది - "ఓసీ లతా! నేను ఏది చెప్పినా దానిని చెయ్యి, లేకపోతే నిన్ను కొట్టి తోలివేస్తాను." అదే సమయంలో ఇద్దరు యాత్రికులు అటువైపు వెళ్తున్నారు. ఒకరు అన్నారు - "మిత్రమా, చూడు. ఈవృక్షమెంత శీతలము, సుందరమో; దీనిపై ఎంత మంచి లత పుష్పిస్తున్నదో. రా ఇక్కడ కొంతసేపు కూర్చొని విశ్రాంతి తీసుకుందాము". తన గొప్పతనమంతా లతపై ఆధారపడినదని తెలుసుకొని వృకంలోని అహంకారం నశించింది. ఆరోజు నుండి వృక్షం లతను బెదిరించటం ఆపివేసింది.

కథ మర్మాన్ని బోధిస్తూ సంత్ ఇలా అన్నారు - "భక్తులారా! స్త్రీతో కలిసిఉండుటలోనే పురుషుని గొప్పతన మున్నది. ఇద్దరూ ఒకరికొకరు సహచరులు, సహకారులు. అందువలన ఒకరు తక్కువని, ఒకరు ఎక్కువని భావించనకూడదు."

- ప్రజ్ఞాపురాణం నుండి

**లోపలి నలుపును తొలగిస్తే పరమాత్మ వెలుగు ప్రవేశిస్తుంది.**

సాధన విజ్ఞానం

# ఉపాసనలో ఏకాగ్రతను సాధించడం ఎలా?

## భగవానునితో బాంధవ్యం

ఉపాసనా విధానంలో జపం, పూజ, అర్చన, స్తోత్రం, ధ్యానం మొదలైనవి చేస్తున్నప్పుడు మన ఇష్టదైవం మనకు అతిదగ్గర బంధువు, మిత్రుడు, మనకుటుంబంలోనివాడూ, అత్యంత ఆత్మీయుడు అన్న అనుభూతి కలగాలి. లోకంలో అనేక రకాల బంధుత్వా లున్నాయి. వాటిలో ఏదోఒక బంధుత్వాన్ని ఏర్పరచుకోవాలి. తల్లి, తండ్రి, గురువు, బంధువు, మిత్రుడు, భర్త ఇటువంటి సంబంధాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అప్పుడప్పుడు పుత్రుడు, భార్య మొదలైన సంబంధాలను కూడ ఏర్పరచుకోవచ్చు. కౌసల్య, దేవకి, యశోద, సూరదాసు వీరందరూ బాలగోవిందుని ఇష్టదైవ మనుకున్నారు. ఫారసీభాషలో సూఫీకవులు భక్తిధారలో భగవంతుని తమ ప్రేయసిగా చిత్రీకరించారు. ఉమర్ ఖయ్యామ్ కవితలో మధుశాలలోని అర్థాన్ని ఆధ్యాత్మికంగా తీసుకున్నారు. భక్తిని మద్యంగానూ, ఈశ్వరుని మద్యాన్ని అందరికీ త్రాగించే 'సాకీ'గానూ చిత్రించడం జరిగింది. ఇటువంటి భావనలు చాలా కఠినమైనవి. అన్నింటికంటే సులభమైంది భగవంతునితో మనకంటె పెద్దగా ఉన్న బంధుత్వాన్ని తీసుకోవడం. తల్లిగా భావించే సంబంధం అన్నింటిలోనూ సులభమైందీ, భావపూర్ణమైందీ.

## తల్లిగా భావించడం తేలిక

గాయత్రీ ఉపాసనలో కూడ ఈశ్వరుని తల్లిగా భావించడమే జరిగింది. పిల్లవాడికి తల్లి యందుండే ప్రేమ చాలా సరళమైనదీ, సహజమైనదీ. మనుష్యులేకాక పశు, పక్షులూ, కీటకాలూకూడ తమ పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తాయి. వాటిల్లో శిశు సంరక్షణ బాధ్యత తల్లిదే. తల్లితప్ప మిగిలిన ఏ బాంధవ్యాన్ని తీసుకున్నా వాటిలో గుణ దోషాలుంటాయి. కానీ తల్లిప్రేమ అన్నింటి కన్న గొప్పదీ, నిస్వార్థమైందీ. ఇది త్యాగ, బలిదానాలతో నిండిఉంటుంది. "కుపుత్రో జాయేత్ క్వచితపి, కుమాతా న భవతి" కుపుత్రులు ఉండవచ్చు కానీ, కుమాత మాత్రం ఉండదు. ఈ మాట ఆధారంగా తల్లితో ఉన్న బంధుత్వం ప్రపంచంలో శ్రేష్ఠమైన ప్రేమకు ప్రతీకగా చెప్పబడుతోంది. కనుక ఈశ్వరునిలో తల్లిని ప్రతిష్ఠించు కోవడమే శ్రేయస్కరం. తల్లిగా భావించినపుడు ఈశ్వరుడు అనంతమైన ప్రేమ వాత్సల్యాల వర్షం తన పిల్లలపై కురిపిస్తే, ఆ ప్రేమ పరంపర అత్యంత ఆనందదాయకం అవుతుంది. భావనాత్మకంగా ఇచ్చిపుచ్చుకోవడానికి ఈ విధమైన ప్రతిష్ఠ ఆవశ్యకం.

## దేవుడికి లంచం ఇవ్వడమా?

తర్వాత మన ఇష్టదైవం సర్వవ్యాపకుడనీ, న్యాయాధీశుడనీ, ప్రతిచోటా అణువణువునా నిండి ఉన్నాడనీ అనుభూతి కలగాలి. మన లోపలా బయటా, రోమరోమాల్లో ఆయన శక్తి ప్రవహిస్తున్నది. ఆయన లేని స్థలం ఆవగింజంత కూడా లేదు. జడ, చేతన పదార్థాలలో, ఈ ప్రకృతి అంతటా ఆ ప్రకాశం మిరుమిట్లు గొల్పుతోంది. అంతటా ఆయన అనుభూతి మనకు కలుగుతోంది. ఈశ్వరుడు తన సహస్ర నేత్రాలతో మన అంతరంగాల్లో అతి సూక్ష్మమైనదాన్ని కూడ చూస్తున్నాడు. మనం చేసే ఏ పనిగానీ, ఏ భావంగానీ, ఏ ఆలోచనగానీ ఆయనకు తెలియకుండా ఉండవు.

సర్వవ్యాపకమైన ఈశక్తికి ఏ విధమైన పక్షపాతమూ లేదు. ఆయన పరిపూర్ణ న్యాయశీలుడు. నిష్పక్షపాతియైన న్యాయాధికారి. చేసిన కర్మలే ఆయన దృష్టిలో మంచి చెడులను నిర్ణయించే గీటురాళ్ళు, సత్కర్మలు, సద్భావనలు, సదాలోచనలు ఆయనకు ప్రియమైనవి. న్యాయాన్ని తూచే త్రాసులు ఇవే. ఈ కర్మలే కొందరిని ఇష్టులుగా, మరికొందరిని అయిష్టులుగా చేస్తాయి. నిర్ధారిత ధర్మమర్యాదలను పాటించనివారే ఈశ్వరునికి శత్రువులు. ధర్మ, కర్తవ్యపాలన చేసేవారు ప్రీతి పాత్రులూ, స్నేహ భాజనులు. నిజాయితీపరుడైన ఒక న్యాయాధికారి పాప పుణ్యాల నెరిగి శిక్ష విధిస్తాడు. అతనిలో రాగ ద్వేషా లుండవు. నిందలు, పొగడ్తలు అతనిని ప్రభావితం చేయలేవు. అలాగే ఈశ్వరుడు కూడ నైవేద్యం, పూలమాలలు, హారతి, తాంబూలం, సుగంధద్రవ్యాలలాంటివి సమర్పించారని అనుచితమైన కోర్కెలు తీర్చడు. పొగడ్తలూ, లంచాలతో పనులు నెరవేర్చుకోవాలని రకరకాల ఆశల్ని పెట్టుకోవడం ఆ మహత్తరశక్తిని కించపరచే అసహ్యకరమైన కుచేష్ట.

## సదాచరణమే భక్తి

ఈశ్వరుని ఉనికిని, అతని ఇష్టాన్ని, కార్యపద్ధతిని, ప్రేమను

**ధనం తన యజమానికి సేవ చేస్తుంది, లేకుంటే శాసిస్తుంది.**

బాగా తెలిసికొన్నట్లైతే మన ఉపాసన ఎంతో ప్రేరణాత్మకంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. మన సమీపంలో, లోపలా, బయటా అంతటా ఈశ్వరుని అనుభవిస్తూ ఆలోచనలనూ, కార్యపద్ధతినీ బాగుపరచుకోవడం తప్పనిసరి- అని తెలుసుకుంటాము. అప్పుడు ఈశ్వరునికి అప్రియమైన పనులు, ఆయనకు కోపం కలిగించే పనులు చేయము. పోలీసు సమక్షంలో ఒక దొంగ, ఆఫీసరు సమక్షంలో ఒక అవినీతిపరుడూ తామెక్కడ పట్టుబడతామోనని భయపడతారు. అలాంటప్పుడు సర్వత్రా వ్యాపించిన నిష్పక్షపాతి ఐన ఒక న్యాయాధికారి మనల్ని గమనిస్తున్నాడంటే అతను దండిస్తాడనీ, కోపగిస్తాడనీ నిరంతరం భయం కలుగుతుంది. వ్యక్తులు ఎటువంటి దుర్భావనలూ, దుష్కర్మలూ చేయలేరు.

నిజమైన ఆస్తికత వ్యక్తిని నిర్మలునిగా, పాపరహితునిగా చేస్తుంది. పాప పంకిలంలో చిక్కుకున్న వ్యక్తి ఎన్ని భజనలు చేస్తూ ఎంత ఆడంబరంగా కన్పించినా- అతను నాస్తికుడే. ఆస్తికత, దుష్టత్వం ఒకేచోట ఊడడం అసంభవం. ఈశ్వరునికీ, పాపకర్మలకూ భయపడేవారు ఇంకెవరికీ భయపడరు. ఉపాసనా క్రియలు సరిగా తెలియనప్పటికీ, ఎవరైతే సదాచార ప్రియులో, సదాశయులో, సన్మార్గగాములో వారే భగవంతునికి నిజమైన భక్తులు.

## ఆత్మపరీక్ష అనివార్యం

సర్వవ్యాపియైన భగవంతుడు మనం చేసే ప్రతి పనినీ వేయి కళ్ళతో గమనిస్తున్నాడనీ, మంచి కర్మలకూ చెడు కర్మలకూ ఉచితమైన పురస్కారాన్నిగానీ, శిక్షనుగానీ నిర్ధారిస్తున్నాడన్న భావం ఉపాసకుని మనస్సులో దృఢంగా ఉండాలి. ఈ వాస్తవాన్ని హృదయంగమం చేసుకున్నప్పుడు మన స్వభావాన్నీ, చరిత్రనూ శోధించుకోవలసిన అవసర మేర్పడుతుంది. పొరపాట్లను సరిదిద్దుకోవాలి. ఈ సాహసాన్ని చేస్తూపోతే మన అంతఃకరణ నిర్మలమై, మన వ్యవహారాలు పాపరహితములౌతాయి. భగవంతునితో నిజమైన స్నేహ మేర్పడే మార్గం సుగమమౌతుంది. దొంగ తన అపరాధ మనస్తత్వాన్ని కలిగి ఉన్నంతకాలం పోలీసులకూ, జైలుకూ, కోర్టుకూ భయపడుతూ ఉంటాడు. తన ఆచరణ సరిచేసుకున్నాక నిర్భయుడౌతాడు. అతనికి శత్రువులంటూ ఉండరు. అధికారులు కూడ అతడిని గౌరవిస్తారు. ఈశ్వరుని స్నేహాన్ని పొందాలంటే మొట్టమొదటిది నిర్మలంగా, పాపరహితంగా ఉండడం. ఇంతకంటే తక్కువ కృషికు భగవంతుడు మనకు లభ్యం కాడు.

ఉపాసకునిగా అర్హత పొందాలంటే ఉపాసకుడు తన జీవితాన్ని పరిశోధించుకోవడం వెంటనే ప్రారంభించాలి. మాలిన్యాన్ని పోగొట్టుకొని ఉన్నతమైన వాటిని జీవితంలో సమావేశపరచుకోవాలి. ఈ స్థితి ఎంత దృఢమైతే ఈశ్వరుడు అంత సన్నిహిత మిత్రు డౌతాడు. భయం, సంకోచం, ఈసడించుకోవడం, నీచత్వం ఉన్న వ్యక్తి మనస్సు విప్పి ప్రేమించే సాహసం చేయలేడు. మనస్సు పవిత్రంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది.

## నిర్మలత్వంద్వారా నిర్భయత్వం

నిర్మలమైన మనస్సుతో, శుద్ధ ఆచరణతో ప్రారంభింపబడిన ఆధ్యాత్మిక ప్రగతి పరిణామం పరిపూర్ణంగానూ, నిర్భయత్వంతో కూడినదిగానూ ఉంటుంది. భగవంతు డెప్పుడూ మనకు తోడుగా ఉన్నట్లు అనుభవం కలుగుతుంది. ఒక అంగరక్షకుడుగా, ఒక సహచరుడుగా అతడు మన వెంటవెంటనే నడుస్తున్న భావన కలుగుతుంది. వెంట ఈశ్వరు డుండగా భయమెందుకు?

భగవంతునిపై అచంచల విశ్వాస మున్నవారికి కొద్ది సాధనములతోనే పెద్దపెద్ద ప్రణాళికలు వేసికొని కార్యాన్వితం చేయడం సాధ్యమవుతుంది. సత్కర్మలకు భగవంతుని సహాయం ఎప్పుడూ ఉంటుంది. కర్తవ్య పథంలో నడవడానికీ పరమార్థ పరాయణత్వానికీ ప్రతిఫలం లభిస్తుంది. ఈ విషయంలో చరిత్రపుటల్లో ఎన్నో ఉదాహరణలు, లెక్కలేనన్ని ప్రమాణాలు మనకు కన్పిస్తాయి. నిరుపేద కుటుంబంలో పుట్టి, సదుపాయాలుకానీ, సహచరుల సహకారంగానీ లేకపోయినప్పటికీ పరమార్థ పథంలో పయనించినవారు ఎన్నో గొప్ప కార్యాలు చేయగలిగారు. సదుద్దేశ్యంతో చేసే సత్ప్రయత్నాలకు భగవంతుని సహాయం ఎప్పుడూ ఉంటుంది. తాను వ్యక్తిత్వాన్ని ఈశ్వర ప్రేమకు యోగ్యంగా చేసికొని ప్రయత్నిస్తే ఇది సత్యమని అవగతమౌతుంది.

## ఏకాగ్రతకు దారి ఇదే

ఈ విశిష్టతలు కలిగిన ఉపాసకుడు భగవంతుని సమీపంలోని ఆనందాన్ని పొందగలడు. కేవలం ప్రేమభావం నింపుకోవడమే తరువాయి. భగవంతుని తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు అనే రూపంలో చూడగలిగితే- ఆ భావన సుఖాన్ని ఇస్తుంది. ఆ ప్రేమ అనంతం. ఇక మనస్సెక్కడికీ పరిగెత్తదు. అతడు ధ్యానంలో ఎక్కువకాలం గడపగలడు. మనస్సును వశపరచుకుని చిత్తాన్ని ఏకాగ్రం చేయడానికి వేరే దారి లేదు.

అనువాదం: కె.అరవిందమ్మ

L L L

**లక్ష్యశుద్ధి, తన్మయత్వం, ఏకాగ్రత-ఇవే సాఫల్యానికి సోపానాలు.**

# సమాజ నిర్మాణం

# జన జాగరణ కేంద్రాలుగా దేవాలయాలు

భారీ దేవాలయాల నిర్మాణాన్ని భారతీయ మహాపురుషులు మహత్తర ప్రయోజనం కోసం చేపట్టారు. సాధారణ మానవులలో ఆస్తికత్వాన్ని బలోపేతం చేయడమే మన దేవాలయాల ముఖ్య ప్రయోజనం. ఆస్తికత అంటే- భగవంతుని ఆదేశాలు పాటించడం. నైతికంగా జీవించడం. దుష్కర్మలకు దూరంగా ఉండడం. విశ్వాత్మ, పరమాత్మలను మనోహరంగా ఉంచడంకోసం కృషి చేయడం.

ఆస్తికత ప్రథమ చరణం జపం, ధ్యానం, పూజ మొదలైనవి కావచ్చు. కాని భగవంతుని, అతని ఆదేశాలను జీవితంలో సమ్మిళితం చేసుకోవడమే నిజమైన ఆస్తికత. ఐకమత్యం, మంచి నడవడిక కలిగిన పరమార్థ పరాయణ జీవనమే ఆస్తికతకు ప్రమాణం. ఈ ఆస్తికతమీదే వ్యక్తి ప్రగతి, సమాజ ప్రగతి, సుఖశాంతులు ఆధారపడి ఉంటాయి.

భగవంతుడు మనకు అతిసమీపంలో అంతఃకరణంలోనే ఉన్నాడు. ఆయన నిందకు, స్తుతికి అతీతుడు. మనిషి తన ఆదేశాలను ఎంతగా పాటిస్తే అంతగా ప్రసన్నంగా ఉంటాడు. కృపను కురిపిస్తాడు. ఈ సత్యాన్ని తెలుసుకున్నవారు సజ్జనోచిత సదాచార జీవనాన్నే గడుపుతారు. సమాజం పట్ల తమ కర్తవ్యాన్ని గుర్తించి లోకకల్యాణం కోసం పాటుపడతారు.

ఆస్తికత వ్యక్తులలోను, సమాజంలోను ఉన్నత భావాలను పెంచుతుంది. అందువలన దీనిని మానవ జీవితానికి అవసరంగా గుర్తించారు. అన్ని పూజా ఉపాసనలూ ఈ ప్రయోజనం కోసమే సృష్టించబడ్డాయి. ప్రజల మనసులలో ఆస్తికత్వ ఆదర్శాల ప్రభావం విస్తృతంగా పడాలనేదే దేవాలయాల స్థాపనలో మహనీయుల ముఖ్య ఉద్దేశ్యం.

**భావనల సంస్కరణకు ఆలయం**

ఒకసారి కబీర్‌దాసు తన శిష్యునితో - నేనిప్పుడు ఒక దేవాలయం నుండి వస్తున్నాను, అన్నాడు. అతడు ఆశ్చర్యపడి- మహాత్మా! మీరు విగ్రహ పూజను వ్యతిరేకించేవారు కదా! మరి దేవాలయానికి వెళ్లడమేమిటి? ఎవరింటికో వెళ్లివస్తున్నా రనుకుంటాను, అన్నాడు. అవునవును. ఎక్కడ ఈశ్వర భజన జరుగుతుందో, ఏ ఇంట్లో వ్యక్తులు స్వాధ్యాయం, సత్సంగం చేస్తారో, పిల్లలను మంచివారుగా తీర్చిదిద్దే శిక్షణ ఇస్తారో ఆ ఇల్లే దేవాలయం- అని కబీర్ నవ్వుతూ సమాధాన మిచ్చాడు.

దేవాలయాల నిర్మాణంలో ఎంతో ధనాన్ని వెచ్చించడంలోని ఒకే ఒక ప్రయోజనం- ఈ ధార్మిక కేంద్రాల ద్వారా ఆస్తికతను సర్వత్రా వ్యాపింపజేయడమే. పూజ, హారతులు అక్కడ జరగడం మంచిదే. ప్రజలు దర్శనానికి వచ్చి,"భగవంతుని శక్తి లోకమంతా విస్తరించి ఉన్నది. కనుక ఆయన దండనకు దూరంగా ఉండి, అనుగ్రహాన్ని పొందడానికి సజ్జనులుగా జీవించాలి"- అని స్మరించుకోవాలి. మనిషి ఆస్తికత్వ భావనలను మరచిపోయినపుడే ఏదయినా చెడ్డ పని చేయగలడు. పరమాత్మ న్యాయవ్యవస్థ మన స్మృతిలో ఉంటే అవినీతి దిశగా మనం ఒక్క అడుగు కూడ ముందుకు వేయలేము. ఆస్తికత మన భావనలను అద్భుతంగా సంస్కరిస్తుంది. వ్యక్తిగత, సామాజిక ప్రగతి దీని మీదే ఆధారపడి ఉంది. భగవంతుని విగ్రహాన్ని దర్శించడం, పూజకోసం పలువురిని ఆహ్వానించడం, వచ్చిన వారు ఆస్తికత మూల విశ్వాసాలను హృదయంగమం చేసుకునే ప్రేరణనివ్వడం లాంటి కార్యాలను చేపట్టడం మొదలైనవి ఆలయాల ద్వారా ఒనగూడే ప్రయోజనాలు.

**పాశ్చాత్యులను అనుసరించేవారు వాళ్ల నీడ అవుతారు. నీడను ఎవరు గౌరవిస్తారు?**

## శిక్షణ కేంద్రం ఆలయం

ఆలయం వాస్తవానికి ఒక ధార్మిక కేంద్రం. మనిషిలో ఆదర్శవంతమైన భావనల వృద్ధికి కావలసిన సత్ప్రవృత్తులు అందులో నిండి ఉంటాయి. అందుకోసమే అక్కడ ప్రతినిత్యమూ కథా ప్రవచనాలు జరుగుతూ ఉంటాయి. నమాజు తరువాత మసీదులో ముసల్మానుల మతపెద్ద భావపూర్వకమైన, దిశా నిర్దేశం చేసే ప్రవచనాలు చేస్తాడు. చర్చి ఫాదర్ కూడ ఆదివారం ప్రార్థన తరువాత హాజరైనవారి నుద్దేశించి వ్యక్తిగత, సామాజిక కర్తవ్యాల గురించి ప్రసంగిస్తాడు. హిందూ ధర్మం అన్నిటికంటె ఉచ్చస్థితిలో ఉన్నపుడు కథా ప్రవచనాల ద్వారా ప్రతినిత్యం సమగ్ర స్థిరత్వానికి, ప్రగతికి అవసరమైన విషయాలను నేర్పేవారు. అంతేగాక భావనాత్మక వికాసానికి సహాయపడే పాఠశాలలు, గ్రంథాలయాలు, వ్యాయమశాలలు, సంగీత శిక్షణా కేంద్రాలు, కళా కౌశలాలకు చెందిన అన్ని కార్యక్రమాలు దేవాలయాలలో నిర్వహించబడేవి. ఆస్తికత్వ భావనలను ఏ విధంగా క్రియారూపంలో పెట్టవచ్చు, దాని నిర్మాణాత్మక, వ్యావహారిక స్వరూపం ఎలా ఉంటుంది? మొదలయిన వాటి గురించి ప్రత్యక్షంగా శిక్షణ పొందడానికి ప్రతి వ్యక్తి దేవాలయానికి వచ్చేవాడు. నిర్మాణాత్మక కార్యకలాపాలతో అసంఖ్యాక ప్రజల సమగ్ర ప్రగతికి దోహద పడడంలో ముందుండడం వలన దేవాలయాల నిర్మాణాన్ని పుణ్యకర్మగా భావించి అధిక మొత్తంలో ధనాన్ని ఖర్చుచేసేవారు.

ధార్మికులందరూ తమ సంపదను ఆలయాల నిర్మాణానికి, వాటిని నడపడానికి సమర్పించి తాము ధన్యులమని భావించేవారు. ఇంతకంటే డబ్బుతో చేయగలిగే మంచి కార్యాలు మరేవీ లేకపోవడమే ఇందుకు కారణం. ప్రజలు కూడ దేవతా విగ్రహం ముందు ఎంతో కొంత సొమ్ము శ్రద్ధాంజలిగా అర్పిస్తూ ఉండేవారు. ఆ డబ్బుతో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించబడేవి. పూజారులు పూజ, అర్చనల కోసం ఉదయం, సాయంత్రం కొంత ధనాన్ని వెచ్చించేవారు. మిగిలిన సమయాన్ని ధనాన్ని ఆలయ సంస్థద్వారా నిర్వహించబడే సత్కార్యాలలో వినియోగించేవారు. వారికి సామాజిక అవసరాల పరిజ్ఞానం ఉండేది. తదనుగుణంగా వారు తమ వ్యక్తిత్వాన్ని, పలుకుబడిని, శ్రమను జనుల మానసిక స్థితిని సక్రమంగా ఉంచడానికి ఉపయోగించేవారు. సమర్థగురు రామదాసు మహారాష్ట్రలో వందలాది ఆంజనేయ ఆలయాలు స్థాపించి వాటి ద్వారా శివాజీ చేస్తున్న స్వాతంత్ర్య సంగ్రామానికి కావలసిన ధన, జనశక్తిని ప్రోదిచేసేవాడు. శిక్కుమతానికి చెందిన గురుద్వారాలన్నీ అనుపయోగకర శాసనాలను తొలగించడంలో కేంద్ర బిందువులుగా పనిచేసి తమ స్థాపనలోని గొప్పదనాన్ని నిరూపించేవి. బౌద్ధ విహారాలు విశ్వవ్యాప్త ధర్మప్రచార ప్రణాళికకు కేంద్రబిందువులుగా ఉండేవి. ఆలయాలు చిరస్మరణీయమైన భూమికను పోషిస్తూ ఉండేవి.

## పరిస్థితి తారుమారు

ప్రముఖ దానశీలుడు జుగల్‌కిశోర్ బిర్లా మృత్యు ముఖంలో ఉన్నాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ప్రక్కనే నిలబడి ఉన్న విశ్వాసపాత్రుడైన ఒక వ్యక్తి-"సేఠ్‌జీ! మీరు జీవితం అంతా ధర్మాన్ని ఆచరించారు. వేలాది దేవాలయాలు నిర్మించారు. ప్రసన్నంగా ఉండవలసిందిపోయి దుఃఖిస్తున్నారెందుకు?" అని అడిగాడు. బిర్లాజీ కళ్ళనీళ్ళతోనే ఇలా చెప్పాడు-"నేను ఆలయాలు నిర్మించాను. కాని వాటిలో జన జాగరణ కార్యకలాపాలు జరిపించలేకపోయాను. అందుకే దుఃఖిస్తున్నాను."

ప్రస్తుతం అంతా తారుమారుగా ఉంది. ఆలయాలు గంట కొట్టి, హారతులివ్వడానికి పరిమితమయ్యాయి. పూజారులు ఉదయం, సాయంత్రం గంట కొట్టి తమ

నీ తప్పులను నిదానంగా చూపేవాడే నిజమైన స్నేహితుడు.

కర్తవ్యాన్ని ముగిస్తున్నారు. ఆ విశాల భవనాల వలన ఎటువంటి ప్రయోజనమూ లేదు. అందుకోసం వెచ్చిస్తున్న ధనం మఠాధీశుల సంపదగా మారిపోవడం చూస్తున్నాము. ప్రేరణప్రద కార్యక్రమాల మాటకూడ అక్కడ వినబడడం లేదు. ఇలాంటి దశలో అవి ప్రాణరహితమైన నిర్జీవ కళేబరాలుగా పడిఉండడం చూడవచ్చు. ఉపయోగం లేకపోవడంతో ఆకర్షణ తగ్గడం కూడ సహజమే. ఏవో ఉత్సవాలు వచ్చినపుడు చూడడానికి కొంత గుంపు కనిపిస్తుందే తప్ప నియమం ప్రకారం వచ్చేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. అలా వెళ్ళేవారికి కూడ కాలక్షేపం తప్పితే ఒరుగుతున్నదేమీ లేదు. నిరుపయోగమైన వస్తువులు చెడిపోతాయి. ఈ ధార్మిక స్థానాలలో నెమ్మది నెమ్మదిగా అనాచారం ప్రవేశించి, దుఃఖాన్ని, దోషాన్ని మిగిలిస్తున్నాయి.

భారతదేశంలోని ఈ ధార్మిక కేంద్రాలలో వేలాదికోట్ల రూపాయలు వెచ్చించబడి ఉన్నాయి. వాటి ప్రతిదిన ఆదాయం కోట్ల రూపాయలలో ఉంటోంది. ఈనాడు క్రైస్తవ మిషనరీలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వాటికంటె అనేక రెట్లు ఎక్కువగా నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహించగలిగే విశాల భవనాలు కూడ ఉన్నాయి. కనీసం ఒక లక్షమంది వ్యక్తులు ఆ దేవాలయాలలో కార్యకుశలతను నిర్మాణాత్మక కార్యాలలో వినియోగించుకుంటే సమాజానికి కాయ కల్పచికిత్స జరుగుతుంది. ఏ శ్రద్ధతో ప్రజలు ఈ ధనాన్ని వెచ్చిస్తున్నారో దానిని అనుగుణంగా ధర్మ సంస్థాపనకు కావలసిన వివిధ కార్యకలాపాలు కూడ నిర్వహించగలిగితే మన సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవచ్చు. సాధన సంపత్తిలేక కార్యక్రమం ఆగిపోయిందంటే అర్థం చేసుకోవచ్చు. కాని కావలసినంత సాధనాలు, సంపద ఉన్నప్పటికీ దానిని సరిగా ఉపయోగించుకోకపోతే అది సిగ్గుతో బాధపడవలసిన విషయం.

## నిర్మాణాత్మక కార్యక్రమాలు జరగాలి

ఈ ధార్మిక కేంద్రాలను సరియైన రీతిలో వినియోగించుకునే విషయాన్ని ఆలోచించి ధైర్యంగా అడుగు ముందుకు వేయవలసిన సమయం ఆసన్నమైంది. దేవాలయాల నిర్వాహకులు వాటిలో ఉన్న సంపద సక్రమంగా వినియోగింపబడుతున్నదా అనే విషయాన్ని ఆలోచించాలి. భగవంతుని పూజించడం మంచిదే. అది అవసరం కూడా. అయితే ఇంత ధన సంపదను, జనశక్తిని అంతవరకే పరిమితం చేయకూడదు. భగవంతుని పట్ల భక్తి పూజ, హారతులవరకే పరిమితం కాకూడదు. వ్యక్తులలోను, సమాజాలలోను భావనాత్మక అభ్యున్నతి కూడ భగవద్ భక్తిలో ఒక భాగమే. దేశం, ధర్మం, సమాజం, సంస్కృతుల అభ్యున్నతికి నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టవచ్చు. భగవంతుని పట్ల భక్తికి ఇవి ఏ మాత్రం తీసిపోవని గమనించాలి. ఆస్తికత అభివృద్ధికి, పోషణకు కావలసిన మంచి కార్యక్రమాలు నిర్వహించినపుడే దేవాలయాల ప్రయోజనం పరిపూర్ణ మవుతుంది.

లోకానికి శిక్షణ నిచ్చే ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను ఎన్నుకోవచ్చు. గ్రంథాలయాలు, గోష్ఠులు, సత్సంగ చర్చలు, ప్రగతిశీల పురాణ సప్తాహాలు, ప్రేరణా పద్ధతిలో పండుగలు చేయడం, సంస్కారాల వ్యవస్థ, దీపయజ్ఞాల క్రమం- ఇలాంటివన్నీ దేవాలయాలకు వచ్చేవారికి నిర్మాణాత్మక శిక్షణ నిస్తాయి. వాటి గౌరవం కూడ ఇనుమడిస్తుంది. ప్రజ్ఞామండళ్ల కార్యక్రమాలలో దీనినే దర్శించవచ్చు.

ప్రజలలో ఆస్తికతా భావాలను మేలుకొల్పి వారి ధర్మనిష్ఠను పెంచే జనజాగృతి కేంద్రాలుగా రూపుదిద్దు కోవడంలోనే ఆలయాల సార్థకత, ఉపయోగం ఇమిడి ఉన్నాయి.

అనువాదం: డి.వి.ఆర్.మూర్తి

**ప్రచారంవల్ల హృదయ పరివర్తన జరగదు.**

కృష్ణావతారం-23

# పాండవులకు మార్గ దర్శనం - 1

మహాభారత యుద్ధములో జరిగిన నరసంహారమునకు యుధిష్ఠిరుడు దుఃఖితుడయ్యెను. శ్రీకృష్ణుడు ఆయనకు అనేక విధముల నచ్చజెప్పుచు ఇట్లు పలికెను- సరియైన జ్ఞానము లేకపోవుటవలననే మానవు డిట్టి దుఃఖమును పొందును.

**సర్వం జిహ్మం మృత్యుపదమార్జవం బ్రహ్మణఃపదమ్।**
**ఏతావాన్ జ్ఞానవిషయః కిం ప్రలాపః కరిష్యతి ॥**
**నైవ తే నిష్ఠితం కర్మ నైవ తే శత్రవో జితాః।**
**కథం శత్రుం శరీరస్థ మాత్మనో నావబుధ్యసే ॥**

శ్రీకృష్ణ భగవానుడు పలికెను- ధర్మరాజా! కుటిలత్వము మృత్యువునకు స్థానము, సరళత బ్రహ్మప్రాప్తికి సాధనము. ఈ విషయమును సరిగ తెలిసికొనుటయే జ్ఞానవిషయము. దీనికి విరుద్ధముగ చెప్పబడిన దంతయు నిరర్థక ప్రలాపమే.

నీవు నీ పనిని పూర్తిచేయలేదు. నీవు శత్రువులపై విజయమును సాధింపలేదు. నీ శత్రువు నేటివరకు నీ శరీరములోనే కూర్చుండియున్నాడు. నీవు నీ శత్రువును గుర్తించుటలేదు.

1. యథార్థమును దాచి దానికి విరుద్ధమైన విషయమును వెల్లడించుటకు ప్రయత్నించుట కుటిలత్వమగును. ఇదియే మనలను నాశనము దిశగా తీసికొనిపోవును.

2. జీవితములో సారళ్యముండుటవలన మానవుని జీవితము లోపల బయట ఒకే విధముగా ఉండును. ఈశ్వర ప్రాప్తి స్థితి యేర్పడును. మనలో దాగియున్న దోషములే మన శత్రువులు, వానిని గుర్తించి నశింపజేయుట మన ముఖ్య కర్తవ్యము.

విషయమును ఇంకను స్పష్టపరచుటకు శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునకు వృత్రాసుర కథను చెప్పెను. వృత్రాసురుని ఉత్పాతములకు క్రుద్ధుడైన ఇంద్రుడు వానిపై వజ్రాయుధమును ప్రయోగించెను. వజ్రాయుధపు దెబ్బ తగులుట వలన వాడు భూమి, జల, అగ్ని, వాయువు, ప్రకాశము అను తత్వములలో దాగియుండెను. కాని ఇంద్రుడు ప్రతిచోట వానిపై దెబ్బ కొట్టెను. అప్పుడు ఆ అసురుడు అతని శరీరములోనే దాగికొనెను.

**తతో వృత్రం శరీరస్థం జఘాన భరతర్షభ।**
**శతక్రతురదృశ్యేన వజ్రేణేతీహ నః శ్రుతమ్ ॥**

ఇంద్రుడు తన శరీరములో దాగిన వృత్రాసురుని అదృశ్య వజ్రాయుధముతో సంహరించెను.

1. అసురవృత్తులే వృత్రాసురుడు. ఆత్మ చైతన్యమే ఇంద్రుడు.

2. ఉత్తమ సంకల్పములనెడు వజ్రాయుధముతోనే ఆ అదృశ్యశత్రువులు చంపబడుదురు. ప్రతి మనుష్యుడు తనలో దాగియున్న వృత్రాసురుని సంహరింపవలెను.

3. కథల ద్వారా ఉత్తమ సిద్ధాంతములు తెలుపబడును. కథలయొక్క ఈ యుద్దేశ్యమును ఎరుగవలెను.

వృత్రాసురుని కథద్వారా తనలోని అసురవృత్తులను నాశనము చేయవలసిన అవసరమును తెలియజేయుచు శ్రీకృష్ణుడు మనస్సులోని సంఘర్షణ మహత్వమును వివరించుచు ఇట్లు చెప్పెను - ఆకాంక్షలు వృత్తులు మనస్సునుండి పుట్టును. హానికరములని భావించి అసురవృత్తులను తొలగించుటకు ప్రయత్నించిచో, మనస్సు

**విజయ సాధనకు తెలివి, శ్రమ ఉండాలి; నేర్పరితనమూ ఉండాలి.**

వ్యతిరేకించును. ఇట్టి పరిస్థితులలో మనస్సుతో సంఘర్షణ పడవలసివచ్చును. బయటి యుద్ధములకు శౌర్యము, సాహసము, ప్రతిభ, సన్నద్ధము అవసరమైనట్లు ఆంతరిక యుద్ధమునకు గూడా అవి అవసరములే. దీనికి ప్రతి మానవుడు సన్నద్ధుడు కావలెను.

> యచ్చతే ద్రోణభీష్మాభ్యాం యుద్ధమాసీ దరిందమః
> మనసైకేన యోద్ధవ్యం తత్తే యుద్ధముపస్థితమ్ ॥
> తస్మాదభ్యుపగన్తవ్యం యుద్ధాయ భరతర్షభ ।
> పరమవ్యక్తరూపస్య పారం యుక్త్వా స్వకర్మభిః ॥
> యత్రనైవ శరైః కార్యంన భృత్యైర్న చ బన్ధుభిః ।
> ఆత్మనైకేన యోద్ధవ్యం తత్తే యుద్ధముపస్థితమ్ ॥

శత్రుదమనుడా! ద్రోణ భీష్ములతో ఏ యుద్ధము జరిగెనో అట్టి యుద్ధమే నీ యెదుట ఉన్నది. ఇప్పుడు నీవు ఒంటరిగానే నీ మనస్సుతో యుద్ధము చేయవలెను. అందువలన భరత భూషణా! నీవు యుద్ధమునకు సిద్ధము కావలెను. నీ కర్తవ్యమును పాలించుచు మనస్సును వశపరచుకొని నీవు మాయాతీతుడగు బ్రహ్మమును పొందవలెను. మనస్సుతో జరుగు ఈ యుద్ధమున బాణముల అవసరముండదు. సేవకుల అవసరముండదు. బంధువుల అవసరముండదు. ఇప్పుడు దానిలో ఒంటరిగ నీవే యుద్ధము చేయవలెను. ఆ యుద్ధము ఎదుట ఉన్నది.

1. మనస్సును జయించుటయే మనము చేయవలసిన అత్యవసరమగు గొప్పకార్యము.
2. ఈ గొప్పకార్యములో మనకు సహాయపడు వాడు మరెవ్వడు లేడు.
3. మనము మనస్సును జయించనిచో బయటి సంఘర్షణలలో విజయము సాధించినను దానివలన సుఖము శాంతి లభింపదు.

శ్రీకృష్ణభగవానుడు ఇంద్రప్రస్థములో పాండవులతో చాలాకాలము ఉండెను. యుద్ధము వలన మరణించిన పుత్రదుఃఖమునుండి, పరిచితుల దుఃఖమునుండి వారికి ఊరట కలిగించెను. దీనికై అనేక విధములైన జ్ఞానచర్చలను, సుందర ప్రాకృతిక స్థలములను ఏర్పాటు చేసెను. రాజ్యమును ఆదర్శవంతముగ నడుపుటకై వారికి మార్గదర్శనము చేసి సహాయపడెను. ఇట్లు అక్కడ సమతౌల్యము ఏర్పడిన పిమ్మట శ్రీకృష్ణుడు ద్వారకా పట్టణమున తన కర్తవ్యములను జ్ఞాపకము తెచ్చుకొని ఇంద్రప్రస్థమునుండి వెళ్ళదలచెను. అర్జునునకు తన కోరికను వెల్లడించి ఇట్లు పలికెను. ఇప్పుడు విశేష ప్రయోజనము లేకపోవుటవలన ఇక్కడ నేను ఉండవలసిన అవసరము లేదు.

> ప్రయోజనం చాపి నివాసకారణే
> న విద్యతే మే త్వదృతే నృపాత్మజ ।
> స్థితా హి పృథ్వీ తన పార్థ శాసనే
> గురోః సువృత్తస్య యుధిష్ఠిరస్యచ ॥

రాజకుమారా! నీతో కాలక్షేపము చేయుట తప్ప నాకు ఇక్కడ పని ఏమియు లేదు. పార్థా! ఈ పృథ్వి అంతయు నీయొక్క, సదాచారియు గురువునగు యుధిష్ఠిరుని యొక్క పాలనమున సుస్థిరముగా ఉన్నది.

1. పని పూర్తియైన తరువాత ప్రయోజనము లేకుండగ ఎక్కడను ఉండరాదు.
2. సదాచారి యగు మానవుడే గురువుని పాలకు డగుటకు యోగ్యుడు.

శ్రీకృష్ణుడు వెళ్ళిపోవునను వార్తను విని పాండవులు దుఃఖితులైరి. కాని తమ సంతోషమునకై ఆయనను నిలిపి యుంచుట కూడా మంచిది కాదని వారు తలంచి కొద్ది కాలము ఉండి భావి జీవితమునకు మార్గదర్శనము చేయవలసినదిగా అయినను కోరిరి. శ్రీకృష్ణుడు వారి ప్రేమను, జ్ఞానముపట్లగల ఆసక్తిని చూచి మరికొన్ని దినములు అక్కడ ఉండిపోయెను.

H H H

**ఇతరులనుండి నేర్చుకున్నదానికన్న స్వానుభవంద్వారా నేర్చుకున్నది విలువైనది.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 10


# భాగవత భూమికి యాత్ర-3

### పాముకాటు హెచ్చరిక

ధ్యానంలో కూర్చునే ముందు శ్రీరామ్ శివాలయానికి వెళ్లారు. శివుని దర్శనం చేసుకుని ఒక మామిడి చెట్టు నీడలో కూర్చున్నారు. వెంటనే ఆ అనుభూతి కలిగింది.

దర్శనం చేసుకుని ఆయన క్రిందికి దిగుతున్నారు. తాను కూర్చునే చోటు 40-50 అడుగుల దూరం ఉందనే భావం మనసులో కలిగింది. వాస్తవానికి ఆయన పద్మాసనంలో కూర్చొనే ఉన్నారు. కానీ, ధ్యానంలో మనసు లయం అయిన తర్వాత మనోఫలకంపై ఆ దృశ్యం కానవస్తోంది.

శివాలయంనుంచి క్రిందికి దిగుతూన్న సమయంలో కాలిక్రింద ఏదో మెత్తటి వస్తువు ఉన్నట్లు అనిపించింది. చూస్తే ఒక పాము అక్కడ ఉంది. కోపగించిన ఆ పాము క్షణంలో పడగవిప్పి కాలుమీద కాటు వేసింది. శ్రీరామ్ ఏమి జరిగిందో గుర్తించేలోగానే మొదట పిక్కమీద, ఆ తర్వాత నడుము క్రింద కాటు వేసింది.



పాము ఒక్కసారి మాత్రమే కాటు వేస్తుందని ఎక్కడో విన్నాం-అని మిత్రులు అడ్డుప్రశ్న వేశారు.

అందుకు శ్రీరామ్ ఇలా అన్నాడు-

కానీ, నాకు అప్పుడు అలాంటి అనుభవం కలుగుతోంది. ధ్యానంలో కూర్చొని ఉన్నప్పుడే ఆ అనుభవం కలుగుతోంది. పాము కాటు తర్వాత శరీరం ఒరిగిపోయింది. చికిత్స ఎలా చేయాలో అర్థం కాలేదు. ఇదంతా కనబడుతోంది. మరో వ్యక్తికి ఇదంతా జరుగుతూన్నట్లు కనబడుతోంది. పాము విషం శరీరంలోకి ఎక్కుతోంది. నిద్ర ముంచుకువస్తోంది. ప్రక్కన కూర్చున్న వ్యక్తులు ముఖంమీద నీళ్ళు జల్లారు. వైద్యుడు వచ్చాడు. ఆయన కొన్ని ఓషధుల కోసం మనిషిని పంపాడు. ఈలోగా మంత్రవేత్త కూడా వచ్చాడు. అతడు మంత్రాలు పఠిస్తూ పళ్లెంమీద లయాత్మకంగా గంటలు వాయించసాగాడు. ఆ లయలో మనస్సు మునుగుతూ తేలుతూ ఉంది. ఓషధులు వచ్చిన తర్వాత కషాయం తయారయింది. కషాయం త్రాగాను. బాధ తగ్గడానికి బదులు పెరిగింది. పాము మళ్లీ మళ్లీ కాటు వేస్తూన్నట్లు అనిపించింది. పాము కోరలు నాటుకోవడం, మంట అనుభవమయాయి. తర్వాత శరీరం మొద్దుబారుతోంది. ఆ వెంటనే మంట తీవ్రమవుతోంది.

ప్రాణం ఎప్పుడు పోయిందో తెలియలేదు. తెలివి వచ్చేసరికి జటాజూటం ధరించిన, సౌమ్యుడైన ఒక సన్యాసి నా శరీరాన్ని నదినుండి బయటకు లాగికొని వస్తూ ఉండడం కనిపించింది. చనిపోయినట్లు తెలుసుకుని కుటుంబంలోని వ్యక్తులు శరీరాన్ని నదిలో పడవేశారేమో. పాముకాటువల్ల చనిపోయిన వ్యక్తి శవాన్ని దహనం చేయరు. అందుకు భౌతిక కారణం ఏదైనా- ఆధ్యాత్మికమైన నమ్మకం ఒకటి దానివెనుక ఉంది-పాము కాలానికి ప్రతీక. కాలమే స్వయంగా ఎంపిక చేసిన వ్యక్తి శరీరంలో, అస్తిత్వంలో విసర్జించదగినదీ ఏదీ మిగలదు.

అలా ఆ సన్యాసి శ్రీరామ్ శరీరాన్ని నదినుంచి బయటికి లాగి నేలమీద పడుకోబెట్టారు. చైతన్యంలేని శరీరందగ్గర కూర్చొని ఆ సన్యాసి కొంతసేపు ధ్యానం చేశారు. సౌమ్యుడైన ఆ సన్యాసి ప్రక్కన కూర్చొని ఉండడాన్ని అనుభవం పొందడంతో చైతన్యం క్రమక్రమంగా తిరిగివస్తోంది. ఆయన స్నేహపూర్వకంగా వెన్ను తట్టి, "లేచి ఇంటికి వెళ్లు. తల్లి దండ్రులు గాబరాపడుతూ ఉంటారు''- అన్నారు.

సన్యాసి ఇచ్చిన ఈ ఆదేశం విని లేవడానికి ప్రయత్నించాను. ఆయన మరో సందేశం ఇచ్చారు- మళ్లీ ఇక్కడికి రావద్దు. ఇంటిలో కూర్చొనే ధ్యానం చెయ్యి.

స్వామీ! తమరు ఎవరు- అని అడగాలని అనుకున్నాను. కానీ భయంవల్ల అడగలేకపోయాను. సన్యాసి నా మనసులో ఉన్న ఆలోచన గ్రహించారేమో. నేను అడగకుండానే జవాబిచ్చారు-

"నాయనా! చరాచరమైన ఈ జగత్తునుండి ముక్తి పొందే మార్గాన్ని వెదుకుతూన్న సాధకులం మేము. నేను సిద్ధుడననీ, మహాత్ముడననీ భావించకు. నేనొక మామూలు సన్యాసిని మాత్రమే.''

ఇక మాట్లాడే ధైర్యం వచ్చింది నాకు. నాలో ఒక కోరిక

**అవసరాలను తగ్గించుకుని, పరిస్థితులతో సమన్వయం సాధిస్తే-ఆనందమే ఆనందం.**

జనించింది. వెంటనే ఆయనకు ఇలా నివేదించాను-

"స్వామీ! మీరు మాకు మార్గదర్శనం చేయకూడదా?"

సన్యాసి ఇలా చెప్పారు-

"చేయను. నేను స్వయంగా సాధకుణ్ణి. నీ మార్గదర్శక సత్తా నీమీద దృష్టి ఉంచారు. సమయం వచ్చినపుడు వారు నీ వద్దకు వస్తారు. ఎప్పుడు వస్తారని అడగకు. నేను ఇంతవరకే చెప్పగలను- త్వరలోనే వస్తారు. ధైర్యంగా ఉండు. ఎవరినైనా నీ గురువుగా చేసుకోవడానికి తొందరపడకు."

సన్యాసి ఇంకా ఏదో చెపుతున్నారు. ఆయన ఏమి చెప్పారో గుర్తు లేదు. చివరలో నాకీ మాటే వినిపించింది -లే. ఇక వెళ్లు.

కళ్లు తెరుచుకున్నాయి. ఎదుట తండ్రిగారు విచిత్రమైన స్థితిలో ఏడుస్తూ ఉండడం చూచాను. లేచి ఆయనకు ప్రణామం చేశాను. ఆ తర్వాత ఏం జరిగిందో మీకందరికీ తెలుసు.

తాను భాగవత కథ వినిపించినందువల్ల ఈ సంఘటన జరిగిందని తండ్రిగారు భావించారు. పుత్ర వ్యామోహం వల్ల ఆయన మనస్సులో కొద్దిసేపు సంకల్ప వికల్పాలు కదలాడాయి. ఆతర్వాత ఆయన ఇలా అనుకున్నారు- ప్రభువు దేన్ని అనుమతిస్తే అదే జరుగుతుంది. పరమేశ్వరుడు శ్రీరామ్‌కు ఒక నియతిని (భవిష్యత్తును) నిర్ణయిస్తే, మనం చేసేది ఏముంది? మనం సంతోషించాలి.

అలా అనుకుని ఆయన ధైర్యం తెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత మళ్లీ పుత్ర వ్యామోహంలో మునిగిపోతున్నారు. తన కుమారుడు తల్లి దండ్రులను వదలి ఎక్కడకీ వెళ్లడని ఆయనకు బాగా తెలుసు. అయినా వ్యామోహం ఎంతో విలక్షణమైన భావం. మనస్సును స్థిరంగా ఉండనివ్వదు. దాన్ని కట్టి వేస్తుంది. ఊగిసలాడిస్తుంది.

కుమారునికి భాగవత కథ వినిపించననీ, సాధు సంతులగురించీ బైరాగులగురించీ చెప్పననీ, వారిని అతడి దగ్గరకు అసలు రానివ్వననీ పండిట్‌జీ ఆ క్షణంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత భాగవతం పురాణం చెప్పడం మానివేయాలనికూడ ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు.

పురాణం చెప్పడం మానివేయాలని నిశ్చయించుకున్నపుడు పౌరాణికులు పూర్ణాహుతి ఏర్పాటు చేస్తారు. ఆ సంప్రదాయం ఇప్పుడు చాలావరకు లోపించిపోయింది. అయినా, గురువునుండి దీక్ష తీసుకుని పురాణం చెప్పిన వ్యక్తులకు ఈ సంప్రదాయం గురించి తెలుస్తుంది. శరీరం బలహీనం అయినపుడు, ముసలితనం పైబడినపుడు, వైరాగ్యం జనించినపుడు, పరివ్రాజకులుగా మారినపుడు, సన్యాసం పుచ్చుకున్నప్పుడు పౌరాణికులు పురాణం చెప్పడం మానుకుంటారు. శరీరం సహకరించకపోయినా, పురాణాలు ఏర్పాటు చేసేవారు. తగు సాధన సంపత్తిని సమకూర్చకపోయినా-పౌరాణికులు తమ కథా ప్రవచన వృత్తిని వదులుకుంటారు.

వంశంలో అకాల సన్యాసం అంకురించడం చూచి, పండిట్‌జీ భాగవత ప్రవచన కార్యాన్ని ముగించాలని నిశ్చయించారు. అందుకోసం 21 మంది బ్రాహ్మణులను ఆహ్వానించారు. యజ్ఞం ఏర్పాటు చేశారు. పుర్ణాహుతిగా భాగవత శాస్త్రాన్ని వాసుదేవ ఆలయంలో స్థాపన చేశారు. అలా స్థాపన చేసి, ఇక శాస్త్ర ప్రవచనానికి స్వస్తి చెపుతున్నానని భగవానునికి నివేదించిన రోజున ఆ నివేదన జరిగిన వెంటనే పండిట్‌జీ వాణి మూగబోయింది. పండిట్‌జీకి వాణి భగవంతుని గుణాలను గానం చేయడానికే ఇవ్వబడిందనీ, పురాణం చెప్పడం ఆగిపోగానే ఆయన స్వరంకూడ లోపించిపోయిందనీ జనం చెప్పుకున్నారు.

## తండ్రిగారి మహాప్రయాణం

యజ్ఞం జరిగిన రోజు రాత్రిపూటే పండిట్‌జీ పరిస్థితి క్షీణించింది. మాట్లాడడం ఆగిపోయిన తర్వాత ఆయన నడకకూడ ఆగిపోయింది. ఆయన మంచం పట్టారు. సైగలతో విషయాలు చెపుతున్నారు. పెదవులు కదులుతున్నాయి- ద్వాదశ అక్షర మంత్రం జపిస్తున్నట్లు. మరునాడు ఆయన భోజనం వద్దన్నారు. కుటుంబ సభ్యులు భోజనం చేయమని ఒత్తిడి చేశారు. అంతిమ ఘడియలు వచ్చాయనీ, భోజనం చేసి శరీరాన్ని బలవంతాన నిలుపుకోకూడదనీ ఆయన సైగలతో తెలియజేశారు.

పండిట్‌జీ జబ్బుపడ్డారనీ శరీరాన్ని వదలాలని సంకల్పం తీసుకున్నారనీ ఒకటి రెండు రోజులలో బంధువులకు తెలిసింది. వారు పరామర్శకోసం రాసాగారు. బంధు మిత్రులతో గృహం నిండిపోయింది. పండిట్‌జీ అందరినీ చూస్తున్నారు. చేతులు జోడించి వారికి అభివాదం చేస్తున్నారు. ఏమీ మాట్లాడలేక పోతున్నారు. అయితే ముఖ కవళికలో ఒక భావం ప్రతిబింబించింది - తెలిసో తెలియకో ఇంతవరకు ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే, తన ఏ చర్యవల్ల అయినా ఎవరికయినా కష్టం కలిగి ఉంటే, అందుకు నన్ను క్షమించమని కోరుతున్నాను. ఈ భావాన్ని

**రాగ ద్వేషాలనూ, క్రోధాన్నీ జయించడమే శౌర్యం.**

వ్యక్తపరచిన తర్వాత వచ్చినవారు అందుకు సమాధానం చెపితే పండిట్‌జీ ముఖం విప్పారేది. శుక్లపక్ష దశమి ప్రారంభం కాగానే, పండిట్‌జీ తన పెద్ద కొడుకు, ముద్దుల కొడుకు అయిన శ్రీరామ్‌ను పిలిపించారు. తనను లేపి కూర్చోబెట్టమని సైగతోనే ఆయనకు తెలిపారు. శ్రీరామ్ ఆయనను కూర్చోబెట్టారు. పండిట్‌జీ తనకు తానుగా పద్మాసనంలో కూర్చున్నారు. చేతులు రెండూ ఒడిలో పెట్టుకున్నారు. కళ్లు మూసుకున్నారు. కొద్ది క్షణాలు నిశ్చింతగా కూర్చుని ఉన్నారు. అయిదారు నిమిషాలపాటు ధ్యాన ముద్రలో కూర్చున్నారు. ఆ తర్వాత ఆయన నోటినుండి 'నమో భగవతే వాసుదేవాయ' మంత్రం వెలువడింది.

మూల భాగవతాన్ని పఠించమని ఆయన కుమారునితో అన్నారు. శ్రీరామ్ భాగవతం మొదటి నాలుగు శ్లోకాలనూ చదవడం ప్రారంభించారు- **'అహమేవాసుదేవాగ్రే నాన్యద్ యత్ సదసత్పరమ్। పశ్చాదహం యదేతచ్చ....॥'**

పండిట్‌జీ అక్కడ ఉన్నవారికి దాని అర్థం ఇలా వివరించారు-

సృష్టి ప్రారంభంలో కేవలం నేను మాత్రమే ఉన్నాను. సత్, అసత్, స్థూల సూక్ష్మములు, కారణ ప్రకృతి లేవు. సృష్టి తర్వాత కూడ నేను మాత్రమే ఉన్నాను. కంటికి కనబడుతూన్న ఈ విశ్వం కూడ నేనే. ప్రళయం తర్వాత మిగిలేది కూడ నేనే. ఇది బ్రహ్మయొక్క స్వరూపమని చెప్పబడింది. కనబడే అసత్, దౌర్బల్యం, దుఃఖం, సచ్చిదానందాదులు ఆత్మలో లేకపోవడం- ఇవన్నీ నా మాయ అని తెలుసుకో- అని భగవానుడు చెపుతున్నాడు.

"పంచ మహా భూతములు చిన్నా పెద్దా జీవులలో ప్రతిష్ఠం (ప్రకాశించినవి) అవుతున్నాయి. కారణం నుండి విడిగా ఉండడంవల్ల అప్రవిష్ఠం (ప్రవేశించనివి) అవుతున్నాయి. ఆ విధంగానే - మూల భౌతిక పదార్థాలలో నా ప్రవేశం ఉన్నది: లేదు కూడా. అన్వయం ద్వారా, వ్యతిరేకంద్వారా అంతటా అన్నివేళలా ఉండేదే ఆత్మ. అన్వయం అంటే అర్థం- కార్యంలో కారణం యొక్క సంబంధం. వ్యతిరేకం అంటే అర్థం- ఆ సంబంధం లేకపోవడం.''

ఇలా అర్థం, భావం పూర్తికాగానే పండిట్‌జీ శరీరంనుండి వ్యతిరేకం అయినారు. అనగా- సంబంధం త్రెంచుకున్నారు. ఆయన ఆత్మచేతన విరాట్ చేతనలో లీనమయింది.

ఆయన పద్మాసనంలో కూర్చొని ఉన్నారు. దాని విషయంలో శాస్త్రం చెపుతోంది- సాధకుడు తన ఇష్ట దైవంలో లయం అవుతాడని.

అపుడు పండిట్‌జీ వయస్సు 67 సంవత్సరాలు. ఆయన తనువు చాలింపగానే ఇంటిలో రోదనలు మిన్ను ముట్టాయి. అయితే శ్రీరామ్ గంభీరంగా ఉన్నారు. ఏదో ఆలోచిస్తున్నట్లు, ఏదో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూన్నట్లు.

శ్రీరామ్ శరీరానికీ ఆత్మకూ ఉన్న సంబంధం తెగిపోవడాన్ని చూచిన మొదటి సందర్భం అది. ఏడుపులు ప్రారంభం కాగానే శ్రీరామ్ తండ్రిదగ్గర పద్మాసనంలో కూర్చున్నారు. సరిగా పండిట్‌జీ కూర్చున్న పద్ధతిలో. తన కొడుకు ఈ విధంగా కూర్చోవడం చూచి, తాఈజీ బిగ్గరగా ఏడ్వసాగింది. కొడుకు కూడ తండ్రిని అనుసరిస్తున్నాడనీ, తనను విడిచి వెళ్లిపోతున్నాడనీ ఎందువల్లనో ఆమెకు అనిపించింది. వైధవ్యానికి చిహ్నాలుగా ఆచరించే కర్మలు చేయడానికి బదులు, ఆమె కొడుకును కసురుకోసాగింది. అయినా శ్రీరామ్ నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు. బంధువులు తాఈజీకి నచ్చజెప్పారు. మిగతా క్రియలు పూర్తి చేయమని ఆమెకు చెప్పారు. శ్రీరామ్ తన సహజ ప్రవృత్తికి అనుగుణంగా ఈ మృత్యు సంఘటనను తన పద్ధతిలో అర్థం చేసుకుంటున్నాడని వారు భావించారు. శ్రీరామ్ అలా సుమారు 20 నిమిషాలు నిశ్చల ధ్యాన ముద్రలో కూర్చొన్నారు. ఆ తర్వాత లేచి, కుటుంబ సభ్యులతోపాటు తండ్రిగారి పార్థివ శరీరానికి వీడ్కోలు చెప్పడంలో నిమగ్నం అయారు.

అంత్య క్రియలు, మరణానంతర సంస్కారం జరిగిన తర్వాత- తండ్రిగారి ఆస్థి గురించి కుటుంబ సభ్యులు చర్చించారు. తాను తండ్రిగారి భాగవత సంప్రదాయాన్ని మాత్రమే కొనసాగిస్తాననీ, పొలాలు ఆస్తుల విషయం తనకు సంబంధం లేదనీ శ్రీరామ్ వెంటనే స్పష్టం చేశారు. తనను భగవానుని కోసమే నిలుపుకుంటాననీ, ఆయననే తనవాణ్ణి చేసుకుంటాననీ ఆయన వివరించారు. కుటుంబ సభ్యులు ఈ మాట విన్నారు. తన మరణానికి ముందు పండిట్‌జీ ఏడురోజులపాటు భాగవత కథ వినిపించారనీ, ఈ మాట దాని ప్రభావమనీ, బాధ్యత నెత్తిమీద పడితే అన్నీ సర్దుకుంటాయనీ వారు అనుకున్నారు. కుటుంబంలోని ప్రస్తుత తరంలో పెద్దవాడు జ్యోతి ప్రసాద్ తలపాగా చుట్టుకున్నారు. రివాజు ప్రకారం ఇతరులకు కూడ ఆస్థిలో వారి వాటా అందింది. ఇల్లూ వాకిలీ, పొలమూ ఆస్థీ - వీటిని సమర్థించడానికి తాను లేననీ, తాను తన ధర్మ- కర్తవ్యాన్ని పాటించవలసి ఉన్నదనీ శ్రీరామ్ చివరివరకు చెపుతూ వచ్చారు.

తండ్రిగారు లేకపోవడంతో శ్రీరామ్ ఒంటరితనాన్ని

**భూత భవిష్యత్తుల చింత వదలి వర్తమానంలో శాంతంగా, స్థిరంగా ఉండడమే మానసిక ఆరోగ్యం.**

అనుభవించారు. కుటుంబంలోని ఇతర సభ్యులుకూడ ఉన్నారు. కానీ, తినే-సంపాదించే విద్యలపై వారి దృష్టి హెచ్చుగా ఉంది. పొలం పనులు, వ్యాపారం, శిస్తు వసూళ్లలోనే కాక కోర్టు వ్యవహారాలలోకూడ వారు పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. జ్యోతిషం, ఆయుర్వేదం, ఉద్యోగాలు, సమాజసేవ రంగాలలో వారు నిష్ణాతులు. యోగం, ధ్యానం, అధ్యాత్మ మున్నగువానిలో శ్రీరామ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అభిరుచి ఉంది.

## 'నేనసలు పాలు త్రాగను'

శ్రీరామ్ బాల్యంలో, కిశోర దశలో అనేక సంఘటనలు జరిగాయి. శ్రీరామ్ పరమ సహృదయుడనీ, సహజంగా నమ్మే గుణం ఆయనలో నిండుగా ఉన్నదనీ ఆ సంఘటనలు సూచిస్తాయి.

గ్రామంలో తల్లులు తమ పిల్లలకు పాలు తాగిస్తారు. పిల్లలచేత వెన్న తినిపిస్తారు. ఈ విషయంలో వారు హెచ్చు శ్రద్ధ చూపుతారు. ఒకరోజున శ్రీరామ్ ఆవుపాలు పితకడం చూచారు. మొదట దూడను ఆవు దగ్గరకు తీసుకువెళతారు. ఆవు పాలు చేపుతుంది. ఆ తర్వాత పాలు పితుకుతారు. దూడను తప్పించి దూరంగా తీసుకుపోతారు. శ్రీరామ్ ఇదంతా చూస్తున్నారు. దూడ ఆవువైపు చూస్తోంది. ఆవు దగ్గరకు తిరిగివెళ్లడానికి ప్రయత్నిస్తోంది. అంబా అని అరుస్తోంది. ఆవుకూడ తన దూడవైపు చూస్తోంది. ఎంతో ప్రేమగా, మరెంతో బాధగా. ఇలా ఆవునూ దూడనూ వేరు చేయడం చూచి శ్రీరామ్ ఎంతో బాధపడ్డారు. ఆయన ఇంటిలోకి వెళ్లారు. ఇవాళనుంచి పాలు త్రాగను- అని తాఈజీతో చెప్పారు.

తాఈజీ, ఇంటిలో ఉన్న మిగతా వ్యక్తులు శ్రీరామ్‌కు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. పాలు త్రాగితే బలం వస్తుంది. శరీరం దృఢంగా తయారవుతుంది రోగాలతో పోరాడే సామర్థ్యం కలుగుతుంది- ఇలా చెప్పసాగారు. శ్రీరామ్ అందరికీ ఒకటే జవాబు చెప్పారు- దూడ నోటి పాలు లాగికొని మనం మన ఒళ్లు పెంచుకోకూడదని. ఇలా నచ్చజెప్పే ప్రయత్నం నెలల తరబడి సాగింది. చివరికి ఒక పరిష్కారం దొరికింది. దూడ పాలు త్రాగి త్రాగి తృప్తి చెందాలి. తనంతట తాను ఆవుకు దూరంగా వెళ్లిపోవాలి. ఆ తర్వాతనే ఆవు పాలు పితకాలి. ఆ పాలే నేను త్రాగుతాను. ఈ షరతు ప్రకారం పితికే పాలు చాలా కొద్దిగా ఉంటాయి. అయితే, పశువుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకోవడం మరింత ముఖ్యం.

## నమ్మి నష్టపోయినా....

మరో సంఘటన. బజారుకు వెళ్లి తాళంకొనే సంఘటన. ఇంటి పనులు నౌకర్లు చేస్తారు. అయినా పిల్లవాడికి ఇంటి పనులు తెలియాలి. ప్రపంచ జ్ఞానం రావాలి. వ్యవహారాలు అనుభవం కావాలి- తల్లి అలా ఆలోచించింది. ఇంటిలో ఒక పెట్టె తాళం చెడిపోయింది. తల్లి డబ్బులు ఇచ్చి శ్రీరామ్‌ను బజారుకు పంపింది. తాళం కొనుక్కురమ్మని. తాళం ఖరీదు మూడు పైసలని దుకాణదారు చెప్పాడు. తల్లి చెప్పిన ధరకన్న అది బాగా హెచ్చు. మీరు ఎక్కువ ధర చెపుతున్నారు- అని శ్రీరామ్ అన్నారు. దుకాణదారు అన్నాడు- అసలు ధర ఇదే. ఎక్కడైనా అడిగి చూడు. ఎవరైనా ఇంతకన్న తక్కువ ధర చెపితే...దుకాణదారు తన మాట పూర్తిచేయకముందే శ్రీరామ్ మూడు పైసలు ఇచ్చి తాళం తీసుకుంటూ అన్నారు- సరే తెండి. అసలు ధర నాకు తెలుసు. అయినా మీరు చెప్పిన ధర ఇస్తున్నాను. మీమీద నాకు నమ్మకం ఉంది.

ఇంటికి వెళ్లిన తర్వాత తాఈజీ శ్రీరామ్‌కు చిన్న ఉపదేశం ఇచ్చింది. ఆ సంగతి మరుగున పడింది.

ఈ సంఘటన జరిగిన తర్వాత శ్రీరామ్ ఆ దుకాణం ముందునుంచి చాలాసార్లు వెళ్లారు. కాని ఎపుడూ దానివైపు దృష్టి సారించలేదు. ఆయన వెళుతూ వస్తూ ఉండడం దుకాణదారు చూచాడు. శ్రీరామ్ తన దుకాణం వద్ద ఆగుతాడని వేచిచూచాడు. ఇలా పది పన్నెండు రోజులు గడిచాయి. ఒకరోజున దుకాణదారు శ్రీరామ్‌ను కేకవేసి పిలిచి ఇలా అన్నాడు- "నేను పశ్చాత్తాపపడుతున్నాను. నీ దగ్గర హెచ్చు పైసలు తీసుకున్నాను. అప్పుడు నా మనసులో అంత అత్యాశ ఎందుకు కలిగిందో, అసలు ధరకన్న హెచ్చు ధర ఎందుకు తీసుకున్నానో నాకు అర్థంకావడం లేదు. హెచ్చుగా తీసుకున్న పైసలు వాపసు తీసుకో. నన్ను క్షమించు."

శ్రీరామ్ ఈ మాటలన్నీ మౌనంగా వింటున్నారు. దుకాణదారు పైసలు తిరిగి ఇచ్చాడు. అయినా నొచ్చుకుంటున్నాడు. అపుడు శ్రీరామ్ అన్నారు- "బాబాయ్! ఇందులో పశ్చాత్తాప పడవలసింది ఏముంది? నేను నీ మాట అపుడూ నమ్మాను, ఇపుడూ నేను ఫిర్యాదు చేయడం లేదు".

కిశోర దశలో జరిగిన ఈ సంఘటన ఎవ్వరిపట్లా అపనమ్మకంతో ఉండని శ్రీరామ్ ప్రవృత్తిని పట్టి చూపుతోంది. ఈ అలవాటువల్ల ఆయన ఆ తర్వాత అనేక సందర్భాలలో నష్టపోయారు కూడా. అయినా ఆయన ఇలా చెప్పేవారు-

విశ్వాసమే మార్పు తెస్తుంది. అవిశ్వాసంవల్ల, సందేహంవల్ల చెడు పెరుగుతుంది. దూరమూ పెరుగుతుంది.H

**ద్వేషించని, కోరని వ్యక్తి నిత్య సన్యాసి.**

# యుగ గీత

## ఇంద్రునిది దేవగుణం, విరోచనునిది అసురగుణం

[illegible]

భగవద్గీత నాల్గవ అధ్యాయానికి లక్ష్యం 'జ్ఞానంలో కర్మల సన్యాసం'. మనం ఈ అధ్యాయం శిఖరాగ్రానికి చేరుతున్నాం. ఈ ప్రపంచంలో జ్ఞానం కన్న పవిత్రమైనది లేదని కృష్ణ పరమాత్మ చెప్పడమే ఈ శిఖరాగ్రం. సాధకుని జీవన యాత్రకు రాజమార్గాన్ని చూపుతున్నాయి ఈ అధ్యాయంలోని చివరి అయిదు శ్లోకాలూ. జ్ఞానం పరిపూర్ణం అయినప్పుడు సాధకుడు దేన్ని పొందుతాడో, దాని పరిపక్వ స్థితి ఏమిటో ఈ మూడు శ్లోకాలలో మనకు తెలుస్తుంది-



**నహి జ్ఞానేన సదృశం**
**పవిత్ర మిహ విద్యతే ।**
**తత్ స్వయం యోగసంసిద్ధః**
**కాలే నాత్మని విందతి॥**
**-4/38**

అనగా-

ఈ ప్రపంచంలో జ్ఞానమంత పవిత్రమైనది మరేదీ లేదు. ఇది నిస్సంశయం. యోగంద్వారా సంసిద్దిని పొందిన (పరిశుద్ధమైన అంతఃకరణం కలిగిన) మనిషి ఆ జ్ఞానాన్ని తనకు తానుగా తగు సమయంలో తన ఆత్మలో పొందుతాడు.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః।**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధిగచ్ఛతి ॥**
**-4/39**

అనగా-

శ్రద్ధ కలిగినవాడు, సాధన పరాయణుడు, ఇంద్రియములను జయించినవాడు (పూర్తి సంయమనం కలిగినవాడు) అయిన మనిషియే జ్ఞానమును పొందుతాడు. జ్ఞానం పొందిన తర్వాత అతడు అచిరకాలంలోనే భగవత్ ప్రాప్తి అనే పరమశాంతిని పొందుతాడు.

**అజ్ఞ శ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి।**
**నాయంలోకో౽స్తి న పరో న**
**సుఖం సంశయాత్మనః ॥**
**-4/40**

అనగా- శ్రద్ధలేని అజ్ఞాని (వివేకరహితుడు) సంశయం కలిగినవాడు అయిన మనిషి పరమార్థ పథంనుండి భ్రష్టుడు అవుతాడు. నాశనం అవుతాడు. సంశయించే అలాంటి వ్యక్తికి ఇహ పరాలు ఉండవు. అతడికి ఎక్కడా ఎపుడూ సుఖం లభించదు.

### జ్ఞానానికి పరిపక్వత అంతఃశుద్ధి

ప్రపంచంలో అన్నిటికన్నా పవిత్రమైనది జ్ఞానం. ఈ జ్ఞానం అంతఃకరణను నిర్మలం చేస్తుంది. గురువు ఉపదేశంవల్ల పొందిన జ్ఞానంతో మనిషి స్వయంగా పరిశుద్ధుడు అవుతూ ఉంటాడు. 'కాలేనాత్మని' అనగా- తనకు తానుగా సమయం వచ్చినపుడు. మనం నిరంతరం గురు చేతనతో పడుగుపేకలవలె కలసిపోవాలి. ఎందుకంటే- ఈ జ్ఞానమే అత్యంత పవిత్రమైనది. ఇది సర్వశ్రేష్ఠమైన నిధి. ఇది పాపాలను నశింపజేసేది. ఇది మన అదృష్టంవల్ల లభించినట్టిది. గురువుమీద పూర్తి శ్రద్ధ ఉంచి, అతడు నిర్దేశించిన జ్ఞాన మార్గంలో నడుస్తూ ఉండే వ్యక్తికి ఆత్మతత్వం లభిస్తుంది. అతడు ఎన్నడూ వినాశకర మార్గంలో పయనించడు.

గురుశిష్య పరంపరలో మనకు ఇదే కానవస్తుంది-

**శాంతికి తొలిమెట్టు సరళత; చివరిమెట్టు ఉదారత.**

గురువులు నిరంతరం తమ శిష్యుల ఆత్మకళ్యాణం కోసం వారికి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తూ వచ్చారు. తమ ఆచరణ ద్వారా వారికి అతిపవిత్రమైన జ్ఞాన సందేశాన్ని అందిస్తూ వచ్చారు.

కర్మయోగంలో సిద్ధ పురుషుని లోపల జ్ఞానం ప్రవేశిస్తూన్న కొలదీ, అతడికి స్వయంగా ఈ అనుభూతి కలుగుతూ ఉంటుంది. (ఆత్మని విందతి).

బ్రహ్మజ్ఞానం అత్యంత దుర్లభమైన వస్తువు. శ్రీరామకృష్ణ పరమహంస ఇలా చెప్పారు-

“నిత్య వస్తువులో చేరుకోవడం పేరు బ్రహ్మజ్ఞానం. ఇది చాలా కఠినమైనది. అందుకు తపస్సు కావాలి. శాస్త్రాలలో శ్లోకాలను కంఠస్థం చేయడంవల్ల ఏమీ జరగదు. సిద్ధి-సిద్ధి అన్నంతమాత్రాన సిద్ధి లభించదు. **సిద్ధిని తినాలి.** దాని అనుభూతి కణ కణంలో కలగాలి.’’

పరమపూజ్య గురుదేవులు ఇలా చెపుతారు-

“జ్ఞానాన్ని సత్‌శక్తి అని పిలుస్తారు. మనిషికి ఉన్న నిజమైన సంపద అని పిలుస్తారు. ప్రపంచంలోని ప్రతి వస్తువూ కాలగతిలో నశిస్తుంది. ధనం నశిస్తుంది. శరీరం కృశించిపోతుంది. మిత్రులూ, సహచరులూ విడిపోతారు. ఎక్కడా, ఎన్నడూ, ఏ స్థితిలోనూ మనిషిని విడిచిపెట్టని అక్షయ తత్వం జ్ఞానం ఒక్కటే. (ఆత్మోత్కర్షకా ఆధార్-జ్ఞాన్, వాఙ్మయ్, ఖండం 48, పుటలు 10, 12)

వాస్తవానికి-ముక్తికి సాధనం జ్ఞానం. దాన్ని పొందితే, ఈ జీవితంలో ముక్తి లభించిందని భావించాలి. జ్ఞాన రసాన్ని ఆస్వాదించిన తర్వాత మనిషి తృప్తి పొందుతాడు. దాహంతో ఉన్న వ్యక్తి సుందరమూ, స్వచ్ఛమూ అయిన జలాశయాన్ని చూచినప్పుడు ప్రసన్నుడు అయిన విధంగా.

## ‘నేను దేహాన్ని’-అనుకోకు

జ్ఞానం అతి పవిత్రమైనది. ఆనందానికి మూలం. ముక్తికి ఆధారం. అజ్ఞానం, అవిద్య, తీవ్రమైన అశాంతికి కారణాలు అవుతాయి. ప్రపంచంలోని మామూలు విషయాల అజ్ఞానం మనకు తీవ్రమైన దుఃఖాన్ని కలిగిస్తుంది. అటువంటపుడు- జీవితం, ఆత్మ, పరమాత్మల విషయంలో వ్యాపించిన అజ్ఞానం ఎంత భయంకర పరిణామాలకు దారితీస్తుందో ఊహించవచ్చు. ‘నేను శరీరాన్ని మాత్రమే’ అని భావించడం అన్నిటినీ మించిన అజ్ఞానమని పరమపూజ్య గురుదేవులు చెప్పారు. అలాంటి వ్యక్తి తన ఇంద్రియ విషయాలను తృప్తిపరచడంలో నిమగ్నం అవుతాడు. తన ఆత్మను నాశనం చేసుకుంటూ ఉంటాడు.

ఆత్మజ్ఞానం మనిషిలోపల జనించినపుడు మొట్టమొదట లభించేది అంతఃకరణ శుద్ధి. ఈ పని దానికదిగా జరుగుతూ ఉంటుంది. పవిత్రత వ్యక్తి అంతఃకరణను నిర్మలం చేస్తుంది. ఆ తర్వాత వ్యక్తి ఆ ఆత్మజ్ఞానపు అనుభూతిని తనలోపల పొందుతాడు. యోగంద్వారా ఈ సిద్ధి తనకు తానుగా లభిస్తుంది. సకామ కర్మల (కోరికతో చేసిన కర్మల) వాసనలు భస్మం అవుతూ ఉంటాయి. విశుద్ధమైన ఆత్మజ్ఞానపు వెలుగులో అంతా స్పష్టంగా కనపడుతూ ఉంటుంది.

నిజమైన జ్ఞానం మనకు మనలోపల నుండి లభిస్తుంది. అనగా- ఈ జ్ఞానం ఆ సాధకునిలో, దివ్యకర్మలు చేసే వ్యక్తిలో, పెరుగుతూ ఉంటుంది. నిష్కామ భావంలో, సమత్వంలో, భగవద్ భక్తిలో ముందుకుపోతూ ఉన్నకొలదీ సాధకుడు జ్ఞానపు లోతులలోనికి ప్రవేశిస్తూ ఉంటాడు. మరి ఈ జ్ఞానం ఎలా లభిస్తుంది? దాని అనుభూతి హృదయపు లోతులలో ఎలా కలుగుతుంది? ఇందుకు శ్రీకృష్ణుడు తర్వాతి సూత్రం ఇస్తున్నారు.

జ్ఞానం బుద్ధివల్లకాక శ్రద్ధవల్ల లభిస్తుందని ఆయన చెపుతున్నారు. బుద్ధిద్వారా పొందే జ్ఞానం ఇంద్రియాలద్వారా, తర్కంద్వారా శ్రమించి బయటనుంచి సేకరించబడేది. ఇది శిక్షణ, సమాచారం. ఆత్మలో పొందే జ్ఞానం విద్య. ఈ విద్యను, అమరత్వ జ్ఞానాన్ని శ్రద్ధద్వారానే పొందగలం. ఈ జ్ఞానం పొందగానే వ్యక్తి తుచ్ఛమైన అహంకారాన్ని బయటికి నెట్టివేస్తాడు. వ్యక్తి శ్రద్ధతో నిండిపోతాడు. జ్ఞానంలో కర్మల సన్యాసం-అర్పణ అనే యోగంలోని చివరి భాగంలో శ్రీకృష్ణుడు ఈ మాట చెప్పడం అకారణం కాదు. ఈ జ్ఞానం లేకపోతే మనం మనలోపల ఆత్మయొక్క అపరోక్ష అనుభూతిని పొందులేము.

Ð(Ç¬ºÕ-Kö<-OH.Õ)

**దేహాన్ని లాలించకు, పాలించు.**

## మాతాజీ దివ్య జీవనం - 12

# ప్రేమనూ, మమతనూ పొందిన ప్రవాసీ పరిజనులు

విశ్వమాత విశ్వమంతా విస్తరించి ఉన్న తన పిల్లలకు ప్రేమ పంచడానికి కావలసిన ఏర్పాట్లు చేయటంలో మునిగి ఉన్నారు. ఆమెకు ఈ పృథ్వి మాత్రమే కాక అనంతానంత కోటి బ్రహ్మాండములు తెలుసు. సూక్ష్మ శరీరంతో అనేక రహస్యమయ యాత్రలు చేసింది. ప్రేమతో కూడిన పిల్లల పిలుపు అందుకుని ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్ళటం ఆమె స్వభావం. ఒకోసారి స్వప్నముల ద్వారా, ఒకోసారి ధ్యానస్థితిలో తన సంతానముల హృదయాలకు అద్భుతమైన తృప్తి నిచ్చేది. కానీ ఈ పనులు ఆమె సూక్ష్మ శరీరంతో చేసేవారు. స్థూల శరీరంతో ఆమె ఎప్పుడూ ఏ విదేశీ యాత్రలూ చేయలేదు. చేయాలనే కోరిక కూడా ఆమెకి లేదు. ప్రవాసీ పరిజనులు చాలా బలవంతం పెట్టాక ఆమె ఈ విశ్వయాత్ర చేయటానికి ఒప్పుకున్నారు. ఈ యాత్రకి అంగీకారం తెలుపుతూ ఆమె ఇలా అన్నారు-"నాకు ఇష్టం లేదు. కానీ పిల్లలు బాధపడుతున్నారు. అందువలన ఒకసారి వారిని వెళ్ళి కలుసుకోవటం మంచిదని అనిపిస్తోంది. వారి మనసులు ఊరట చెందుతాయి."

ఆమె ఆవిధంగా ఒప్పుకున్న తరువాత పాస్‌పోర్టు, వీసా మొదలైన వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విదేశాలలోని కార్యక్రమాల తారీకులు నిర్ణయించబడ్డాయి. ఈ క్రమంలో మొదటి అశ్వమేధ మహా యజ్ఞం ఇంగ్లాండులో- లెస్టర్ అనే ప్రదేశంలో 1993 జులైలో ఏర్పాటు చేయబడింది. 1993 మే3-6లలో భువనేశ్వర్‌లో అశ్వమేధ కార్యక్రమం ఉంది. ఆ తరువాత సుమారు ఒకటిన్నర నెల మాతాజీ శాంతికుంజ్‌లోనే ఉన్నారు. తరువాత నిర్ధారించబడిన తేదీలలో ఆమె ఇంగ్లాండుకి బయలుదేరారు. ఇంగ్లాండు పరిజనులకు ఆమె రాక వారి కలలు నిజమగుట లాంటిది. వారి ఉపాసన అనుభూతి ప్రత్యక్షంగా సాక్షాత్కరించింది. మాతాజీని తీసుకురావటానికి విమానాశ్రయానికి ప్రజలు చాలా పెద్ద సంఖ్యలో వచ్చారు. మాతాజీకి జయఘోషలు, శ్రద్ధతో కూడిన పరిజనుల కన్నీళ్ళు విమానాశ్రయంలో పనిచేసేవారిని కూడా శ్రద్ధావంతులను చేశాయి.

ఇప్పటివరకు ఎంతోమంది సాధు సంతులు భారతదేశం నుండి ఇంగ్లాండు వచ్చారు. వారు సన్మానింపబడ్డారు. వారి మీద పుష్పాలు, పూల మాలల వర్షం కురిసింది. జయజయ ధ్వానాలు వినిపించాయి. కాని వారెవ్వరిమీదా ప్రేమ పూరితమైన ఆర్తి ఇంత తీవ్రంగా కనిపించలేదు. విమానాశ్రయంలో పనిచేసే వారు ఈ తేడాను చాలా స్పష్టంగా అనుభూతి చెందారు. వారు ఈ పరిజనులను అడిగారు 'ఈమె ఎవరు?' అని. 'ఈమె మా తల్లి-ఇక్కడికి వచ్చింది'- అని జవాబు వచ్చింది. ఈ జవాబులో వారికేమి అర్థమైందో తెలీదు కానీ వారిలో అనేకులు షి ఇజ్ ద డివైన్ మదర్ అంటూ మాతాజీకి పాదాభివందనం చేశారు. మాతాజీ కూడా వారిని మనసారా ఆశీర్వదించారు. ఆమెకి అందరూ పిల్లలే కదా! ఎవరైనా 'అమ్మా, అమ్మా' అంటూ పరిగెత్తుకుంటూ ఆమె వద్దకు వస్తే, వారు ఆమెకు ఎంతో ప్రీతి పాత్రులు.

లెస్టర్ కార్యక్రమాలు నిర్ధారిత కాలంలో విశిష్ట విధానాలతో మొదలు పెట్టబడ్డాయి. శ్రీకిత్‌వాజ్, లార్డ్‌మేయర్, జాన్ మూడి మొదలగు వారు ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధులు. ఇక్కడి ప్రభుత్వంలో సమాజంలో ఉన్నత ప్రతిష్ట ఉన్న ఈ విశిష్ట వ్యక్తులు మాతాజీ మమత స్పర్శ పొంది అనుగ్రహీతులయ్యారు. అప్పటి ఇంగ్లాండు హైకమీషనర్ శ్రీలక్ష్మీ మల్ సింఘవి భార్యా సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అశ్వమేధ మహా యజ్ఞం కొరకు నిశ్చయించబడిన విధివిధానాలతోపాటు మాతాజీ వారికి అక్కడ దీక్షకూడా ఇచ్చారు. ఈ దీక్షా కార్యక్రమం అనేక రకాలుగా అద్భుతమైనది, విలక్షణమైనది. ఇందులో పాలుపంచుకున్న వారి మనఃప్రాణాలు అనేక విలక్షణ అనుభూతులతో నిండి ఉన్నవి. అనేకులు మంత్రాక్షరములు బంగారు అక్షరములుగా తమలో అవతరించుట చూశారు. కొందరు గాయత్రీ మాతను దర్శించారు. అనేకుల పురాతన అసాధ్య రోగాలు దీక్ష తీసుకోగానే

**కోట్లు లేవని చింతించకు. కూటికి ఉందని సంతోషించు.**

పోయాయి. విశ్వమాత తమ సమస్త పాప తాపాలను నశింప చేసిందనే సత్యాన్ని వీరు అనుభూతి చెందారు.

శైల దీదీ, డా॥ప్రణవ పండ్యా ఈ కార్యక్రమంలో మాతాజీతో పాటు ఉన్నారు. దీక్ష తీసుకున్న పరిజనుల విలక్షణ అనుభూతులను వీరు మాతాజీతో చర్చించినప్పుడు ఆమె ముందు కాసేపు మౌనంగా ఉండి తరువాత ఇలా చెప్పారు-"ఈ పిల్లలు నాకు చాలా దూరంగా నివసిస్తున్నారు. మాటిమాటికి శాంతికుంజ్ వరకు పరిగెట్టుకుంటూ రాలేరు. అందుచేత వారిని విశేషంగా చూడవలసిందేకదా! నేనే స్వయంగా వీరి వద్దకు వచ్చినప్పుడు వీరిని ఉత్తి చేతులతో నేను వెళ్లనివ్వను కదా! వీరందరూ కష్టాలనుంచి ముక్తి చెంది నవ్వుతూ ఆనందంతో ఉండటం చూస్తే నా యాత్ర సఫలమైందని అనిపిస్తోంది.''

ఇంగ్లాండులో జరిగిన ఈ అద్భుత అనుభూతులను విని టోరంటో (కెనడా) పరిజనులు ఉత్సాహంతో నిండిపోయారు. వారు ముందుగానే 23 నుంచి 25 జులై 1993 తారీకులలో తమ కార్యక్రమములు నిశ్చయించుకున్నారు. వందనీయ మాతాజీ, శైల దీదీ, డా॥ ప్రణవ పండ్యాతోపాటు, సమయానికి చేరుకున్నారు. వీరు అక్కడికి రావటానికి కొద్ది రోజుల ముందునుంచీ విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. కార్యకర్తలు, ఏర్పాట్లు చేసేవారందరూ చాలా గాబరా పడుతున్నారు పనులంతా ఎలా అవుతాయని. వారు అనేక మార్లు శాంతికుంజ్‌కి ఫోన్‌లు చేశారు. ఫోనులో మాట్లాడుతూ మాతాజీ వారికి ధైర్యం చెప్పి - మీరు భయపడకండి, ధైర్యంగా ఉండండి, నేను వస్తున్నాను. నేను అక్కడికి రాగానే అంతా సవ్యంగానే జరుగుతుంది, అన్నారు. నిజంగా అలానే జరిగింది. తెంపులేకుండా ఎన్నోరోజుల నుండో కురుస్తున్న విపరీత వర్షం ఆగిపోయింది. ఈ కార్యక్రమాలలో కెనడా యొక్క అప్పటి ప్రధానమంత్రి కేంప్‌బెల్, ఆయన మంత్రిమండలి సహచరులు చాలా సహకారాన్ని అందించారు. ఏర్పాట్లలో సక్రియ గాయత్రీ పరిజనులతోపాటు ఇతర సంఘాల కార్యకర్తలు కూడా ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈవిధంగా పాలుపంచుకున్న వారందరూ మాతాజీ తపశ్శక్తి చమత్కారాలను వారి జీవితాలలో ప్రత్యక్షంగా చవిచూశారు.

కెనడా నుంచి తిరిగి వచ్చిన మాతాజీ 19 నుండి 22 ఆగష్ట్ 1993వ సంవత్సరంలో అమెరికాలో లాస్ ఏంజిల్స్‌లో జరగబోయే అశ్వమేధ మహా యజ్ఞానికి బయలుదేరారు. డాక్టర్ ప్రణవ పండ్యా, శైల దీదీ తోపాటు జరిగిన ఈ యాత్ర ఇదివరకటి విదేశీ యాత్రలతో పోలిస్తే చాలా ఉత్సాహవంతంగా జరిగింది. పశ్చిమ తీరాలతో ఉన్న అమెరికా పరిజనులు మాతాజీని తమ మధ్య చూడటానికి చాలా ఉత్సాహంగా ఉన్నారు. వారు ప్రాణప్రదంగా 108 కుండాల మహా యజ్ఞానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. అమెరికాలోని ఏ నగరంలో అయినా ఆ రోజులలో ఇంత బృహత్ యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించటం అంత సులభం కాదు. శ్రీకాళీ చరణ్ శర్మ నేతృత్వంలో వెళ్ళిన కార్యకర్తలు చాలా శ్రమించారు. వారి హృదయంలో మాతృమూర్తిపై ఎంత శ్రద్ధ ఉన్నదంటే, కష్టసాధ్యమైన పనులు సులభంగా జరిగిపోతూ ఉండేవి. మాతాజీ అక్కడికి చేరుకుంటూనే వాతావరణంలో దివ్యత్వం నిండిపోయింది. అన్ని కార్యక్రమాలు మాతాజీ దైవీ సంరక్షణలో చాలా బాగా జరిగాయి.

యజ్ఞస్థలిలో దీక్ష తీసుకొనటానికి సుమారు 30,000 మంది వచ్చారు. అక్కడ అందరూ మాతాజీ దీక్ష ఇచ్చేటప్పుడు తమ సంతానం కష్టాలన్నీ తీసేస్తుందని, అంతేకాక వారికి అనేక రకాలైన ఆధ్యాత్మిక అనుభూతులను అందచేస్తారని విన్నారు. ఆ రోజున వారు విన్నవన్నీ యథార్థంగా, ప్రత్యక్షంగా అనుభవించారు. అనేకమంది అనేక రకాలుగా వరదానాలు, అనుదానాలు పొందారు. మాతాజీ నోటినుంచి ఉచ్చరించబడిన గాయత్రీ మహా మంత్రం నిజంగా వారి ప్రాణాలకు ప్రశాంతత చేకూర్చింది. అమెరికాలోని మారుమూల ప్రాంతాలవారు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. హిందీ భాష తెలియని వారు కూడా వారి హృదయాలలో మాతాజీ భావపూరిత ఉద్బోధనను హృదయంగమం చేసుకున్నారు. ఈ కార్యక్రమాలలో అనేకమందికి వరదానాలు కురిపించే తల్లి నిరంతరం తన సంతానాల బాధ అనే విషమును తాను స్వీకరిస్తూ ఉన్నది.

**తపస్సు అంటే తీవ్రమైన నిష్ఠ.**

# మహా ప్రయాణానికి సన్నాహాలు

సంతానాల బాధలను, దుఃఖములను నిరంతర విషపానం చేయటం వలన వందనీయ మాతాజీ ఆరోగ్యం క్షీణించింది. వారి దేహం నిరంతతరం వ్యాధిగ్రస్తమైంది. చివరికి 16 నుంచి 20 ఏప్రియల్ 1994 చిత్రకూటంలో జరగబోయే అశ్వమేధ మహా యజ్ఞానికి ఆమె వెళ్ళే స్థితిలో లేరు. అప్పటికే ఆమె ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. వెళ్ళాలా? వద్దా? అనే మీమాంసలో పడ్డారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని చూస్తూ దగ్గరగా ఉన్నవారు - మాతాజీ మీరు ఇలాంటి పరిస్థితులలో పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. చాలాసేపు వారందరి మాటలూ ఆమె విన్నారు. తరువాత ఆమె ఇలా అన్నారు- 'ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అలాగే ఉండనియ్యండి. కాని నేనీసారి అక్కడికి వెళతాను. ఈ వంకతో నేను మళ్ళీ చిత్రకూటాన్ని చూడగలుగుతాను. దీని తరువాత ఎవరికి తెలుసు నేను ఎక్కడికైనా వెళ్ళగలుగుతానో? వెళ్ళలేనో? ఈ మాటలు విన్న తరువాత ఇంక ఎవ్వరికీ ఏమీ చెప్పే సాహసం లేదు. యాత్రకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనుకున్న సమయానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం ద్వారా పంపించబడిన విమానంలో జాలీగ్రాంట్ విమానాశ్రయం నుంచి బయలుదేరారు.

చిత్రకూటం చేరిన తరువాత ఆమె శరీరం అన్ని కష్టాలను మరచి పోయినట్లైంది. ఆమె శరీరం ఆమెది కాదన్నట్లు ప్రవర్తించారు. ఈ యాత్రలో ఆమెతోపాటు శైల దీదీ, డా॥ప్రణవ పండ్యా, వీరి సుపుత్రుడు చిన్మయ, మాతాజీ మానస పుత్రిక దుర్గా దీదీ ఉన్నారు. వారందరికీ మాతాజీ శారీరక బాధలు పూర్తిగా తెలుసు. తన శారీరక బాధలనుంచి ఈ విధంగా మనస్సును పూర్తిగా మార్చుకోవటం ఎవరైనా ఎలా చేయగలరు? నమ్మశక్యం కాదు. గీతలో చెప్పబడిన స్థిత ప్రజ్ఞ స్థితి గురించి చాలామంది చదివి ఉంటారు. ఇప్పుడు మాతాజీ స్థితిని చూసి ఆ సత్యమును దర్శించారు. ఈ దేహాతీత స్థితిలోనే ఆమె చిత్రకూట అశ్వమేధం కార్యక్రమములన్నీ పూర్తిచేశారు. అనేక మంది శ్రద్ధాళువులకు దీక్ష నిచ్చి వారికి ముక్తి మార్గం తెరిచారు. అనేకమంది మీద తమ ఆశీస్సుల వర్షం కురిపించారు.

ఈవిధంగా మాతాజీ తమ అనుగ్రహ వర్షం కురిపించటం చూసి సమస్త ప్రాణుల భవరోగం హరించగలిగే దయామయి, జనని తన దేహాన్ని కూడా స్వయంగా రోగముక్తం చేసుకున్నారని అనుకున్నారు. అందరి బలవంతం మీదా ఆమె ఉత్సాహపూర్వకంగా తీర్థభూమి చిత్రకూటంలో ఉన్న విభిన్న స్థలాలను దర్శించే కార్యక్రమాన్ని రూపొందించారు. కామదగిరి, స్ఫటికశిల మొదలగు స్థలాలలో ఆమె కొద్దిసేపు భావసమాధిలో నిమగ్నురాలయ్యారు. గుప్త గోదావరి బయట మాతాజీ కారు ఆగినప్పుడు ఆ చుట్టుప్రక్కలనుంచి 10,12 సంవత్సరముల వయస్సు గల బాలిక పరిగెట్టుకుంటూ వచ్చింది. ఆమె చేతిలో కొన్ని అడవి పండ్లు, చిల్లర డబ్బులూ ఉన్నాయి. మాతాజీ కారు దిగగానే ఆమె ముందుకువచ్చి నిలబడింది. మాతాజీ దగ్గర ఉన్న వాళ్ళు ఏమైనా అనేముందే ఆ బాలిక ఇలా అంది-'మీరు శాంతికుంజ్ మాతాజీయే కదా! నేను చాలా రోజులనుంచి శాంతికుంజ్ హరిద్వార్ మాతాజీ వస్తున్నారని వింటున్నాను.' ఈ అమాయకపు మాటలు విని మాతాజీ 'అవునమ్మా నేను ఆమెనే' అని అన్నారు.

మాతాజీ మాటలు విని ఆ బాలిక పులకించి పోయింది. 'మీకు తెలుసా, నేను రెండు రోజుల క్రిందట ఒక కల చూశాను. సీతామాత మళ్ళీ చిత్రకూటం వచ్చిందని. మెలకువ వచ్చాక శాంతికుంజ్ మాతాజీయే మా సీతా మాత అయితే ఆమె తప్పనిసరిగా ఇక్కడికి గుప్త గోదావరికి వస్తుందనుకున్నాను. చూశారా మరి? మీరు వచ్చేశారు.' ఈ బాలిక శ్రద్ధకు మాతాజీ భావవిహ్వల అయి బాలిక అత్యంత ప్రేమతో ఇచ్చిన ఆ వస్తువులను స్వీకరించి ఆమె శిరస్సు మీద ప్రేమతో నిమిరారు. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. మాతాజీ తన పరివారంతో పాటు గుప్తగోదావరి గుహలోకి వెళ్లారు. దీంతో ఆమె ఈ తీర్థ యాత్ర పూర్తైంది. భవ్య దీప యజ్ఞం తరువాత యజ్ఞస్థలం నుంచి వీడ్కోలు తీసుకుని మాతాజీ శాంతికుంజ్‌కి తిరిగి వచ్చారు.

శాంతికుంజ్‌కు రాగానే రోగం తిరగబెట్టింది. పరిజనులు డాక్టర్ ప్రణవ పండ్యా నిర్దేశనంలో మాతాజీ సేవలో నిమగ్నులై

**శ్రద్ధ అంటే ఆచరించడంలోని నిత్యనూతన శక్తి.**

ఉన్నారు. విశేషజ్ఞులైన వైద్యులనికూడా పిలిపించి చూపించారు. అందరి కోరిక మీదా మాతాజీ ఆసుపత్రిలో చేరటానికి ఒప్పుకున్నారు. ఆ మేరకు మాతాజీ కొన్ని రోజులు ఆగ్రాలో ఉన్నారు. తరువాత కొన్ని రోజులు ఢిల్లీలో ఉన్నారు. వైద్యులు చేయగలిగిందంతా చేస్తున్నారు. వైద్య రంగంలోని క్రొత్తక్రొత్త విధానాలని కూడా ఉపయోగిస్తున్నారు. కానీ మాతాజీకి వచ్చిన జబ్బు విలక్షణమైనది. క్రొత్తక్రొత్త రోగాల పొరలు ఒకదాని తరువాత ఒకటి బయటపడ్డాయి. మాతాజీ వారందరూ ప్రయత్నించటం, బాధపడటం చూస్తూనే ఉన్నారు. శైల దీదీతోపాటు మాతాజీ సుపుత్రులు మృత్యుంజయ శర్మకూడా ప్రాణప్రదంగా తన జన్మదాత్రి సేవలో నిమగ్నులై ఉన్నారు. అందరి అన్ని ప్రయత్నాలు నిష్ఫలమైపోతున్నాయి. చాలా రోజులు గడిచిన తరువాత ఆమె ఇలా అన్నారు-"చూడండి. మీరు చాలా విసిగిపోయారు. కానీ నన్ను శాంతికుంజ్ తీసుకు వెళ్ళండి. మీరు చేయదలుచుకున్న సేవలు అక్కడికే తీసుకు వెళ్ళి చేయండి'.

ఆమెను చూసి అందరికీ మహా మాయ తన యోగమాయను సమీకరించు కుంటున్నారని అర్థమైంది. ఆమె ఆదేశాన్ని అనుసరించి ఆమెను శాంతికుంజ్‌కి తీసుకువచ్చారు. ప్రసన్నంగా ఆమె భరించరాని వేదనను అనుభవించారు. **యస్మిన్ స్థితేన దుఃఖేన గురుణాపి విచాల్యతే**-అను గీతా వాక్యం ఆరోజులలో ఆమె జీవితంలో పూర్తిగా చరితార్థ మగుచున్నది. ఆత్మ చేతనలో స్థిరమైపోయినప్పుడు దేహం ఒక పొరలాగ ఉంటుంది. అంతకంటే ఎక్కువ కాదు. ఆ మధ్యలో ఆమెకి రెండు శస్త్రచికిత్సలుకూడా జరిగాయి. ఆ పుండ్లుకూడా ఇంకా పూర్తిగా మానలేదు. కానీ ఆ బాధలన్నింటికీ అతీతంగానే ఆమె ఉన్నది. ఇచ్ఛామయి తన ఇచ్ఛతోనే తన అసంఖ్యాక సంతానం కష్టాలను తనమీద వేసుకున్నారు. తన పిల్లల కష్టాలను తన మీదకు తీసుకుని కూడా ఆమె అలా ప్రసన్నంగా ఉన్నారు. దేహం యొక్క భరించరాని ఈ వ్యథ ఆమె అంతఃకరణమును ఏవిధంగానూ స్పృశించలేదు.

జబ్బుచేసిన ఆ రోజులలో అందరూ ఎవరికి వారు వారికి చేతనైన రీతిలో పరిచర్యలు చేస్తున్నారు. బంధుమిత్రుల రాకపోకలు జరుగుతున్నాయి. శాంతికుంజ్, గాయత్రీ తపోభూమి కార్యకర్తలు, ఆదరణీయ పండిత లీలాపత్ శర్మగారు మొదలగు గాయత్రీ పరివార్ పరిజనులు ఆదిమాతను తమ మాతాజీ ఆరోగ్యం కొరకు ప్రార్థన చేశారు. ఇవి చాలా విశిష్టమైన క్షణాలు. ఈ క్షణాలలో తమ మాతాజీ మనవడు చిన్మైకి, వారి మనుమరాలు మృణాళినికి మాతాజీ విశేష సాన్నిధ్యం లభించింది. చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేస్తూ ఆ పిల్లలు చాలా పొద్దుపోయే దాకా వారి దగ్గరే కూర్చుని ఉండేవారు. అప్పుడప్పుడు 'అమ్మాజీ! మీరు ఎప్పటికి కోలుకుంటా'రని అడిగేవారు. జవాబుగా ఆమె నవ్వి- 'ఇంకేం కోలుకుంటాను? ఇక వెళ్ళిపోయే సమయం దగ్గరికి వచ్చిం'దనే వారు. ఈ మాటలు విన్న పిల్లలు ఉదాసీనులయ్యేవారు. వారికి ఏమి చెయ్యాలో, ఏమి అనాలో తెలిసేది కాదు. ఎవరైతే అనేకుల అసాధ్య జటిల రోగాలను తన యోగశక్తితో నివారించారో ఆమె ఈ రోజు రోగ శయ్యమీద పడుకుని ఉన్నారు.

మాటలలో ఒకరోజు రాత్రి చిన్మై మాతాజీని అడిగాడు- 'అమ్మాజీ మీరు చాలామంది కష్టాలను మీమీద తీసుకున్నారు. మీ కష్టాలను ఎవరైనా తన మీదకి తీసుకోవచ్చుకదా?' జవాబుగా మాతాజీ చిరునవ్వు నవ్వారు. కొంతసేపు ఆగి ఇలా అన్నారు-'తల్లి తన సంతానం కష్టాలను తన మీదకు తీసుకుంటుంది. కాని తల్లి కష్టాలు పిల్లలు తమ మీదకు ఎందుకు తీసుకుంటారు? ఒకవేళ వాళ్ళలా చేయదలుచుకున్నా నేనెందుకు వారినలా చేయనిస్తాను? నేను బ్రతికి ఉండగా నా పిల్లలు కష్టపడటం ఎన్నటికీ జరగదు.' భరించరాని అనంతమైన బాధ ఉన్నా ఈ క్షణాలలో ఆమె వాత్సల్యం ఇదివరకటి కంటే చాలా ఎక్కువైంది. దగ్గర ఉన్న వాళ్ళను ఆమె చాలా ముద్దు చేసేవారు. దగ్గరలేని వారి గురించి నిరంతరం అడుగుతూ ఉండేవారు. వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఉండేవారు. వాత్సల్య వితరణ చేస్తూ భావమయి మాత తన జబ్బుని ఒక విశిష్ట యోగసాధనగా మార్చుకున్నారు. ఈ సాధన చేస్తూ ఆమె ప్రాణాలు తన ఆరాధ్యునితో మహా మిలన కొరకు మహా ప్రయాణం చేయుటకు సన్నాహాలు చేయుచున్నారు.

H H H

**దేవుడు ప్రతి పక్షికీ తిండి కల్పిస్తాడు. దాన్ని గూడులో మాత్రం పెట్టడు.**

## వ్యక్తి నిర్మాణం

# నైతికతకు నాలుగు ముఖాలు

### ఆ పువ్వుకు నాలుగు రేకులు

నైతికతపట్ల విశ్వాసం సాఫల్యానికి ముఖ్యమైన కొలబద్ద. నైతిక వ్యక్తికి లభించే సాఫల్యంలో ఒక ఉల్లాసపు తరంగం ఉంటుంది. ఒక ఉత్సాహపు పొంగు ఉంటుంది. ఒక ఆంతరిక ఆనందపు అల ఉంటుంది. అనైతిక వ్యక్తికూడ సాఫల్యపు సోపానాలు ఎక్కడం కనిపిస్తుంది. అయితే అతడి సాఫల్యం పరిస్థితుల పడుగు పేకలతో నేయబడి ఉంటుంది. ఆ సాఫల్యం స్వల్పమైనది. అది పై మెరుగు మాత్రమే. ఆ సాఫల్యపు దారాలు గట్టిగా, దృఢంగా ఉండవు. చిన్న కుదుపుతో అవి చెల్లాచెదరు అయిపోతాయి. ఎందుకంటే- వాటి ప్రభావం మనఃస్థితి వరకు చేరజాలదు. మరోప్రక్క నైతికత మనసు లోతులను తాకుతుంది. భావనల లోతులను తాకుతుంది.

నైతికత మహత్తరమైన ఒక జీవన సరళి. అందులో వ్యక్తిత్వపు సౌందర్యం నిండుగా, శుభప్రదంగా వెలుగులు విరజిమ్ముతుంది. నైతిక వ్యక్తిత్వం తనచుట్టూ ఒక కొత్త సుగంధాన్ని వెదజల్లుతుంది. ఈ సుగంధం ఆ వ్యక్తి చింతనలలో, భావనలలో, కర్మలలో గోచరిస్తుంది. నైతికత అనే పుష్పం నాలుగు రేకులతో వికసిస్తుంది- (1) ఉద్ధరణ శక్తి (2) కర్తవ్య నిష్ఠ, (3) వివేక బుద్ధి, (4) పవిత్ర భావన.

### ఉద్ధరణ శక్తి

శక్తి సాహసానికి చిహ్నం. శక్తి ఉత్సాహానికీ, ఉత్తేజానికీ ప్రతీక. శక్తి నైతిక వ్యక్తిత్వంలో ఉత్సాహ, ఉత్తేజాలుగా ఘనీభవిస్తుంది. సాంద్రం అవుతుంది. గట్టి పడుతుంది. రేకుల శక్తి ఉప్పొంగితే, పువ్వులు విచ్చుకోకుండా ఉండలేవు. నదులలోని అపారమైన శక్తి వాటిని తమ లక్ష్యంవైపు ముందుకు నడిపిస్తూ ఉంటుంది. సముద్రంలోని శక్తి తరంగాలుగా ఎగసిపడుతూ ఉంటుంది. ఉప్పొంగుతూ ఉంటుంది. అలాగే-నైతికతలో ఒక శక్తి ఉంది. అది ఉద్ధరణవైపు, వికాసంవైపు ముందుకు నడిపిస్తుంది. శక్తి అనైతికతలోనూ ఉంటుంది. అయితే అది వినాశనంవైపు, సర్వనాశనంవైపు నిర్విరామంగా పరుగులుపెడుతూ పారిపోతూ ఉంటుంది. మరోప్రక్క- నైతికతలో శక్తికి దిశా, దశా లభిస్తాయి. అది వికాసంలో, ప్రగతిలో ప్రయోగించబడుతుంది. లక్ష్య సాధనలో కొద్ది ఆలస్యం జరిగినప్పటికీ.

నైతికతలో వికాసాన్ని పెంపొందించే శక్తి ఇమిడి ఉంది. క్రమబద్ధత ఉంది. ఆ శక్తికి గుర్తు ఒక్కటే-వ్యక్తిత్వాన్ని అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవడానికై సరి కొత్త పద్ధతుల నిరంతర అన్వేషణ. అలాంటి వ్యక్తి తన వ్యక్తిత్వంలోని కోణాలను వికసింపజేయడానికై వినూతన ప్రక్రియను ఆలోచిస్తాడు. కనుగొంటాడు. వాటిని ఆచరణలో పెడతాడు. నిర్విరామమైన ఈ కృషి ఫలితంగా వ్యక్తిత్వంలో దాగి ఉన్న శక్తులు వెలికివస్తాయి. వ్యక్తిత్వంలోని విత్తనాలు విచ్చుకుంటాయి. వ్యక్తి చింతన సంస్కరించబడుతుంది. నిర్మలం అవుతుంది. ఉత్సాహంతో పొంగిపొరలే వ్యక్తిలో మాత్రమే కార్యశూరత మొగ్గ తొడుగుతుంది. అతడిలో అపారమైన ఆత్మశక్తి ఉన్నదని, ఆత్మబలం ఉన్నదని ఇందువల్ల స్పష్టమవుతుంది.

ఆత్మశక్తి లోపిస్తే వ్యక్తిత్వం నిష్క్రియం అవుతుంది. తేజో రహితం అవుతుంది. జడ పదార్థంగా మారిపోతుంది. మొద్దుబారిపోతుంది. ఆ వ్యక్తిత్వంలో నైతికతను నిలిపి ఉంచుకునే సామర్థ్యం నశించిపోతుంది.

వ్యక్తి తెగిన గాలిపటంలా తయారవుతాడు. హతాశుడు అయిపోతాడు. నైతికత పరిధుల్లో ఇమడని పనులు చేయడం మొదలుపెడతాడు. అలాంటి విపత్కర మనఃస్థితిలో అనైతికతా సామ్రాజ్య అంధకారం వ్యాప్తి చెందుతుంది. ఉత్సాహంలేని జీవితంలో నైతికత అనే అంకురం విచ్చుకోదు. ఆశా విశ్వాసాలతో నిండిన సంకల్పవంతుని అంతరంగంలోనే నైతికత జన్మిస్తుంది. పెరుగుతుంది. వికాసం పొందుతుంది.

### కర్తవ్య నిష్ఠ

విశ్వాసంతో నిండిన వ్యక్తి అడుగులు కర్తవ్య పథంలో తడబడవు. కణకణలాడే నిప్పు రవ్వలమీద అయినా ముందుకుపోవడానికి ఉవ్విళ్ళూరుతాయి. ఆ అడుగులు కర్తవ్య నిష్ఠను ఎట్టి పరిస్థితులలోనూ వదలిపెట్టవు. అవహేళన చేయవు. కర్తవ్య నిష్ఠ నైతికతకు కొలబద్ద. అనివార్యమైన కొలబద్ద.

**ఆరోగ్యానికీ, ఆనందానికీ శత్రువు-ఋణం.**

తిరుగులేని కొలబద్ద. నైతికుడు అయిన వ్యక్తి కర్తవ్యంనుండి తప్పించుకోవడం అసంభవం. నిప్పునుండి మంటలు పైకిలేస్తూ ఉంటే, దాని సెగ తగలకపోవడం అసంభవం. నైతికత అనేది కణకణ మండే అగ్నిజ్వాల. అది ఒక వ్యక్తిలోపల జ్వలిస్తూ ఉంటే, అతడు తన కర్తవ్యాన్ని నిర్వహించకుండా ఊరుకోలేడు. అకర్మణ్యంగా కూర్చొనలేడు. అలాంటి వ్యక్తి క్షణకాలంకూడ చేతులు ముడుచుకుని ఉండలేడు. కర్తవ్యం అనే ముళ్లబాటమీద ముందుకుపోవడం అలాంటి వ్యక్తికి ఓ పండుగ. ఓ పర్వదినం. కనుక, నైతికత మనిషిని తన కర్తవ్యపట్ల జాగరూకుణ్ణి చేస్తుంది. కర్తవ్యాన్ని పాటించమని తీవ్రంగా హెచ్చరిస్తుంది. కర్తవ్యపాలనకు పురికొల్పుతుంది.

## వివేక దృష్టి

ఈ జాగరూకత, ఈ మెలకువ వివేక దృష్టిలేనిదే బ్రతికి బట్టకట్టదు. రాణించదు. విజయం సాధించదు.

'ఏమి చేయాలో, ఏమి చేయకూడదో త్వరితగతిని నిర్ణయించడమే వివేక బుద్ధి. సార్థకంగా జీవించడానికి ఏది అన్నిటికన్నా అవసరమో, అన్నిటి కన్నా ముందు ఏది చేయాలో, ఏది తర్వాత చేయాలో, ప్రస్తుత క్షణంలో ఏది అవసరమో ఏది అనవసరమో- ఈ విచక్షణను కలిగించేది, ఇలా ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించేది వివేక బుద్ధి.

కర్తవ్య మార్గం క్లిష్టమైనది. గహనమైనది. ఇరుకైనది. నైతిక వ్యక్తి సైతం జటిలమైన ఈ దారిలో ఇరుక్కుపోవచ్చు. దారి తప్పవచ్చు. వివేక బుద్ధి మనిషిని ఈ ప్రమాదంనుండి తప్పిస్తుంది. సరైన దారిలో ముందుకు నడవడానికి ప్రేరణ ఇస్తుంది.

వివేకం ఉచిత అనుచితాల మధ్య గల అంతరాన్ని స్పష్టం చేస్తుంది. ఆవశ్యకమూ, ఉపయోగకరమూ, సార్థకమూ అయినదానిని నిలుపుకోవడానికి వివేకం రాచబాట చూపుతుంది. ఈ వివేకం లోపిస్తే మానసికమైన భ్రమ మనిషిలో తిష్ట వేస్తుంది. ఆ భ్రమ ఉన్నంత కాలం మనం క్రమబద్ధంగా ఆలోచించలేము. పథకం ప్రకారం ఆలోచించలేము. ఆలోచన వచ్చినా, దానిని ఆచరణలో పెట్టలేము. దానిని అమలుచేయడం మోయలేని బరువు అనిపిస్తుంది. వివేక బుద్ధిద్వారా మానసిక భ్రమనుండి బయటపడగలుగుతాం. మానసికమైన చిక్కుముడులను విప్పగలుగుతాం. ఆలోచనను క్రియాశీలం చేయగలుగుతాం. మానసిక భ్రమ అనైతికతకు జన్మ నిస్తుంది. అనైతిక దృష్టి వక్రంగా, మసకమసకగా ఉంటుంది. వివేకం స్పష్టమూ, స్వచ్ఛమూ, ఉజ్వలమూ అయిన దృక్పథాన్ని పెంపొందిస్తుంది. ఈ దృక్పథం నుండే నైతికత విస్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటుంది.

## పవిత్ర భావన

నైతికత యొక్క ఈ సముజ్వల రూపానికి స్థిరత్వాన్ని ప్రసాదించేది భావన. భావనలోని నిర్మలత్వం, పవిత్రత నైతికతను శిఖరాగ్రానికి చేర్చుతాయి. భావనలోని ఆర్ద్రత నైతికతకు క్రొంగొత్త రూపురేఖలు ఇస్తుంది. నైతికతను వైభవంతో, ఐశ్వర్యంతో అలంకరిస్తుంది. భావన కలుషితం అయితే నైతికత మోయలేని బరువు అయిపోతుంది. దాన్ని దించనూ లేము, మోయనూలేము. భావనా కాలుష్యానికి నైతికత ముసుగు తొడగడం సాధ్యం కాదు. ఎందుకంటే-లోపలి మాలిన్యం వెలికి వస్తే, అది వ్యక్తిత్వపు బాహ్య వేషాన్ని తుత్తునియలు చేస్తుంది. ఫలితంగా, నైతికతకు కొలబద్దలన్నీ. గీటురాళ్లన్నీ మంటగలిసిపోతాయి. కనుక, భావనయొక్క చీరకొంగు లోపలే నైతికతకు నిండుతనం చేకూరుతుంది.

భావనలతో నిండిన సారవంతమైన భూమిలోనే నైతికత అనే మొక్క పెరిగి పెద్దదవుతుంది. నైతికత బలం ఏమేరకు వికాసం పొందితే, ఆమేరకు ఆత్మబలం వికాసం పొందుతుంది. నైతికబలం దిగజారిపోతే, ఆత్మబలం క్షీణించిపోతుంది. నైతికత ఆర్ద్రంగా ఉంటే, గౌరవ గరిమతో విలసిల్లుతూ ఉంటే- ఆత్మశక్తి మేలుకొంటుంది. నైతిక వ్యక్తి ఆంతరిక చేతన గర్వంతో, ఉత్సాహంతో పొంగిపొరలుతుంది. ఆ చేతనలో వివేకం ఉంటుంది. ఆ వివేకంలో శ్రద్ధను ఎంపిక చేసే సామర్థ్యం ఉంటుంది.

## దివ్యజీవనానికి వెలుగుబాట

జీవన సాఫల్యానికి నిజమైన మార్గం, సార్థకమైన మార్గం నైతికత. అనైతికత క్షణికమైనది. మెరిసి మాయమయ్యేది. నైతిక జీవనం సుస్థిరమైనది. సార్థకమైనది. సఫలమైనది. కనుక, ఉత్సాహంతో, ఉల్లాసపు పొంగుతో మనం మన కర్తవ్య మార్గంలో ముందుకుపోతూ ఉండాలి. జీవితంలో ఏది సముచితమో ఏది అనుచితమో విచక్షణతో నిర్ణయించి పవిత్ర భావంతో కర్మచేయాలి.

ఈ సంజీవని సూత్రాలను జీవితంలో అన్వయించుకుంటే- మనం నైతికత ప్రసాదించే దివ్య ప్రయోజనాలను పొందగలుగుతాం. జీవితాన్ని భవ్యంగా, వైభవోజ్వలంగా తీర్చిదిద్దుకోగలుగుతాం.

H H H

**వెన్న కరగడం వేడికి గుర్తు; మనసు కరగడం మానవతకు గుర్తు.**

బోధ కథ

# సంభవామి యుగే యుగే

అతడు ఎవరు? ఎక్కడివాడు? ఈ దుర్గమ ప్రదేశానికి ఎలా వచ్చాడు? ఎందుకు వచ్చాడు?

ఎవరికీ తెలియదు. ఇక్కడి టిబెట్ ప్రజలు యాక్‌లనూ, గొర్రెలను తోలుకుంటారు. అక్కడక్కడ గుడారాలు వేసుకుని 15-20 రోజులు ఉండి మరోచోటికి వెళుతూ ఉంటారు. వీరికి అతడి గురించి తెలుసుకునే అవకాశం లేదు. వీరికి అతడి భాష తెలియదు. అతడికి వీరి భాష తెలియదు.

నాలుగు రోజులకు ఒకసారి అతడు వారివద్దకు వస్తాడు. ఒక బంగారు నాణెం ఇస్తాడు. వెన్న, పాలు, పెరుగు, పేలాలు తీసుకుంటాడు. అక్కడ సులువుగా దొరికే వస్తువులు అవి. ఒకసారి వాళ్లు మాంసం అతని ముందుంచారు. అది తనకు అక్కరలేదని అతడు సైగలతో సూచించాడు.

టిబెట్టులోని చలికి పాలూ, పెరుగూ నెలల తరబడి చెడిపోకుండా ఉంటాయి. అతడు వాటిని తీసుకుని దూరాన ఉన్న కొండలలోకి వెళతాడు. ఆ కొండలలోకి వెళ్లడానికి ఈ కొండవాసులుసైతం జంకుతారు.

అక్కడికి చాలా దూరంలో మంచుతో కప్పబడి ఉన్న ఒక గుహలో ఒక భారతీయ లామా ఉన్నారని వారు విన్నారు. ఆయన గొప్ప యోగి. ఈ తెల్లవాడు ఆయన వద్దకే వెళతాడని వాళ్లు అనుకున్నారు.

ఈ టిబెట్టు ప్రజలు దృఢకాయులు. శ్రద్ధ కలవారు. వీరికి ఆ తెల్లజాతి వ్యక్తి పట్ల గౌరవభావం కలిగింది. ఉన్ని పంట్లాము, ఓవర్‌కోటు, టోపీ. ఇది అతడి వేషం. అతడి గురించి వివరాలు తెలుసుకోవాలని వారికి ఉంది. కాని తెలుసుకునే మార్గం వారికి తోచడం లేదు.

ఇక్కడి మంచువల్ల, ఇక్కడి చలివల్ల అతడి ముఖం. అతడి చేతులు నల్లబడిపోయాయి. అది సహజమే. కానీ, అతడికి ఒక చెవి లేదు. ముక్కు సగం లేదు. ఒక కన్ను లేదు. చెంపలు రెండూ గాయపడి ఉన్నాయి. నోటిలోని ముందు పళ్లుకూడా లేవు.

ఎలుగుబంటు వాటిని తినేసి ఉంటుందని వాళ్లు అనుకున్నారు. ఇలా ఎలుగులు తినివేయడం అక్కడ మామూలు విషయమే. ఎలుగుబంటు అతడిపై దాడిచేసి అతడిని గాయపరచి ఉంటుందనీ, అతడు ఆ దాడిలో కొండనుంచి క్రిందకు పడిపోయి ఉంటాడనీ వారి అభిప్రాయం. ఏదోవిధంగా అతడికి ప్రాణం దక్కిందని వారి అంచనా. అదే నిజమని వారి నమ్మకం. ఎలుగుబంటుతో ఇంత ధైర్యంగా పోరాడినందుకు అతడిపై వాళ్ల గౌరవం ఇంకా పెరిగింది.

ఈ తెల్లవ్యక్తి ఒకేఒక కోరికతో ఈ దుర్గమ ప్రదేశానికి వచ్చాడు. హిమాలయంలోని ఒక యోగి మాత్రమే తన కోరిక తీర్చగలడని అతడి ఆశ. అది అడియాస అని ఎవరూ చెప్పలేరు. ఆ యోగిని ఎలాగైనా కలుసుకోవాలి. అతడి అనుగ్రహం సంపాదించాలి. అతడిద్వారా తన కోరిక తీరాలి-ఇదే అతడి ఆరాటం. ఇదే అతడి తహతహ.

అతడు టిబెట్‌లోని ఈ పర్వతాలకు ఎలా చేరాడో, హిమ గుహలో ఉన్న ఆ యోగిని ఎలా దర్శించగలిగాడో- అదంతా ఓ పెద్ద కథ. అదలా ఉంచండి. టిబెట్టులోని పశువుల కాపరులు చెప్పుకునే కబుర్లు భారతదేశంలోని కొండజాతులవారికి చేరుతూనే ఉంటాయి. అక్కడే అతడు దుర్గమమైన పర్వత గుహలో ఉన్న 'లామా' గురించి విన్నాడు. కష్టాలు అతడిని లొంగదీయలేకపోయాయి. మృత్యు దేవత అతడిని భయపెట్టలేకపోయింది. అలాంటి వ్యక్తి తాను ఏర్పరుచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆశ్చర్యం ఏముంది.

అతడు ఆ గుహ చేరాడు. మూడు నెలలుగా ఆ గుహలోనే మకాం వేసి ఉన్నాడు. తాను తీసుకువచ్చిన బంగారు నాణాలు తరిగిపోతున్నాయి. అవి ఖర్చయిపోతే, ఆ తర్వాత

**విధ్యుక్త కర్మపట్ల శ్రద్ధ దైవారాధనకు ఉత్తమ మార్గం.**

ఏమి చేయాలో అతడికి అర్థం కావడం లేదు.

గుహలోపల యోగి ఉన్నాడు. శిలా విగ్రహంలా ఉన్నాడు. స్పందన లేకుండా, స్థిరంగా కూర్చొని ఉన్నాడు. ఆ యోగి శరీరం జీవించి ఉన్నదో, నిర్జీవమైనదో అతడు తేల్చుకోలేకపోయాడు. భారతీయ యోగులు గాలిని బంధించి ప్రాణంలేని వారిలా సంవత్సరాల తరబడి జీవించగలుగుతారని అతడు చదివి ఉన్నాడు. అయితే, శవంకూడ ఈ హిమ ప్రదేశంలో చెడిపోకుండా ఉండవచ్చు కదా.

అతడు ఆ గుహను శుభ్రపరచాడు. స్టౌమీద నీళ్లు వేడిచేశాడు. భయపడుతూ భయపడుతూ, శిలా విగ్రహంలాంటి ఆ శరీరాన్ని కడుగుతూ వచ్చాడు. ఇప్పుడు ఆ స్టౌలో చమురు అయిపోయింది. బండరాయిలా ఉన్న ఆ మహాపురుషునికి ఇంకా ఎలా సేవ చేయాలో అతడికి తోచడం లేదు.

అతడు చేయగలిగింది ఎదురుచూడడం, ఎదురుచూస్తూ ఉండడం. ఇపుడు ప్రపంచంలోకి తిరిగివెళ్లి చేసేది మాత్రం ఏముంది? తన ప్రతీక్ష సఫలం కాకపోతే, రాతిపై కూర్చున్న ఆ యోగి చరణాలవద్ద ప్రాణంలేని తన శరీరం అలా శాశ్వతంగా పడి ఉంటుంది. తాను మాత్రం ఇక్కడనుండి తిరిగివెళ్లడు.

అలాంటిదేమీ జరగదు. ఈ సృష్టిని నడిపించేవాడు ఒకడు ఉన్నాడు. అతడు దయాసముద్రుడు. దృఢవ్రతం పూనిన వ్యక్తిని ఎన్నడూ అతడు నిరాశకు లోనుచేయలేదు.

ఆ రోజున ఆ గుహ వెలుగుతో నిండిపోయింది. రాతిమీద కూర్చొన్న ఆ యోగి శరీరం సూర్యునిలా కాంతిపుంజం అయింది. ఆయనవైపు చూడడం సాధ్యం కాలేదు. తెల్లవ్యక్తి తన చేతులతో కళ్లు మూసుకున్నాడు. తల నేలకు తాకించి ప్రణామం చేశాడు ఆ కాంతి పుంజం ఎదుట.

సుదీర్ఘమైన ఓంకార నాదం అనంతరం- "బాబూ!" అనే మాట అమృతధారలా వెలికివచ్చింది. ఆ సర్వజ్ఞుడు ఒక్కక్షణం, ఒకేఒక్క క్షణం ఆగాడు. అతడి భాషలోనే అతడిని సంబోధిస్తున్నాడు. తెల్లవ్యక్తి కంఠం కన్నీటితో తడిసిపోయింది. అతి కష్టంమీద మాట పెగిలివచ్చింది-

"నేను యూదు జాతికి చెందిన వ్యక్తిని. నా ఇంటినుంచి, నా దేశంనుంచి తరిమివేయబడిన నిస్సహాయుణ్ణి. అత్యాచారాలవల్ల క్రుంగికృశించిపోయిన నిర్భాగ్యుణ్ణి. మీరే నాకు శరణం. ఆ పిశాచాలపై పగ తీర్చుకోవడానికి మీరు తప్ప నాకు మరెవ్వరూ లేరు."

యోగి నీరవంగా వింటూ ఉన్నాడు. అతడు ఇంకా ఇలా చెప్పుకుపోయాడు-

"నేను జర్మన్ యూదుడను. ఎన్నడూ నా జర్మనీ దేశానికి అపకారం చేసి ఎరుగను. అయితే- హిట్లరు అధికారం నేడు ప్రపంచాన్ని అణచివేస్తోంది. కాలరాసివేస్తోంది. అతడు చేసే దారుణాలనూ, ఘోరాలనూ ఎదిరించేవారు ఎవ్వరూ లేరు. నాజీ పిశాచాలు నా భార్యనూ, నా సంతానాన్ని చిత్రహింసలకు గురిచేశారు. అమానుషంగా చంపివేశారు. వారు వారిని హత్యచేసి ఉంటే, నేను ఆ హంతకులను క్షమించే వాణ్ణే. కానీ, వారు రాక్షసంగా ఆ పని చేశారు. పైశాచికంగా ఆ పని చేశారు. నా ఈ శరీరం వారి చేతుల్లో ఇలా అయింది. ఆ బాధ తలచుకుంటేనే నా మనస్సు ముక్కలయిపోతోంది. నన్ను విష పురుగులతో కరిపించారు. కొరడాలతో కొట్టారు. నాపై జరిగిన చిత్రహింసలకు అంతు లేదు. వారిమీద పిడుగులు పడాలి. వారు కుక్క చావు చావాలి."

అతడి కళ్లు నిప్పుకణాలు అయినాయి. అతడు క్రోధావేశంతో ఊగిపోతున్నాడు.

"నేనిక్కడికి చేరుకోలేకపోయేవాడినే. ఇల్లూ వాకిలీ లేని నాకు కొందరు ఉదారులు సాయపడ్డారు. నేను వారికి ప్రత్యుపకారం చేయలేకపోయాను. వారు నన్ను గౌరవించారు. నాకు సౌకర్యాలు అమర్చారు. శుశ్రూష చేశారు. తమ ఆశీస్సులతో వారికి శుభం జరగాలి."

అతడు కొంత శాంతించాడు. అయినా అతడి ముఖంలో ఉద్రిక్తత కానవస్తోంది.

**ఆత్మవిశ్వాసంతో నిండిన వ్యక్తుల చరిత్రయే ప్రపంచ చరిత్ర.**

మహాయోగి ప్రశాంతంగా, ప్రసన్నంగా ఇలా అన్నాడు-

"నాయనా! ఇపుడు నీకు కావలసింది ఏమిటి?"

"హిట్లరు సర్వనాశనం"-అని అతడు కేకపెట్టాడు.

"హిట్లరు సర్వనాశనమా, హిట్లరు దుర్బుద్ధి సర్వనాశనమా?" అని మహాయోగి ప్రశ్నించాడు.

అతడు నిర్ఘాంతపోయాడు. మహాయోగిని అలా చూస్తూ ఉండిపోయాడు.

అతడి ముఖంలో వస్తూన్న మార్పులను గమనించకుండా మహాయోగి ఇలా చెప్పుకుపోయాడు-

"హిట్లరు జరిపిన ఘాతుకాలకు జనని అతడి దుర్బుద్ధే కదా. ఒక్క హిట్లరు చనిపోయినంత మాత్రాన ఒరిగేదేముంది? ప్రపంచంలో వ్యాపించి ఉన్నా దుర్బుద్ధి మరెందరు హిట్లరులను సృష్టిస్తుందో."

"అయితే హిట్లరు చావడా?"

-తెల్ల యూదుడు తన పట్టు వదలలేదు.

మహాయోగి అతడిని వాత్సల్యంగా చూస్తూ ఇలా చెప్పాడు-

"నీవు ఇక్కడికి రాగానే హిట్లరు చనిపోయాడు. అతడి దుర్బుద్ధి అతడిచేత దారుణ మారణహోమాలు జరిపించింది. ఆ దుర్బుద్ధికి లక్షలాదిగా ప్రజలు బలి అయినారు. ఆ దుర్బుద్ధే అతడిని ఆత్మహత్యకు పురికొల్పింది. అయినా- ఒక హిట్లరు చావడంవల్ల ప్రయోజనం ఏముంది? హిట్లర్ దుర్బుద్ధి ఇంకా దుర్మార్గాలు సాగిస్తూనే ఉంది."

"మరి ఇందుకు తరణోపాయం ఏదీ లేదా? హిమాలయంలోని ఋషులు సర్వసమర్థులని నేను విన్నాను."

-అని యూదుడు అన్నాడు.

మహాయోగి ఇలా వివరించాడు-

"నీవు చెప్పింది నిజమే. తపోనిష్ఠులైన ఈ ఋషుల ప్రార్థనను భగవానుడు మన్నించాడు. ప్రజ్ఞావతారంగా భువికి దిగివచ్చాడు. ఆయన ఇప్పుడు తన పథకాలకు ప్రాతిపదికను ఏర్పరచుకోవడంలో నిమగ్నులై ఉన్నారు. గోప్యంగా ఉన్నారు. తరుణం వచ్చినపుడు ఆయన తనను తాను ప్రకటించు కుంటారు. ఈసారి ఆయన తన లీలా సహచరులతోపాటు దుర్బుద్ధి చేసే ఆగడాలను ప్రతిఘటిస్తారు."

ఇలా చెపుతూ చెపుతూ మహాయోగి శూన్యంలోకి పరకాయించి చూస్తున్నాడు. తన దివ్యదృష్టితో భవిష్యత్తును నిశితంగా గమనిస్తూన్నట్లు-

"హిమాలయ సానువులనుండి బయలుదేరే ఈ భావ విప్లవపు తుపాను తాకిడికి విశ్వమంతటిలో ఉన్న దుర్బుద్ధి గడ్డిపరకలా ఎగిరిపోతుంది. మనిషి బుద్ధి సంస్కరించబడి ప్రజ్ఞగా రూపొందుతుంది. నిర్మాణాత్మక కార్యకలాపాలలో నిమగ్నం అవుతుంది."

ఓహో!

తెల్లవ్యక్తి నిద్రనుండి మేలుకొన్న అనుభూతి పొందాడు. కొద్ది క్షణాలు ఆగి, అతడు ఆ హిమాలయ గుహలోనే ఉండి తపస్సు చేయడానికి మహాయోగిని అనుమతి కోరాడు.

మహాయోగి ఇలా సమాధానం చెప్పాడు-

"వద్దు. గుహలో తపస్సు చేసే సమయం కాదిది. నీవు తిరిగి వెళ్లు. మూర్ఛిల్లిన, నిద్రాణమైన మానవాళికి పరమాత్మ అవతరించిన సందేశాన్ని అందించు. మానవాళిలో నవ జీవాన్ని నింపు. ఇది సంకుచితత్వపు సంకెళ్లలో బంధించబడి ఉండిపోయే సమయం కాదు. ఏడుస్తూ కూర్చునే సమయం కాదు. ఆర్తనాదాలు చేసే సమయం కాదు. పరమాత్మతో భాగస్వామ్యాన్ని నిర్వహించే తరుణం ఇది. మానవాళికి ఈ సందేశాన్ని వినిపించు."

మహాయోగి ఇచ్చిన ఈ సందేశాన్ని శిరసావహించి బుర్డెన్ బర్గ్ అనే ఆ జర్మన్ యూదుడు "మిస్టిక్ హిమాలయ" అనే గ్రంథం రచించాడు. ఆ గ్రంథంలో మానవాళికి ఉజ్వల భవిష్యత్తు ఉన్నదనే ఆశాభావాన్ని పొందుపరచాడు.

H H H

**మన సమాజానికి నాయకత్వం వహించినవారు రాజులు కారు- ఋషులు.**

# వార్తలు

# బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజతోత్సవాలు

## హైదరాబాదులో

ఆధ్యాత్మికతను శాస్త్రీయంగా ప్రతిపాదించడంలో బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ మహత్తర విజయాలు సాధించిందని ఉత్తరప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఓ.పి.శర్మ పేర్కొన్నారు. ఆగస్టు 20 సాయంత్రం హైదరాబాదు, మలక్‌పేట్‌లోని సంహితా కళాశాలలో జరిగిన సభలో వారు మల్టీ మీడియా ప్రొజెక్షన్ ద్వారా ఉపన్యసించారు.

జీవించే కళపై శోధ సంస్థాన్ పరిశోధనలు జరిపిందని చెపుతూ డా॥శర్మ, ఆ కళలో ఆలోచించే కళ, పనిచేసే కళ, ఇతరులతో సంబంధాలను పెంపొందించే కళ, సంఘటితపరచే కళ అంతర్భాగాలని వివరించారు.

శోధ సంస్థాన్ స్థాపించిన యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ గాయత్రీ మంత్ర సిద్ధి పొందిన మహనీయుడని ఆయన వర్ణించారు.

తొలుత శ్రీమతి విజయా విశ్వనాథ్ వేదికపై ఉన్న పెద్దలను పూలమాలలతో సత్కరించారు. శ్రీ ఇంద్రసేనారెడ్డి ఆచార్యజీ జీవితంపై ప్రసంగించారు. శ్రీరాకేశ్ జయస్వాల్ ముఖ్య వక్తను పరిచయం చేశారు. ప్రముఖ న్యాయవాది శ్రీవిశ్వనాథ్ ప్రసాద్ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆగస్టు 21 సాయంత్రం హైదరాబాదులోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజత జయంతి ఉత్సవాల సందర్భంగా సదస్సు జరిగింది.

తొలుత శ్రీ అశ్విని సుబ్బారావు శోధ సంస్థాన్‌ను దర్శించినప్పుడు తాను చూచిన విశేషాలను వర్ణించారు.

నిమ్స్ పేథాలజీ విభాగం అధిపతి డా॥కె.ఎస్.రత్నాకర్ తమ ప్రసంగంలో గుణరహితము, కామరహితము అయిన ప్రేమ మనిషి మనస్సును స్థిరంగా ఉంచుతుందని తెలిపారు.

శాసనసభ్యులు శ్రీ సిహెచ్.రాజేశ్వరరావు విద్యలో సంస్కారం ప్రాముఖ్యాన్ని వివరించారు. విద్య విద్యార్థిలో మానవీయతనూ, దూరదృష్టినీ, దార్శనికతనూ, ఆత్మజ్ఞానాన్నీ కలిగించాలని పేర్కొన్నారు.

ఎమ్.సి.ఆర్.హెచ్.ఆర్.డి. ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సి.ఎస్.రామలక్ష్మి 21వ శతాబ్దంలో మహిళాశక్తిని గురించి ప్రసంగించారు. మహిళలచేత యజ్ఞాలు చేయిస్తున్నందుకు ఆమె గాయత్రీ పరివార్ సంస్థను ప్రశంసించారు. మహిళలకు మనశ్శాంతి, సుఖ సంతోషాలు, సమానత్వం అందేవిధంగా సమాజంలో మార్పు రావాలని ఆమె కోరారు.

ఉత్తరప్రదేశ్ మెడికల్ సర్వీసుల మాజీ డైరెక్టర్ జనరల్ డా॥గాయత్రీ శర్మ తమ ప్రసంగంలో గాయత్రీ జపం, యజ్ఞం మనిషిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు.

ఉత్తరప్రదేశ్ మెడికల్ హెల్త్ సర్వీసుల మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఓ.పి.శర్మ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వైజ్ఞానిక అధ్యాత్మవాదంపై ఉపన్యసించారు.

శ్రీమతి భారతీ ఖండేల్‌వాల్ వందన సమర్పణ చేశారు.

ఆగస్టు 22 సాయంత్రం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సదస్సు జరిగింది. రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖల మంత్రి గౌరవనీయులు శ్రీ జి.వినోద్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, గాయత్రీ పరివార్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు అన్నివిధాలా సహాయం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

డా॥ ఓ.పి.శర్మ ప్రసంగిస్తూ, శోధ సంస్థాన్ జరుపుతున్న కృషిలో క్రియాశీలంగా పాల్గొనవలసిందిగా మేధావులకు విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులు శ్రీ సిహెచ్.రాజేశ్వరరావు కూడా ప్రసింగించారు.

ఆతర్వాత దీపయజ్ఞం జరిగింది.

## విశాఖపట్టణంలో

బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజత జయంతి సందర్భంగా విశాఖపట్నంలో అనేక కార్యక్రమాలు జరిగాయి.

ఆగస్టు 16న బి.వి.కె.డిగ్రీ కాలేజీలో విద్యార్థుల, తల్లి దండ్రుల సమావేశం జరిగింది. ఆతర్వాత గాయత్రీ పరివార్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. కార్యకర్తలు, మేధావులు పెద్ద సంఖ్యలో

**మన మనఃస్థితి, ఆచరణ ఎలా ఉంటే, మన ప్రపంచం అలా ఉంటుంది.**

సమావేశంలో పాల్గొన్నారు. డా॥ఓ.పి.శర్మ మల్టీ మీడియా ప్రెజెంటేషన్ ద్వారా శోధ సంస్థాన్ సాధించిన విజయాలను వర్ణించారు. డా॥ గాయత్రీ శర్మకూడ సమావేశంలో ప్రసంగించారు.

ఆగస్టు 17 ఉదయం గాంధీ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థుల, అధ్యాపకుల సమావేశంలో డా॥ఓ.పి.శర్మ 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్'పై ప్రసంగించారు. మానసిక ఒత్తిడికి కారణాలను, వాటికి చికిత్సను వారు వివరించారు. అనంతరం డా॥శర్మ సభికుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

నాటి మధ్యాహ్నం గాయత్రీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలో ఇలాంటి కార్యక్రమం జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

18 ఉదయం వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో కార్యక్రమం జరిగింది. సమావేశంలో కార్యకర్తలు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డా॥ఓ.పి.శర్మ మానసిక ఒత్తిడి గురించి ప్రసంగించారు. ఆతర్వాత కె.జి.మెడికల్ కాలేజిలో డాక్టర్ల సమావేశం జరిగింది. డా॥ఓ.పి.శర్మ "స్ట్రెస్ మేనేజ్‌మెంట్"పై ప్రసంగించారు. మానసిక ఒత్తిడి లేని డాక్టరు మాత్రమే రోగులకు నిజమైన సేవ చేయగలుగుతాడని ఆయన వివరించారు. డాక్టర్లు సంవేదనశీలురుగా ఉండాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ డా॥ఆర్.నారాయణ రావు సభకు అధ్యక్షత వహించారు.

అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయ సభాగృహంలో కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్లు, రిసెర్చ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆ సమావేశంలో పాల్గొన్నారు. డా॥ఓ.పి.శర్మ అధ్యాత్మ, విజ్ఞానముల సమన్వయంపై ప్రసంగించారు. పరమపూజ్య గురుదేవుల వైజ్ఞానిక అధ్యాత్మవాదంపై ఆయన చేసిన విశ్లేషణ అందరినీ ఎంతగానో ప్రభావితం చేసింది. కార్యక్రమం తర్వాత పలువురు పెద్దలు శాంతికుంజ్‌ను దర్శించాలనే కోరికను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను అందరూ శ్రద్ధగా దర్శించారు. దానిని మెచ్చుకున్నారు. సభాగృహం వద్ద ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాల్‌లో చాలామంది యుగ సాహిత్యాన్ని కొనుగోలు చేశారు.

నాటి చివరి కార్యక్రమం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గాజువాక శాఖలో జరిగింది. సమావేశంలో సుమారు 100 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

పై మూడు రోజుల కార్యక్రమాల నిర్వహణకై డా॥చంద్రశేఖరం, శ్రీయుతులు కె.ఆర్.శర్మ, డి.కె.గుప్త, వి.కె.మహేశ్వరి, సతీంద్ర బజాజ్, శ్రీధర్‌జీ, జె.కె.అసోపా విశేష కృషి చేశారు.

## భీమిలిలో

ఆగస్టు 17న భీమిలిలోని శ్రీ దుర్గా గాయత్రి శక్తిపీఠంలో బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజతోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు జరిగాయి.

శాంతికుంజ్ బృందం సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. డా.ఓ.పి.శర్మ నాయకత్వంలో ఒక బృందం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 వరకు గీతా కాలేజిలోను, గాయత్రి ఇంజనీరింగ్ కాలేజిలోను కార్యక్రమాలు నిర్వహించింది. డా॥శర్మ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఉపన్యాసాలు ఇచ్చారు.

రెండవ బృందం డా॥తుమ్మూరి నాయకత్వంలో ఉదయం 9 గంటలకు శ్రీ దుర్గా గాయత్రి శక్తిపీఠం చేరింది. ఉదయం 10 గంటలకు 24 కుండీల గాయత్రి మహాయజ్ఞం ప్రారంభమయింది. శాంతికుంజ్ బృందం సంగీత మధురిమలతో, డా॥తుమ్మూరి వ్యాఖ్యానంతో 500 మంది భక్తులు తన్మయం పొందారు. ఆ సందర్భంగా విద్యారంభం, యజ్ఞోపవీత ధారణ సంస్కారాలు, గురుదీక్షలు జరిగాయి. పీఠంలో ప్రతినెలా జరుగుతూన్న 24 లక్షల గాయత్రి జపానికి పూర్ణాహుతి జరిగింది.

నాటి సాయంత్రం 4:30కు శ్రీ ఓ.పి.శర్మ ప్రవచనం జరిగింది. ఆ తర్వాత 2400 దీపాలతో విరాట్ దీపయజ్ఞం జరిగింది. శ్రీమతి అంబటి మల్లీశ్వరి అంశదానంతో యజ్ఞం, దీప యజ్ఞం జరిగాయి. శ్రీమతి భారతి, శ్రీయుతులు ఎన్.రామకృష్ణ, బి.గణేశ్, పండా దంపతులు కార్యక్రమాల కోసం విశేషంగా కృషి చేశారు.

## గాయత్రీ ప్రజ్ఞాపీఠం ప్రారంభం

విశాఖపట్నం కె.జి.హెచ్ డౌన్‌లో ఉన్న కుమ్మరి వీధిలో శ్రీమతి రాజేశ్వరమ్మ గృహంపై అంతస్థు హాలులో గాయత్రీ ప్రజ్ఞాపీఠం ప్రారంభోత్సవం జరిగింది. ఆ సందర్భంగా ఆగస్టు21న 108 కలశాలతో కలశయాత్ర జరిగింది. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీఉపేంద్ర నాయకత్వం వహించారు. శ్రీమతి భారతి ముఖ్య అతిధిగా విచ్చేశారు.

22 ఉదయం ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 200 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు కె.ఆర్.శర్మ, వి.కె.మహేశ్వరి, శ్రీమతులు సావిత్రి, వసంత, రూపవాణి పాల్గొన్నారు.

బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజతోత్సవం సందర్భంగా ఈ ప్రజ్ఞాపీఠాన్ని ప్రారంభించారు.

**ఇంద్రియాలు - వశపరచుకుంటే మిత్రులు, దాసులమయితే శత్రువులు.**

## ఇల్లందులో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం

ఇల్లందులో ఆగస్టు 17న రజక సేవాసంఘం ఆధ్వర్యంలో నవకుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 250 మంది పాల్గొన్నారు. ఇద్దరికి గురుదీక్ష, ఒకరికి నామకరణ సంస్కారం జరిగాయి. ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. రజక సేవా సంఘం అధ్యక్షులు శ్రీకంచర్ల శ్రీనివాస్ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

గురుపూర్ణిమ సందర్భంగా ఇల్లందులో జూలై2న నవకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. ఆసందర్భంగా నలుగురికి గురుదీక్ష, ముగ్గురికి అక్షరాభ్యాస సంస్కారం జరిగాయి. జిల్లా కన్వీనర్ శ్రీ సతీష్ ఖండేల్‌వాల్ ప్రసంగించారు. శ్రీయుతులు టి.నాగభూషణ రావు, శ్రీకాంత్, ఎస్.వి.పరబ్, రోహిత్, శ్రీమతి కిరణ్‌దేవి గుప్తలు కార్యక్రమానికి సహకారం అందించారు.

జూలై 4న గాయత్రీ పరివార్ కార్యలయంవద్ద పల్స్ పోలియో కేంద్రాన్ని శ్రీసతీష్ ఖండేల్‌వాల్ ప్రారంభించారు. శ్రీయుతులు శ్రీకాంత్, నర్సయ్య సహకరించారు.

## నెల్లూరులో జ్ఞానపరీక్ష పుస్తకాల పంపిణీ

జూన్ 27న హైదరాబాదులో జరిగిన కార్యశాలలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం నెల్లూరు గాయత్రీ పరివార్ శాఖ 3500 మంది విద్యార్థులకు భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష పుస్తకాలను పంపిణీ చేసింది. 100కు పైగా యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారులను చేర్పించింది. శ్రీయుతులు ఓ.సిద్ధారెడ్డి, ఆడిటర్ పుండరీకాక్షం, ఆర్.సూర్యచంద్రా రెడ్డి ఇందుకోసం విశేషంగా కృషి చేశారు.

## ఇల్లందులో స్వాతంత్ర్యదినోత్సవం

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఇల్లందులో గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో పెద్ద ఊరేగింపు జరిగింది. స్వాతి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్ర మూర్తి, శ్రీయుతులు ఎస్.వి.పరబ్, టి.నాగభూషణరావు, వాసవీ క్లబ్ కార్యదర్శి శ్రీ ఏ.దామోదర్ పాల్గొన్నారు. ఆతర్వాత గాయత్రీ పరివార్ హాలులో జరిగిన సభలో జిల్లా కన్వీనర్ శ్రీ సతీష్ ఖండేల్‌వాల్ ప్రసంగించారు.

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ నాయకుల ఊహాత్మక చిత్ర లేఖన పోటీలలో 40 పాఠశాలల నుండి 170 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. నాటి సభలో విజేతలకు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు శ్రీ ఎన్.ఎస్.మోహన్ రాజా బహుమతులు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

## జగిత్యాలలో శ్రావణి ఉపాకర్మ

ఆగస్టు 30న జగిత్యాలలోని మార్కండేయ ఆలయంలో శ్రావణి ఉపాకర్మ ఉత్సవం జరిగింది. ద్వికుండీ గాయత్రీ యజ్ఞం, నూతన యజ్ఞోపవీత ధారణ, రక్షాబంధన్ కార్యక్రమాలను నిర్వహించారు. 200 మంది పాల్గొన్నారు. శ్రీ ఆదెపు గంగారాం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీయుతులు గడ్డం బుచ్చిరెడ్డి, పడకంటి లక్ష్మీనారాయణ, డి.ఎల్.ఎన్.చారి, కాసం అశోక్‌కుమార్ గుప్త, గట్ల లక్ష్మణ్ సహకరించారు.

## బందుగాంలో గాయత్రీ యజ్ఞం

ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బందుగాం గ్రామంలో ఆగస్టు 28న గాయత్రీ యజ్ఞం జరిగింది. 200 మందికి పైగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా డా॥ తుమ్మూరి వారి శ్రీమతితో కలసి గ్రామానికి విచ్చేసి తగు సూచనలు ఇచ్చారు.

## అక్టోబరు, నవంబరు నెలలలో పర్వదినాలు

**అక్టోబరు :**

2. గాంధీ జయంతి.
   మాతాజీ భగవతీదేవి శర్మ జయంతి.
   లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి.
12. యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ జయంతి.
13. మహాలయ అమావాస్య.
23. విజయదశమి.

**నవంబరు :**

10. ధన్వంతరి జయంతి.
12. దీపావళి
16. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి.
26. గురునానక్ జయంతి.
30. గురు తేగ్ బహదూర్ బలిదానం.

**మనిషి పక్షిలా ఎగరగలుగుతున్నాడు. మనిషిలా జీవించలేకపోతున్నాడు.**

## కృష్ణాపుష్కరాల సందర్భంగా అమరావతిలో

# నారాకోడూరు గాయత్రీ శక్తి పీఠం అపూర్వ సేవ

శాంతికుంజ్ హరిద్వార్ ఆశీస్సులతో, ప.పూ.గురుదేవుల సందేశ వ్యాప్తికి పుష్కరాల సందర్భాన్ని అవకాశంగా భావించి - నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠం తన సర్వశక్తులు ఒడ్డి ఈకార్యక్రమం చేపట్టింది. 9 కుండముల గాయత్రీ యజ్ఞం, పిండ ప్రదానం, తర్పణలు ప్రతి రోజు ఏర్పాటు చేయబడ్డాయి. అమరావతిలో పరివార్ శాఖ లేదు. తరలి వెళ్ళి పెళ్ళి చేసిన చందంగా అన్నీ ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది.

గురుదేవులు వెన్నంటి ఉన్నారన్నట్లుగా శ్రీవిన్నకోట సాంబశివరావు తమ షెడ్డును యజ్ఞశాలకు ఇచ్చారు. ప్రక్కన ఖాళీ స్థలం గొయ్యిలాగా ఉంది. మెరక తోలించి వానకు తడవకుండా ప్లాస్టిక్ పట్టాలతో కప్పువేశాం. షెడ్డుకు రంగులు, సున్నం వేశారు. మనకోసమే అన్నట్లు దేవస్థానం ఈ సంవత్సరం నిర్మించిన పిండ ప్రదానం హాలులో 24×24 అడుగుల స్థలం కేటాయించింది. వసతికి, భోజనశాలకు 3 ఇళ్ళు అద్దెకు తీసుకున్నాం. పోస్టర్లు, కరపత్రాలు, టాటా సుమోలో ప్రచారం.

ఆగస్టు 27 సాయంత్రం కృష్ణానది ఒడ్డు నుండి కలశయాత్ర యజ్ఞశాల వరకు 2 కి.మీ దూరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ శ్రీమతి కొల్లి పద్మావతి పతీ సమేతంగా పాల్గొని ముందు నడిచారు. తర్వాత నిర్వహించిన దీపయజ్ఞమును స్థానిక మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షులు శ్రీనిమ్మా విజయసాగరబాబు దీపప్రజ్వలనచేసి ప్రారంభించారు.

28 ఉదయం పిండ ప్రదాన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సహకార శాఖా మాత్యులు శ్రీకన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ రామకృష్ణారావు, స్థానిక యం.యల్.ఎ శ్రీమాణిక్యవరప్రసాద్ తోడురాగా ప్రారంభించి, అభినందించారు.

శాంతికుంజ్ ప్రతినిధులు డా॥తుమ్మూరి, శ్రీఉత్తమ్ గైక్వాడ్, శ్రీ అరుణ్‌ల సహకారంతో 12 రోజులలో వెయ్యిమంది పైగా పిండప్రదానం - తర్పణలు చేశారు.

నవకుండీ యజ్ఞశాలలో 12 రోజులలో సుమారు 2000మంది గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొని ఆహుతు లిచ్చారు. గాయత్రీ యజ్ఞ నిర్వహణ బాధ్యతను శ్రీమతి తుమ్మూరి దాసమ్మ, శ్రీ వి.కోటేశ్వరరావు, శ్రీ సంతోష్ అగ్నిహోత్రి, శ్రీమతి మునిలక్ష్మమ్మ (తిరుపతి), శ్రీ కె.భద్రారెడ్డి నిర్వర్తించారు.

పుస్తకాల బాధ్యతను శ్రీ జి.గణేష్, శ్రీ ఉడతా చంద్రశేఖర్, శ్రీ కె.సత్యనారాయణ, శ్రీ మార్కండేయులు నిర్వర్తించగా, శ్రీబి.యన్.రావు, శ్రీమతి కొల్లి తిరుపతమ్మ భోజనశాల బాధ్యతను నిర్వహించారు. సుమారు 2000 మంది భోజన ప్రసాదం స్వీకరించారు.

సెప్టెంబరు 7వ తేది సాయంకాలం కలెక్టరు గారితో సహా 70 మంది వివిధ శాఖల అధికారులందరికీ గురుదేవుల సాహిత్యమును అభినందిస్తూ ఇచ్చాం.

శ్రీ కృష్ణ చైతన్య, శ్రీ బి.రామారావులు గాయత్రీ శక్తి పీఠం - కార్యక్రమ స్థలానికి సమన్వయకర్తలుగా పనిచేశారు.

5వ తేది సాయంకాలం శాంతికుంజ్ ప్రతినిధులు ఆలయ ఆవరణలో దర్శనం గురించి అడిగి తెలుసుకుంటూఉండగా, వెనుక నుండి వచ్చిన దేవాలయం నిర్వహణాధికారి వి.ఐ.పి పాస్‌లు 4 డా॥తుమ్మూరిగారి చేతిలో పెట్టి వెళ్ళిపోయారు. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు అందరూ ఆశ్చర్యచకితు లయినారు.

ఆ 12 రోజులలో దేనికీ కొరత లేదు. పిండ ప్రదానంనకు కావలసిన వస్తువులు కూడా గాయత్రీ శక్తి పీఠం సమకూర్చింది. వందలాది పురోహితులు నేలమీద కూర్చుని ఇబ్బంది పడుతూ కర్మకాండ చేస్తూ ఉంటే, వేదిక మీద గురుదేవులు మాతాజీ గాయత్రీ మాతలను ఏర్పాటు చేసి మైకు సహాయంతో కార్యకర్తలు ఆ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం ఆ నదీప్రాంతంలోని పిండప్రదాన కార్యక్రమానికి ప.పూ.గురుదేవులు అధ్యక్షత వహించారా అన్నట్లున్నది.

ఈ కార్యక్రమం ఫలితంగా - దాదాపుగా గుంటూరు జిల్లా అంతటా గాయత్రీ పరివార్, శాంతికుంజ్ హరిద్వార్, గాయత్రీ శక్తిపీఠం తెలిసిపోయాయి. మరో 12 ఏళ్ళదాకా వారు దీన్ని గురించే చెప్పుకుంటారు.

H H H

**మౌనం అంటే అవసరంకాని విషయాలను భావించకుండా ఉండడం.**